www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



వినతుల వెల్లువ!

తొలిరోజు 3,410 గ్రామసభల నిర్వహణ
పథకాల జాబితాలో పేర్లు లేవని ప్రజల అసంతృప్తి
మళ్లీ దరఖాస్తు చేసుకోమని అధికారుల సూచన
రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 47,413 దరఖాస్తులు
అనర్హులను ఎంపిక చేశారంటూ నిరసనలు
యాదాద్రి జిల్లాలో దరఖాస్తులు వదిలేసిన సిబ్బంది
ఇద్దరు మునిసిపల్ బిల్ కలెక్టర్ల సస్పెన్షన్ 14

బుధవారం | 22-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 294 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి మ. 3.18 తదుపరి నవమి; నక్షత్రం: స్వాతి రా. 2.34 తదుపరి విశాఖ; వర్జ్యం: శేషం ఉ. 7.42 వరకు; దుర్ముహూర్తం: మ. 12.04-12.49; అమృతఘడియలు: సా. 4.41-6.28; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం:6.52; సూర్యాస్తమయం: 6.01 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఛత్తీస్‌గఢ్-ఒడిసా సరిహద్దుల్లో..

16 మంది మావోయిస్టుల కాల్చివేత

మృతులు 27 అని కూడా ప్రచారం.. వీరిలో కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి

ఈయన స్వస్థలం ఏపీలోని చిత్తూరు జిల్లా.. చంద్రబాబుపై అలిపిరి దాడిలో సూత్రధారి
మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యులు మనోజ్, గుడ్డు, బాలన్న, నల్లగొండకు చెందిన హనుమంతు?
వ్యూహాత్మకంగా వ్యవహరించిన పోలీసులు.. నిఘా సమాచారంతో గరియాబంద్ దిగ్బంధం
వెయ్యి మంది జవాన్లు.. డ్రోన్లతో మావోయిస్టుల కదలికల గుర్తింపు.. 40 గంటల పైగా కాల్పులు
కొనసాగుతున్న ఎన్‌కౌంటర్.. గొప్ప విజయంగా అభివర్ణించిన కేంద్ర హోంశాఖ మంత్రి షా

చర్ల/చింతూరు/చుండూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. గరియాబంద్- ఒడిసాల్లోని నౌపాడ జిల్లాల పరిధిలోని కుల్హారిఘాట్ అడవుల్లో రెండ్రోజులుగా జరుగుతున్న భారీ ఎన్‌కౌంటర్‌లో 16 మంది మావోయిస్టులు మృతిచెందారు. అయితే, మృతుల సంఖ్య 27గా ప్రచారం జరుగుతోంది. మృతుల్లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి అలియాస్

మిగతా 3వ పేజీలో...



దండకారణ్యంలో.. ఎర్రకోటకు బీటలు!

20 ఏళ్ల ఆధిపత్యానికి చెక్.. ఎన్‌కౌంటర్లతో దళాలు కకావికలం
650 క్యాంపులతో బలగాల నిఘా.. 'ఆపరేషన్ కగార్'తో పైచేయి
ఏడాది వ్యవధిలో 300 మంది మావోయిస్టుల మృతి 3

మిగిలిన 14 మంది తెలుగువాళ్లే..!

కేంద్ర కమిటీలో ఆరోగ్య సమస్యలు
నిఘా వర్గాల చేతికి కీలక సమాచారం
అగ్రనేతల్ని కాపాడుకోవడం సవాలు
దాడులు చేయలేని స్థితిలో హిడ్మా 3


హనుమంతు (ఫైల్)

అమెరికాలో జన్మతః

పౌరసత్వంపై వేటు

ఉత్తర్వుల ఉప్పెన!

అమెరికాలోని లక్షలాది భారతీయుల ఆశలపై నీళ్లు


కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకాలు చేసిన అనంతరం పెన్నును విసిరేస్తున్న డొనాల్డ్‌ట్రంప్

అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తొలిరోజే ట్రంప్ సంచలనాలు
డజన్ల కొద్దీ పాలనా ఉత్తర్వులపై వరుసగా సంతకాలు
ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి బయటికి అమెరికా!
పారిస్ పర్యావరణ ఒప్పందం నుంచీ నిష్క్రమణ
గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరు గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్పు
లింగవైవిధ్యానికి చెల్లు.. ఇక స్త్రీ, పురుష లింగాలు మాత్రమే
ఫెడరల్ ఉద్యోగులకు ఇంటి నుంచి పని విధానం రద్దు
క్యాపిటల్ భవనంపై దాడి నిందితులకు క్షమాభిక్ష
వెస్ట్‌బ్యాంక్‌లోని ఇజ్రాయెల్ సెటిలర్లపై ఆంక్షల ఎత్తివేత
టిక్‌టాక్‌పై నిషేధం అమలు 75రోజులపాటు వాయిదా
ఫిబ్రవరి 1 నుంచి కెనడా, మెక్సికోపై 25 శాతం సుంకాలు?

వాషింగ్టన్ డీసీ, జనవరి 21: అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. మొదటి రోజే ఉత్తర్వుల వర్షం కురిపించారు! ఆ దేశ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా తొలి రోజే డజన్ల కొద్దీ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లతో సంచలనం సృష్టించారు. అందులో ప్రధానమైనది.. అమెరికాలో పుట్టినవారికి ఆటోమేటిగ్గా పౌరసత్వాన్ని ప్రసాదించే హక్కును రద్దు చేసే ఉత్తర్వు! ఉద్యోగాల నిమిత్తం అమెరికాలో ఉంటూ.. ఆగడ్డపై పిల్లలను కనడం ద్వారా కనీసం వారికైనా పౌరసత్వం దక్కుతుందని ఆశిస్తున్న లక్షలాది మంది ప్రవాసభారతీయులకు ఈ ఉత్తర్వు అశనిపాతమే! అదొక్కటే కాదు.. ఇంధన రంగం, పర్యావరణం, వలసలు, విదేశాంగ విధానం.. ఇలా పలు రంగాలకు సంబంధించిన ఉత్తర్వులపై ట్రంప్ సంతకాలు చేశారు. సాధారణంగా అధ్యక్ష

మిగతా 2వ పేజీలో...

ఉపాధ్యక్ష పదవికి ఉషా అయితే బాగుండేది! 2
తెలుగింటి ఆడపడుచుపై ట్రంప్ ప్రశంసలు

ట్రంప్ టారిఫ్ షాక్ 11
మార్కెట్ పతనం.. 7 లక్షల కోట్లు ఆవిరి

బర్త్ టూరిజానికి అడ్డుకట్ట

ట్రంప్ నిర్ణయంతో అమెరికాలో ఎన్నారైలకు పుట్టే పిల్లలెవరికీ పౌరసత్వం దక్కదు
గ్రీన్‌కార్డు కోసం నిరీక్షిస్తున్న వారికీ ఇబ్బందులే!
అమలు సులువేమీ కాదు.. రాజ్యాంగ సవరణ క్లిష్టం 2



యూనీలీవర్ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

యూనీలీవర్‌తో బోణీ

పామాయిల్ ఫ్యాక్టరీ, రిఫైనింగ్ పరిశ్రమ విస్తరణ

కొత్తగా సీసా మూతల యూనిట్ ఏర్పాటుకు సిద్ధం.. దావోస్ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వ తొలి ఒప్పందం
కామారెడ్డిలో స్థలం ఇస్తామన్న సీఎం.. మెఘా రూ.15 వేల కోట్ల పెట్టుబడులు.. 3 ఒప్పందాలు..
పంప్డ్, ఎనర్జీ స్టోరేజీ, పర్యాటకంలో ప్రాజెక్టులు.. 500 కోట్లతో స్కైరూట్ రాకెట్ తయారీ కేంద్రం
పలువురు పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చలు

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దావోస్‌లో పెట్టుబడుల సాధనలో తెలంగాణ ప్రభుత్వం బోణీ కొట్టింది. విస్తరణ ప్రణాళికలో భాగంగా తెలంగాణలో రెండు తయారీ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని యూనీ లీవర్ కంపెనీ తెలిపింది. తెలంగాణలో పామాయిల్ ఫ్యాక్టరీ, రిఫైనింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని; సీసా మూతలు ఉత్పత్తి చేయడానికి కొత్త తయారీ యూనిట్ పెడతామని ప్రకటించింది. యూనీ లీవర్ ఉత్పత్తులు ఎక్కువగా ద్రవ రూపంలో సీసాల్లో అమ్ముడవుతున్నాయి. ప్రస్తుతం బాటిల్ క్యాప్‌లను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. రాష్ట్రంలోనే సీసా మూతలను ఉత్పత్తి చేస్తే దిగుమతి అవసరం ఉండదని కంపెనీ తెలిపింది. పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చిన యూనీ లీవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని, కామారెడ్డి జిల్లాలో తగిన స్థలాన్ని కేటాయిస్తామని స్పష్టం చేశారు. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం మంగళవారం పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశమైంది. పెట్టుబడుల ఆకర్షణకు ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్లో యూనీ లీవర్ సీఈవో హీన్ షూ మేకర్, చీఫ్ సప్లయ్ చైన్ ఆఫీసర్ విల్లెం ఉయిజెన్‌తో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు చర్చలు జరిపారు. వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచ దిగ్గజ కంపెనీగా యూనీలీవర్‌కు పేరుంది. మన దేశంలో హిందుస్థాన్ లీవర్ పేరిట వ్యాపారాలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో ఉన్న వ్యాపార అవకాశాలను

మిగతా 13వ పేజీలో...


జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట విచారణకు వెళ్తున్న రామకృష్ణారావు (ఎడమ)

13

కాళేశ్వరం రుణాలను సర్కారే చెల్లిస్తుంది

ఆ మేరకు కార్పొరేషన్‌కు పూచీకత్తు ఇచ్చింది
ఈ ఏడాది రూ.6,519 కోట్ల వడ్డీ, రూ. 7,382 కోట్ల అసలు చెల్లించాం
ఆదాయం పెరగడానికి కొంత సమయం..
వడ్డీ భారం తగ్గించేందుకు ప్రయత్నాలు
జస్టిస్ ఘోష్ కమిషన్‌కు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వివరణ

అదనపు అప్పులకు

కేంద్రం ససేమిరా



రూ.4,500 కోట్ల రుణం ఫట్

చివరి త్రైమాసికంలో రూ.30 వేల కోట్లకు ప్రభుత్వం ఇండెంట్లు
రిజర్వు బ్యాంకు వేలం ద్వారా రుణం సేకరణకు యత్నం
పరిమితికి మించి ఉండటంతో అంగీకరించని కేంద్ర ప్రభుత్వం
ఈ నెలలో రూ.10 వేల కోట్లకు దక్కింది రూ.3 వేల కోట్లే
14, 21 తేదీల్లో వేలంలో పాల్గొనటానికి దొరకని అవకాశం
28న రూ.2,500 కోట్లపై ఆశ.. కేంద్రం అనుమతి సందేహమే!

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): చివరి త్రైమాసికంలో పెద్ద మొత్తంలో అప్పు తీసుకోవాలనుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఆశలపై కేంద్రం నీళ్లు చల్లుతోంది. ప్రభుత్వం పెట్టిన ఇండెంట్ల మేర అప్పు తీసుకోవడానికి అవకాశం లేదని తేల్చి చెబుతోంది. మూడు నెలల్లో సేకరించాలనుకున్న రూ.30 వేల కోట్ల రుణంలో ఇప్పటికే రూ.4,500 కోట్ల మేర కోత పెట్టగా.. మరింత అప్పునకు కోతలు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నెల 28న

మిగతా 12వ పేజీలో...

విశ్వవిద్యాలయాలు

కేంద్రం గుప్పిట్లోకి!

యూజీసీ ముసాయిదా అభ్యంతరకరం



రాష్ట్రాల హక్కులను హరించడమే
కేంద్రానికి లేఖ రాయనున్న ప్రభుత్వం
వీసీల నియామకాల్లో పాత్రే ఉండదు
ప్రొఫెసర్ల నియామకాల్లో మార్పులు
ముసాయిదాపై ముఖ్యమంత్రికి నివేదిక

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల్లో సంస్కరణల కోసం 'యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)' రూపొందించిన ముసాయిదాను వ్యతిరేకించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ముసాయిదా అమల్లోకి వస్తే విశ్వవిద్యాలయాలు కేంద్రం గుప్పిట్లోకి వెళతాయని ఆందోళన చెందుతోంది. ఇది తీవ్ర అభ్యంతరకరంగా ఉందంటూ కేంద్రానికి లేఖ రాయనుంది. రాష్ట్రాల హక్కులను హరించడానికే కేంద్రం ప్రభుత్వం ఈ ముసాయిదా రూపొందించినట్లుగా ఉందని ఆరోపిస్తోంది. యూజీసీ తాజాగా రూపొందించిన ముసాయిదాపై అభిప్రాయాలను తెలియజేయాలంటూ పబ్లిక్ డొమైన్‌లో ఉంచింది. ఇప్పటికే కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు ఈ ముసాయిదాను వ్యతిరేకిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీన్ని వ్యతిరేకించాలని

మిగతా 14వ పేజీలో...


రఫీక్‌పై దాడి చేస్తున్న ఎంపీ ఈటల, ఆయన అనుచరులు

రియల్టర్ అనుచరుడిపై

ఎంపీ ఈటల దాడి

ప్లాట్లు కొన్నవారిని ఇబ్బంది పెడుతున్నారంటూ కొట్టిన వైనం
ఆపై దాడికి దిగిన ఎంపీ అనుచరులు.. ఇద్దరికి గాయాలు
పోలీసులకు బాధితుల ఫిర్యాదు.. ధర్మాన్ని కాపాడేందుకే: ఈటల

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ రాజకీయ జీవితంలో సౌమ్యుడిగా పేరున్న బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్.. ఆవేశానికి లోనయ్యారు. పేద ప్రజలు కొనుక్కున్న స్థలాల్లో ఇల్లు కట్టుకునేందుకు వారికి అనుమతులు రాకుండా ఇబ్బంది పెడుతున్నారంటూ ఓ రియల్ వ్యాపారి అనుచరుడిపై చేయి చేసుకున్నారు. ఆ వెంటనే ఈటల అనుచరులు కూడా అతనిపై దాడికి పాల్పడ్డారు. దీంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. మంగళవారం

మిగతా 13వ పేజీలో...

జీహెచ్‌ఎంసీ మేయర్‌పై అవిశ్వాసం!

గ్రేటర్‌పై పట్టు నిలుపుకొనేలా బీఆర్ఎస్ పార్టీ వ్యూహం
ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ భేటీ.. సుదీర్ఘ చర్చ
పార్టీ బలాబలాలను పరిగణనలోకి తీసుకొని ముందుకు
ఫిబ్రవరి 10 అనంతరం అవిశ్వాసానికి అవకాశం
50 శాతం సభ్యుల మద్దతుంటేనే పెట్టేందుకు వీలు 14


దిల్‌రాజు ఇల్లు, ఆఫీసుపై ఐటీ దాడులు

భార్యను బ్యాంకుకు తీసుకెళ్లి లాకర్‌ను తెరిపించిన అధికారులు 10
కుమార్తె హన్సిత, సోదరుడు శిరీష్ నివాసాలలోనూ ఏకకాలంలో..
సినీ ప్రముఖులు టార్గెట్‌గా హైదరాబాద్‌లో 55 బృందాల సోదాలు
పుష్ప-2 నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ పత్రాల పరిశీలన
అవకతవకల గుర్తింపు.. కొత్త సినిమాల కలెక్షన్ల లెక్కలపై ఆరా



కృష్ణా జలాల తరలింపును అడ్డుకోండి!

టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటుకు అయ్యే వ్యయం భరిస్తాం
సాగర్‌ను అప్పగించాలి.. కృష్ణాజలాల్లో 71% కేటాయించాలి
ట్రైబ్యునల్ తీర్పు వరకు 50:50%.. కేఆర్‌ఎంబీని కోరిన సర్కార్
త్రిసభ్య కమిటీలో చర్చించి నిర్ణయిద్దామన్న బోర్డు
అంగీకరించిన తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు 12



జన్మతః పౌరసత్వంపై వేటు

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యతలు స్వీకరించినవారు.. వైట్‌హౌస్‌లోని తమ కార్యాలయానికి వెళ్లిన తర్వాత పని మొదలుపెట్టడం కద్దు! కానీ.. ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసీచేయగానే, అక్కడికక్కడే తన ఉత్తర్వుల దండయాత్ర మొదలుపెట్టారు. మాజీ అధ్యక్షుడు బైడెన్ గతంలో జారీ చేసిన 78 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లను రద్దు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుపై తొలి సంతకం పెట్టారు. పాలనపై తన ప్రభుత్వం పూర్తిస్థాయిలో పట్టు సాధించేదాకా ప్రభుత్వ అధికారులు ఎలాంటి నిబంధనలూ జారీ చేయకుండా నిషేధించే ఉత్తర్వుపై మలి సంతకం.. అప్పటిదాకా సైన్యం, కొన్ని కీలక రంగాల్లో మినహా ఫెడరల్ ఉద్యోగాల నియామకాలను నిలిపివేసే ఉత్తర్వుపై మూడో సంతకం చేశారు. ఆ తర్వాత.. ఫెడరల్ ఉద్యోగులు ప్రత్యక్షంగా ఆఫీసుకు వచ్చి, పూర్తి సమయం పనిచేయడాన్ని తప్పనిసరి చేస్తూ నాలుగో ఉత్తర్వు జారీ చేశారు. పెరుగుతున్న జీవన వ్యయం సమస్యను పరిష్కరించే బాధ్యతను అన్ని ప్రభుత్వ విభాగాలు, ఏజెన్సీలపై పెడుతూ ఐదో ఉత్తర్వు.. పారిస్‌లో 2015లో కుదుర్చుకున్న పర్యావరణ ఒప్పందం నుంచి వైదొలగుతూ ఆరో ఉత్తర్వు.. భావవ్యక్తీకరణ స్వేచ్ఛను పరిరక్షిస్తూ ఏడో ఉత్తర్వు.. రాజకీయ ప్రత్యర్థులపై ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను ఉసిగొలిపే విధానానికి చెక్‌పెడుతూ (ఎండింగ్ ద వెపనైజేషన్ ఆఫ్ ఫెడరల గవర్నమెంట్) ఎనిమిదో ఉత్తర్వు జారీ చేశారు! అలాగే.. తన క్యాబినెట్ సహచరులు, సీఐఏ డైరెక్టర్, ఇతరత్రా కీలక పదవులకు సంబంధించి నియామక ఉత్తర్వులపైనా సంతకాలు చేశారు. అనంతరం ట్రంప్ తన చేతిలోని పెన్నును.. ప్రమాణ స్వీకారానికి హాజరై హర్షధ్వానాలు చేస్తున్న తన మద్దతుదారుల వైపునకు విసిరేశారు! దీంతో వారి హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. వారి స్పందనను గమనించిన ట్రంప్.. తన బల్లపై ఉన్న మిగతా పెన్నులను కూడా.. ఒక్కొక్కటిగా వారి వైపునకు విసరడంతో అంతా ఆ పెన్నులను పట్టుకుని వాటితో సెల్ఫీలు దిగడం కనిపించింది. అనంతరం శ్వేతసౌధంలోని తన కార్యాలయానికి చేరుకున్న ట్రంప్.. 2021 జనవరి 6న క్యాపిటల్ భవనంపై జరిగిన దాడికి సంబంధించిన కేసులో 1500 మంది నిందితులకు క్షమాభిక్ష ప్రసాదిస్తూ మరో ఉత్తర్వు జారీ చేశారు. వారందరిపై ఉన్న అన్ని కేసులనూ కొట్టేయాలని ఆదేశాలిచ్చారు. అలా ఆయన జారీ చేసిన మరికొన్ని కీలక ఉత్తర్వులు..

పుట్టుకతో పౌరసత్వ హక్కు: ఇప్పటిదాకా ఉన్న నిబంధనల ప్రకారం.. పర్యాటక/ఉద్యోగి/విద్యార్థి వీసాలపైన, మరేదైనా కారణాల వల్ల అమెరికాకు వచ్చినవారికి ఆ గడ్డపై పిల్లలు పుడితే వారికి అమెరికా పౌరసత్వం (బర్త్ రైట్ సిటిజెన్‌షిప్) వస్తుంది. ఆ హక్కుపై వేటు వేస్తూ ట్రంప్ తొలిరోజే ఉత్తర్వులు జారీ చేశారు. అక్రమ వలసదారులకు అమెరికాలో పుట్టే పిల్లలకు లభించే పౌరసత్వాన్ని తమ ప్రభుత్వం గుర్తించదని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, ఈ ఉత్తర్వు రాజ్యాంగంలోని 14వ సవరణకు విరుద్ధమని హక్కుల సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అయితే.. జన్మతః పౌరసత్వహక్కు అందరికీ వర్తించదని, అందుకు కొన్ని నిబంధనలు వర్తిస్తాయని (సబ్జెక్ట్ టు ద జ్యూరిస్‌డిక్షన్ దేర్ ఆఫ్) ఆ సవరణలోనే ఉన్నదని ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో పేర్కొన్నారు. ఆ నిబంధన ప్రకారం.. అక్రమంగా అమెరికాలో ఉండే మహిళలకు జన్మించే పిల్లలకు, ఆ పిల్లల తండ్రి అమెరికన్ పౌరుడు/చట్టబద్ధమైన శాశ్వత నివాస హోదా లేనివాడు అయితే జన్మతః పౌరసత్వ హక్కువర్తించదు. అలాగే.. అమెరికాలో చట్టబద్ధంగానే ఉంటున్నప్పటికీ తాత్కాలికంగా (విద్యార్థి/ఉద్యోగి/పర్యాటక వీసాలపై) నివసించే మహిళలకు పుట్టే పిల్లలకు ఆ పిల్లల తండ్రి అమెరికన్ పౌరుడు/చట్టబద్ధమైన శాశ్వత నివాస హోదా లేనివాళ్లకు జన్మతః పౌరసత్వ హక్కు వర్తించదు.

పేర్ల మార్పు: గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును 'గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా మారుస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. అయితే.. ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా అమెరికా ఈ జలసంధి పేరు మార్చేస్తే సరిపోదు. ప్రపంచమంతా ఆ పేరును గుర్తించాలంటే పలు అంతర్జాతీయ సంస్థలు ఆ మార్పును ఆమోదించాల్సి ఉంటుంది. అలాగే.. ఉత్తర అమెరికాలోనే అత్యంత ఎత్తైన పర్వతమైన 'మౌంట్ డెనాలీ' పేరును 'మౌంట్ మెక్‌కిన్లే'గా మార్చేశారు. నిజానికి ఆ పర్వతం పేరు మొదట్లో మౌంట్ మెక్‌కిన్లేగానే ఉండేది. 2015లో ఒబామా దాని పేరును మౌంట్ డెనాలీగా మార్చారు. ట్రంప్ పాతపేరును పునరుద్ధరించారు.

పారిస్ ఒప్పందం నుంచి వెనక్కి: పెరిగిపోతున్న భూతాపానికి అడ్డుకట్ట వేసేలా.. కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు 2015లో పారిస్‌లో ప్రపంచ దేశాలు కుదుర్చుకున్న ఒప్పందం నుంచి అమెరికా వైదొలగుతున్నట్టుగా ట్రంప్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పుడే కాదు.. ట్రంప్ ఎప్పట్నుంచో ఈ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్నారు. అమెరికా అభివృద్ధిని అడ్డుకునే కుట్రగా ఈ ఒప్పందాన్ని ఆయన గతంలో అభివర్ణించారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకే తాజా ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్క పారిస్ ఒప్పందం నుంచే కాదు.. అమెరికా అభివృద్ధికి అడ్డంకిగా మారే అన్ని అంతర్జాతీయ ఒప్పందాల నుంచీ వైదొలగేలా.. 'యూఎన్ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ చేంజ్'కు సంబంధించి గతంలో అమెరికా ఏదైనా ఆర్థికసాయం అందిస్తానని ప్రకటించి ఉంటే వాటి నుంచి కూడా వైదొలగేలా ఉత్వర్వులు జారీ చేశారు.

డబ్ల్యూహెచ్‌వో నుంచి నిష్క్రమణ: కొవిడ్-19 మహమ్మారి కట్టడిలో విఫలమైన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నుంచి అమెరికా నిష్క్రమించాలని ట్రంప్ తొలి హయాంలోనే నిర్ణయించారు. తర్వాత ఆయన ఎన్నికల్లో ఓడిపోయారు. అధికారంలోకి వచ్చిన బైడెన్ ఆ నిర్ణయాన్ని రద్దుచేశారు. అయితే.. తాను అధికారంలోకి వస్తే డబ్ల్యూహెచ్‌వో నుంచి అమెరికా వైదొలగేలా చేస్తానని ట్రంప్ అప్పట్నుంచీ చెబుతూనే వచ్చారు. ఎన్నికల ప్రచారంలో ఆయన ఇచ్చిన ప్రధాన హామీల్లో ఇది కూడా ఒకటి. అమెరికా నిష్క్రమణతో.. ప్రపంచ ఆరోగ్య సంస్థకు ఏటా 130 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.1124 కోట్ల) ఆర్థికసాయం అందకుండా పోతుందని అంచనా.

లింగ నిర్వచనం, డీఈఐ కార్యక్రమాల రద్దు: అమెరికా వ్యాప్తంగా చాలా మంది తమ లింగానికి సంబంధించి వాస్తవాలను అంగీకరించడానికి ఒప్పుకోవట్లేదని.. పురుషులు తమను తాము అమ్మాయిలుగా ప్రకటించుకొని, మహిళలకు ఉద్దేశించిన కార్యకలాపాల్లోకి చొరబడుతున్నారని.. ఇకపై అలాంటివి చెల్లబోవని స్పష్టం చేస్తూ ట్రంప్ ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. దీని ప్రకారం అమెరికా ఇకపై రెండు లింగాలను మాత్రమే గుర్తిస్తుంది. అవి.. స్త్రీ, పురుషుడు. పుట్టుకతో వచ్చిన ఈ లింగాలను సొంత విచక్షణ పేరుతో మార్చుకోవడం.. పురుషులు తమను తాము మహిళలుగా చెప్పుకోవడం, మహిళలు తమను తాము పురుషులుగా చెప్పుకోవడం కుదరదు. మహిళలు, బాలికలు అందరూ 'స్త్రీ' కేటగిరీలోకి వస్తారు. మగవారు, బాలురు 'పురుషుల' కేటగిరీలోకి వస్తారు. ప్రభుత్వ విధానాల్లో, ఉత్తరప్రత్యుత్తరాల్లో జెండర్ ఐడెంటిటీని, జెండర్ ఐడియాలజీని ప్రోత్సహించవద్దని ఆదేశించారు. అంతేనా.. ప్రస్తుతం అమెరికాలోని జైళ్లల్లో ఉన్న ఖైదీలలో ట్రాన్స్ మెన్ (స్త్రీగా జన్మించి తమను తాము పురుషులుగా భావించేవారు) అందరినీ మహిళల జైళ్లలో వేయాలని, అదే తరహాలో ట్రాన్స్ వుమెన్ ఖైదీలను పురుషుల జైళ్లలోకి తరలించాలని కూడా ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే.. కుల, మత, జాతి, వర్ణ వివక్ష నిర్మూలనకు ఫెడరల్ ప్రభుత్వం చేపట్టిన 'డైవర్సిటీ, ఈక్విటీ అండ్ ఇంక్లూజన్ (వైవిధ్యం, సమానత్వం, కలుపుకొనిపోయే తత్వం)' కార్యక్రమాలన్నింటినీ కూడా రద్దు చేస్తూ మరో ఆర్డర్‌ను ట్రంప్ జారీ చేశారు.



కొన్ని నిర్ణయాల అమలు.. అంత ఈజీ కాదు!

ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్ ఇచ్చిన హామీల్లో చాలావాటిని ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ల ద్వారానే అమలు చేయొచ్చు. కానీ, పుట్టుకతో పౌరసత్వ హక్కు వంటి మరికొన్ని నిర్ణయాల అమలుకు మాత్రం చట్టపరంగా పలు అడ్డంకులు ఎదురవుతాయి. వాటిపై న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు దాఖలవుతాయి. ఆ అడ్డంకులన్నింటినీ అధిగమించి వాటిని అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ అవసరం. అమెరికా ప్రతినిధుల సభలో (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్) రిపబ్లికన్లకు స్వల్ప ఆధిక్యం మాత్రమే ఉంది. సెనెట్‌లో సైతం.. ఏదైనా చట్టం అమలుకాకుండా సభ్యులు అడ్డుకునే వీలు కల్పించే 'ఫిలిబస్టర్' అనే ప్రక్రియ ఉంది. కాబట్టి, ట్రంప్ ఆ నిర్ణయాల అమలుకు డెమొక్రటిక్ సభ్యుల సహకారం తప్పనిసరి.

కెనడా, మెక్సికోపై 25% సుంకాలు

అమెరికాలోకి అక్రమ వలసలను, మాదకద్రవ్యాలను నిరోధించడంలో విఫలమవుతున్న కెనడా, మెక్సికోపై ఫిబ్రవరి 1 నుంచి 25% సుంకాలను విధించే ఆలోచనలో ఉన్నట్టు ట్రంప్ తెలిపారు. అంతకుముందు.. అమెరికన్ కార్మికులను, కుటుంబాలను కాపాడేందుకుగాను అమెరికా వాణిజ్యవ్యవస్థ ప్రక్షాళనను తక్షణమే ప్రారంభించనున్నట్టు ప్రకటించారు.

దక్షిణ సరిహద్దుల్లో అత్యవసర స్థితి

మెక్సికన్ డ్రగ్ కార్టెల్స్‌ను, ఇతర నేర సంస్థలను విదేశీ ఉగ్రవాద సంస్థలుగా ప్రకటిస్తూ మరో ఉత్తర్వు జారీ చేశారు. అలాగే.. మెక్సికో నుంచి అక్రమ వలసలను అడ్డుకునేందుకు అమెరికా దక్షిణ సరిహద్దుల్లో అత్యవసర పరిస్థితి విధించారు. దీనివల్ల కాంగ్రెస్ ఆమోదం అవసరం లేకుండానే.. ఫెడరల్ నిధులతో అమెరికా-మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మించేందుకు వీలు కలుగుతుంది.


నలుగురు ఉద్యోగులపై వేటు!

రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ట్రంప్ తొలిరోజు వుంఖానువుంఖాలుగా పాలనా ఉత్తర్వులు జారీచేయడమే కాదు.. మాజీ అధ్యక్షుడు బైడెన్ నియమించిన నలుగురు సీనియర్ అధికారులపై వేటు కూడా వేశారు. వారితోపాటు మరో వెయ్యి మందిని తొలగిస్తామంటూ.. తన సొంత సామాజిక మాధ్యమమైన 'ట్రూత్ సోషల్' ద్వారా ట్రంప్ బహిరంగ హెచ్చరిక జారీ చేశారు.

టిక్‌టాక్‌కు ఊరట: టిక్‌టాక్ నిషేధానికి సంబంధించి.. బైడెన్ సర్కారు విధించిన నిషేధం అమలును 75 రోజుల పాటు వాయిదావేస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేయడం ద్వారా దాని మాతృసంస్థ 'బైట్‌డ్యాన్స్'కు ట్రంప్ ఊరట కల్పించారు. వాస్తవానికి ఈ నిషేధం జనవరి 19నే అమల్లోకి వచ్చింది. ఈమేరకు అమెరికాలో టిక్‌టాక్ సేవలు కొన్నిగంటలపాటు నిలిచిపోయాయి కూడా. ట్రంప్ రూపంలో టిక్‌టాక్ మళ్లీ ఊపిరి పీల్చుకుంది. మరోవైపు వెస్ట్‌బ్యాంక్‌లో స్థిరపడ్డ ఇజ్రాయెలీ సెటిలర్లపై గత బైడెన్ సర్కారు 2024 ఫిబ్రవరిలో విధించిన ఆంక్షలను ఎత్తివేస్తూ ట్రంప్ పాలనా ఉత్తర్వు జారీ చేశారు.



ప్రమాణస్వీకార కార్యక్రమంలో భాగంగా కేక్ కోస్తున్న ట్రంప్



సతీమణి మెలానియాతో ట్రంప్ నృత్యం

లోకం తీరు



పుతిన్ వల్లే రష్యా నాశనం: ట్రంప్

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వల్లే ఆ దేశం నాశనం అవుతోందని ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పుతిన్ ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందం చేసుకోకుండా రష్యాను నాశనం చేస్తున్నారని ఆయన విలేకరులతో అన్నారు. త్వరలోనే పుతిన్‌ను స్వయంగా కలుస్తానని ట్రంప్ ఈ సందర్భంగా ప్రకటించారు. ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందానికి పుతిన్ ఇకనైనా అంగీకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు, అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. ప్రమాణ స్వీకారం చేసిన కాసేపటికే ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను తలుచుకున్నారు. సైనికుల గౌరవార్థం నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యక్షుడు ట్రంప్.. దక్షిణ కొరియాలో ఉన్న అమెరికా సైనికులతో శాటిలైట్ కాల్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా కిమ్ జోంగ్ ఉన్ ఎలా ఉన్నారని? సైనికులను ప్రశ్నించారు. కిమ్ ఓ పట్టాన వినే రకం కాదన్నారు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కాసేపటికే అంతర్జాతీయంగా కీలక పరిణామం చోటు చేసుకుంది. రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వీడియో కాల్‌లో మాట్లాడుకున్నారు.

ఎలాన్ మస్క్ 'డోజ్'పై దావా.. ట్రంప్‌కు షాక్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నూతన కార్యవర్గం ఏర్పాటు చేసిన డోజ్(డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ) చట్టపరమైన చిక్కుల్లో ఇరుక్కుంది. ప్రభుత్వ ఖర్చుల్లో వృథాను గుర్తించి, నిధులను ఆదా చేసేందుకు, ప్రభుత్వ వ్యవస్థల్లో సమూల మార్పులకు ఎలాన్ మస్క్ అధ్యక్షతన డోజ్‌ను ట్రంప్ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసిన గంటల వ్యవధిలోనే అమెరికా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం.. ఏఎఫ్‌జీఈ.. డోజ్ చెల్లుబాటుపై వాషింగ్టన్‌లోని ఓ న్యాయస్థానంలో దావా వేసి అధ్యక్షుడికి షాకిచ్చింది.

డోజ్ బాధ్యతలు వద్దు : వివేక్ రామస్వామి

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏర్పాటు చేసిన డోజ్ బాధ్యతల నుంచి భారతీయ, అమెరికన్ వ్యాపారవేత్త వివేక్ రామస్వామి తప్పుకున్నారు. డోజ్ బాధ్యతలను ఎలాన్ మస్క్‌తోపాటు వివేక్ రామస్వామికి ట్రంప్ అప్పగించారు. అయితే, ఒహాయో గవర్నర్ ఎన్నికల బరిలో నిలిచే ఆలోచనలో ఉన్న నేపథ్యంలో డోజ్ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నానని రామస్వామి ప్రకటించారు. డోజ్ ఏర్పాటులో తాను కీలకంగా వ్యవహరించడం సంతోషంగా ఉందని, డోజ్ లక్ష్య సాధనలో మస్క్ బృందం విజయం సాధిస్తుందన్నారు.

సత్యం.. సుందరం!

- ప్రపంచ ప్రభావశీల భారతీయుల్లో వీరే టాప్
- హురున్ గ్లోబల్ ఇండియన్స్ లిస్ట్ విడుదల



న్యూఢిల్లీ, జనవరి 21: అత్యంత ప్రభావశీలురైన ప్రపంచ భారతీయుల్లో మైక్రోసాఫ్ట్ సీఈవో, ఛైర్మన్ సత్య నాదెళ్ల అగ్రస్థానం దక్కించుకున్నారు. రెండో స్థానంలో గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ నిలిచారు. ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీలకు దిశానిర్దేశం చేస్తున్న భారతీయ సంతతి వ్యక్తులతో కూడిన జాబితాను హెచ్‌ఎస్‌బీసీ హురున్ 'గ్లోబల్ ఇండియన్స్-2024' పేరుతో తొలిసారి జాబితా విడుదల చేసింది. ఇందులో 200 ప్రముఖ కంపెనీలు, 226 వ్యక్తుల గురించి ప్రస్తావించింది. అందులో సాఫ్ట్‌వేర్, ఆర్థిక సేవలు, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, ఫార్మా తదితర కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీలకు నేతృత్వం వహించడం ద్వారా భారతీయ సంతతి వ్యక్తులు ప్రపంచ ఆర్థిక గమనాన్ని నిర్దేశిస్తున్నారని హెచ్‌ఎస్‌బీసీ హురున్ కొనియాడింది. ఆ జాబితా టాప్ టెన్‌లో సత్య నాదెళ్ల తొలిస్థానం దక్కించుకోగా, రెండో స్థానంలో గూగుల్ (ఆల్ఫాబెట్) సీఈవో సుందర్ పిచాయ్, మూడో స్థానంలో యూట్యూబ్ సీఈవో నీల్ మోహన్ నిలిచారు. ఇక ఈ జాబితాలో 12 మంది మహిళలు కూడా స్థానం దక్కించుకున్నారు. వారిలో నేహా నర్ఖేడే (కాన్‌ఫ్లూయెంట్), అంజలి సూద్ (టుబి), యామినీ రంగన్ (హబ్‌స్పాట్), లీనా నాయర్ (చానెల్) తదితరులు ఉన్నారు. గతేడాది నవంబరు 29 నాటికి ఆయా కంపెనీల మార్కెట్ స్థాయిలను బట్టి హెచ్‌ఎస్‌బీసీ హురున్ ఈ ర్యాంకుల జాబితాను రూపొందించింది.

'అభయ' మృత దేహంపై ఓ మహిళ డీఎన్ఏ!

కోల్‌కతా, జనవరి 21: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికో 'అభయ'పై జరిగిన అత్యాచారం, హత్య కేసులో కొత్త విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఈ కేసులోని ముద్దాయి సంజయ్ రాయ్ చనిపోయే వరకు జైలులోనే ఉండాలంటూ ట్రయల్ కోర్టు సోమవారం తీర్పు ఇచ్చిన విషయం విదితమే. అయితే విచారణ సందర్భంగా సమర్పించిన కొన్ని నివేదికల ద్వారా మరికొంత ఆసక్తికర సమాచారం వెల్లడయింది. సెంట్రల్ ఫోరెన్సిక్ ల్యాబ్ సమర్పించిన నివేదికను పరిశీలించినప్పుడు అత్యాచారానికి గురయిన ఆ యువ వైద్యురాలి మృతదేహంపై సంజయ్ రాయ్ డీఎన్ఏ 100 శాతం మేర ఉన్నట్టు గుర్తించారు. అయితే కొద్ది శాతం మేర మరో మహిళ డీఎన్ఏ కూడా ఉన్నట్టు తేలింది. ఇది పొరపాటున సంజయ్‌రాయ్ డీఎన్ఏలో కలిసిందా, లేదంటే ఆమెకు కూడా ఏమైనా ప్రమేయం ఉందా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇదిలా ఉండగా, ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు అనుమతి మంజూరు చేసింది. ముద్దాయి సంజయ్ రాయ్ చనిపోయే వరకు జైలులోనే ఉండాలని ట్రయల్ కోర్టు సోమవారం తీర్పు ఇవ్వగా, దానిపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసంతృప్తి వ్యక్తం చేశారు. మరణశిక్ష విధించి ఉంటే బాగుండేదని, తీర్పుపై అప్పీలు చేస్తామని తెలిపారు. దాంతో తీర్పు వచ్చి 24 గంటలు గడవకముందే అడ్వకేట్ జనరల్ కిశోర్ దత్తా మంగళవారం ఉదయమే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

బర్త్ టూరిజానికి అడ్డుకట్ట



వాషింగ్టన్ డీసీ, జనవరి 21: అమెరికా చట్టాల ప్రకారం ఆ దేశ పౌరులకు పుట్టిన పిల్లలకే కాక, అమెరికా గడ్డపై పుట్టిన ప్రతి ఒక్కరికీ పౌరసత్వం లభిస్తుంది. అమెరికాలో పుట్టినవారంతా ఆ దేశ పౌరులే అనే ఉద్దేశంతో 1868లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ ద్వారా శరణార్థుల పిల్లలకు అమెరికా జన్మతః పౌరసత్వాన్ని అందిస్తోంది. అయితే, తాజాగా ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులతో దీనికి అడ్డుకట్ట పడినట్లయింది. ట్రంప్ ఉత్తర్వుల ప్రకారం.. బిడ్డకు జన్మనిచ్చే సమయానికి తల్లిదండ్రులు అమెరికా పౌరులు కాకపోయినా, ఒకవేళ తండ్రి చట్టబద్ధంగా అమెరికాలో ఉన్నప్పటికీ.. శాశ్వత నివాసి కాకపోతే పుట్టిన పిల్లలకు అమెరికా పౌరసత్వం రాదు. అలాగే, తండ్రి శాశ్వత నివాసి అయినప్పటికీ తల్లి తాత్కాలిక వీసా మీద అమెరికాలో నివాసం ఉంటున్నా ఇదే నియమం వర్తిస్తుంది.

భారతీయుల పరిస్థితి ఏంటి?

అమెరికాలో 2024 చివరి నాటికి 54 లక్షల మంది ప్రవాస భారతీయులు అక్కడ నివసిస్తున్నారు. వీరిలో 34 శాతం మంది అమెరికాలోనే జన్మించారు. మిగిలిన వారంతా వలసదారులే. ఈ నేపథ్యంలో ట్రంప్ నిర్ణయం ఎన్నారైలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు! తాత్కాలిక వీసాపై అమెరికా వెళ్లి, గ్రీన్ కార్డు కోసం నిరీక్షిస్తున్న వారికి పుట్టిన పిల్లలెవరికీ ఇకపై అమెరికా పౌరసత్వం దక్కదు.

ప్రభావం ఎలా?

అమెరికాలో నివసిస్తున్న భారతీయులకు పుట్టిన పిల్లలకు ఇకపై జన్మతః పౌరసత్వం లభించదు. గ్రీన్ కార్డు కోసం కొన్ని దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న 10 లక్షల మందికి పైగా భారతీయ వలసదారులు, వారి పిల్లలకు కూడా అక్కడి పౌరసత్వం రాకపోతే.. గ్రీన్ కార్డు జారీ ప్రక్రియ మరింత ఆలస్యమవుతుంది. 'బర్త్ టూరిజం' మాయమైపోతుంది. పిల్లలకు అమెరికా పౌరసత్వం లభించాలన్న ఉద్దేశంతో ధనవంతులైన చాలా మంది భారతీయ మహిళలు.. కాన్పు సమయానికి అమెరికా వెళ్తుంటారు. దీన్నే 'బర్త్ టూరిజం'గా పేర్కొంటారు. అయితే, ఈ విధానాన్ని రద్దు చేసేందుకు అమెరికా రాజ్యాంగాన్ని సవరించాల్సి ఉంటుంది. ఇందుకు హౌస్, సెనేట్‌లో మూడింట రెండొంతుల మెజారిటీ ఓట్లు అవసరం. ఆ తర్వాత రాష్ట్ర శాసనసభల్లో నాలుగింట మూడొంతుల మంది దాన్ని ఆమోదించాలి. హౌస్, సెనెట్‌లో రిపబ్లికన్లకు అంత సంఖ్యాబలం లేదు. ఈ నేపథ్యంలో రాజ్యాంగ సవరణ అంత సులభం కాకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు.


18 వేల మంది తిరిగి భారత్‌కు!

అక్రమంగా అమెరికాలో ఉన్న భారత వలసదారులను వెనక్కి రప్పించనున్నారు. అమెరికా, భారత్ ప్రభుత్వాలు కలిసి గుర్తించిన ఇలాంటి అక్రమ వలసదారులైన దాదాపు 18 వేల మందిని తిరిగి భారత్‌కు తీసుకురానున్నారు. వారందరినీ అమెరికా నుంచి వెనక్కి రప్పించేందుకు భారత ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

ఉపాధ్యక్షురాలిగా ఉషను ఎంపిక చేయాల్సింది!

తెలుగింటి ఆడపడుచు ఉషా వాన్స్‌పై ట్రంప్ ప్రశంసల జల్లు

న్యూఢిల్లీ, జనవరి 21: అగ్రరాజ్య 47వ అధ్యక్షుడిగా సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన డొనాల్డ్ ట్రంప్ తన ప్రారంభోపన్యాసంలో తెలుగింటి ఆడపడుచు, అమెరికా నూతన ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సతీమణి, దేశ రెండో మహిళ 39 ఏళ్ల ఉషా వాన్స్(చిలుకూరి)పై ప్రశంసల జల్లు కురిపించారు. "ఆమె కడు నేర్పరి.. తెలివైంది. అసలు ఉపాధ్యక్ష పదవికి ఆమెను ఎంపిక చేసుకుని ఉంటే బాగుండేది. కానీ, వారసత్వం సరికాదు కాబట్టి జేడీని ఎంపిక చేసుకున్నా" అని ప్రమాణ స్వీకార మహోత్సవంలో తనకు సమీపంలో ఉన్న ఉషా వాన్స్‌వైపు చూస్తూ ట్రంప్ వ్యాఖ్యానించారు. దీంతో అతిథులు కరతాళ ధ్వనులతో తమ సంతోషాన్ని వ్యక్తం చేయగా వాన్స్ తన సతీమణిని చూస్తూ గర్వంతో చిరునవ్వు నవ్వారు. "గత కొంత కాలంగా జేడీ వాన్స్‌ను పరిశీలిస్తున్నాను. ఆయన గొప్ప సెనేటర్. చాలా తెలివిగల వ్యక్తి. అందుకే ఓహియో బాధ్యతలను ఆయనకు అప్పగించాను" అని అన్నారు.



ట్రంప్, వాన్స్ దంపతులు

మళ్లీ ఒక ఏడాది బీఈడీ

- నాలుగేళ్ల డిగ్రీ లేదా పీజీ చేసినవారే అర్హులు

న్యూఢిల్లీ, జనవరి 21 : మళ్లీ ఒక ఏడాది బీఈడీ కోర్సును ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయని జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి(ఎన్‌సీటీఈ) ప్రకటించింది. కేంద్ర విద్యా శాఖకు ఇందుకు సంబంధించిన నిబంధనల డ్రాఫ్ట్‌ను సమర్పించనున్నట్లు ఎన్‌సీటీఈ ఛైర్మన్ పంకజ్ అరోరా సోమవారం వెల్లడించారు. 2014లో ఈ బీఈడీ కోర్సును రద్దు చేయగా జాతీయ విద్యా విధానంలో చేసిన సిఫార్సుల మేరకు మళ్లీ ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ పూర్తిచేసిన లేదా రెండేళ్ల మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులే ఈ కోర్సు చేయవచ్చని అరోరా వెల్లడించారు. మూడేళ్ల డిగ్రీ చేసినవారు ఈ కోర్సు చేసేందుకు వీల్లేదు. ఆ అభ్యర్థులు రెండేళ్ల బీఈడీ కోర్సులో చేరాల్సి ఉంటుంది. ఒక ఏడాది బీఈడీ కోర్సు సహా పలు ఇతర కోర్సులకు సంబంధించిన నిబంధనలను ఖరారు చేసేందుకు 8 మంది సభ్యులతో ఒక కమిటీని సోమవారం ఏర్పాటు చేశారు.

పోటీ పరీక్షల అభ్యర్థులకు 15వేలు

- దరఖాస్తు ఫీజు, ప్రయాణ ఖర్చుల రీయింబర్స్‌మెంట్
- ఢిల్లీ ఎన్నికలకు రెండో మేనిఫెస్టో విడుదల చేసిన బీజేపీ

న్యూఢిల్లీ, జనవరి 21: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ తన రెండో మేనిఫెస్టోను విడుదల చేసింది. తొలి మేనిఫెస్టోలో మహిళా ఓటర్లను ఆకర్షించేలా పలు పథకాలు ప్రకటించిన బీజేపీ... ఇప్పుడు విద్య, సంక్షేమం, యువజన సాధికారతపై దృష్టి సారించింది. ఈ మేరకు 'సంకల్ప్ పత్ర'ను ఆ పార్టీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ విడుదల చేశారు. తాము అధికారంలోకి వస్తే పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు రూ.15వేల సహాయంతో పాటు దరఖాస్తు ఫీజు, ప్రయాణ ఖర్చులను ఒక్కో అభ్యర్థికి రెండుసార్లు చొప్పున రీయింబర్స్‌మెంట్ చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే నిరుపేద విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. కార్మికుల సంక్షేమంలో భాగంగా ఇంటి పనివారి కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వారికి రూ.10లక్షల బీమా, రూ.5 లక్షల ప్రమాద బీమా, వారి పిల్లలకు ఉపకార వేతనాలు, 6 నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు వర్తింపజేస్తామన్నారు. అదేవిధంగా ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు రూ.10లక్షల జీవిత బీమా, రూ.5లక్షల ప్రమాద బీమా, వాహన బీమా, వారి పిల్లలకు ఉపకార వేతనాలు ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టైపెండ్ స్కీమ్' కింద ఎస్సీ విద్యార్థులకు నెలకు రూ.1,000 స్టైపెండ్ ఇవ్వనున్నట్లు ప్రకటించింది.



మేనిఫెస్టోను విడుదల చేస్తున్న కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్

ఛత్తీస్‌గఢ్-ఒడిసా సరిహద్దుల్లో 16 మంది మావోయిస్టుల కాల్చివేత

(మొదటి పేజీ తరువాయి)

అప్పారావు అలియాస్ జయరాంరెడ్డి ఉన్నారు. ఆయన అసలు పేరు రామచంద్రారెడ్డిగారి ప్రతాప్‌రెడ్డి. ఆయనపై రూ.కోటి రివార్డు ఉంది. అలిపిరిలో క్లైమోర్ మైన్స్ ఘటన మొదలు.. పలు దాడుల్లో చలపతిది కీలక పాత్ర. నిజానికి అబూజ్‌మడ్‌ను కంచుకోటగా మలచుకున్న చలపతి, ఇతర అగ్రనాయకులు అక్కడ పోలీసుల ఎన్‌కౌంటర్లు పెరగడంతో గరియాబంద్‌ను సురక్షిత స్థావరంగా మలచుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. కుల్హారిఘాట్ రక్షిత అటవీ ప్రాంతంలో చలపతి, అతని అనుచరులు.. మొత్తం 60 మంది మావోయిస్టులు తలదాచుకున్నట్లు నిఘావర్గాలు ఛత్తీస్‌గఢ్ పోలీసులకు సమాచారం అందించాయి. దీంతో.. ఈ నెల 19వ తేదీ రాత్రి గరియాబంద్ ఎస్పీ నిఖిల్ రఖేచా, ఒడిసాలోని నౌపాడ ఎస్పీ గుండాల రాఘవేంద్ర, ఒడిసా నక్సల్స్ ఆపరేషన్ డీఐజీ అఖిలేశ్వర్‌సింగ్, కోబ్రా కమాండెంట్ డీఎస్ కథాటే నేతృత్వంలో ఇరు రాష్ట్రాలకు చెందిన సుమారు 1,000 మంది జవాన్లు రంగంలోకి దిగారు. ఒడిసా యాంటీ-నక్సల్స్ విభాగం స్పెషల్ ఆపరేషన్ గ్రూప్(ఎస్‌వోజీ)కి చెందిన 3 యూనిట్లు నాలుగు డ్రోన్ కెమెరాలతో అర్ధచంద్రాకారంలో ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టగా.. మిగతా భాగాన్ని ఛత్తీస్‌గఢ్ డీఆర్‌జీ, సీఆర్పీఎఫ్, కోబ్రా బలగాలు చక్రవ్యూహం మాదిరిగా దిగ్బంధనం చేశాయి. నక్సల్స్ ఎటూ తప్పించుకునే వీలులేకుండా ముందుకు సాగాయి. పారిపోతున్న మావోయిస్టులను గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలను రంగంలోకి దింపాయి. ఆ అడవి నుంచి బయటకు వెళ్లే మార్గాల్లో ఐదు కి.మీ. దూరంలో డాగ్‌స్క్వాడ్స్‌ను మోహరించాయి. ఆదివారం అర్ధరాత్రి దాటాక.. నక్సల్స్ తారసపడడంతో కాల్పులు మొదలయ్యాయి. సోమవారం సాయంత్రానికి ఇద్దరు నక్సల్స్ మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకోగా.. మంగళవారం ఉదయం వరకు 40 గంటల పాటు ఎన్‌కౌంటర్ కొనసాగింది. మంగళవారం సాయంత్రం కడపటి వార్తలందేసరికి కాల్పులు కొనసాగుతుండగా.. మృతిచెందిన నక్సల్స్ సంఖ్య 16గా పోలీసులు నిర్ధారించారు. రాయ్‌పూర్ ఐజీ అమ్రేశ్ మిశ్రా ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షించారు. మృతుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.జయరాంరెడ్డి అలియాస్ చలపతి(61) ఉన్నట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసులు నిర్ధారించారు. ఇతని తలపై రూ.కోటి రివార్డు ఉంది. కేంద్ర కమిటీకి చెందిన సభ్యులు మనోజ్, గుడ్డు, బాలన్నతోపాటు, చలపతి భార్య కూడా మృతిచెందారనే వార్తలు వస్తున్నా.. ఇంకా గుర్తించాల్సి ఉందని పోలీసులు తెలిపారు. నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామానికి చెందిన పాక హనుమంతు అలియాస్ గణేశ్ మృతిచెందినట్లు తెలుస్తోంది. మిగతా మృతదేహాలను గుర్తించాల్సి ఉందని వివరించారు. ఘటనాస్థలి నుంచి పెద్దఎత్తున ఏకే-47, ఎస్ఎల్ఆర్ వంటి తుపాకులు, మందుగుండు సామగ్రి, ఐఈడీలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో ఒడిసా ఎస్‌వోజీ జవాను దామ్రు కాలికి, ఛత్తీస్‌గఢ్ జవాను ధర్మేంద్ర భోయ్ చేతికి తూటా గాయాలయ్యాయని, వారిని హెలికాప్టర్ ద్వారా రాయ్‌పూర్‌లోని నారాయణ ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు.


ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టులు చలపతి, దీపక్, కవిత, సోనీ (ఫైల్)

అలిపిరి ఘటన సూత్రధారి

చలపతి అసలు పేరు ఎం.జైరాం రెడ్డి. ఇతనికి రామచంద్రారెడ్డి, అప్పారావు, రాము అనే పేర్లున్నట్లు పోలీసులు తెలిపారు. ఇతని స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా మఠంపల్లి గ్రామం. పదో తరగతి వరకు చదువుకున్నారు. మదనపల్లెలో సెరికల్చర్ ఉద్యోగిగా పనిచేస్తూ.. విశాఖకు బదిలీ అయ్యారు. అక్కడే నక్సల్స్ ఉద్యమంవైపు ఆకర్షితుడయ్యారు. తొలుత చిత్తూరు జిల్లా అడవుల్లో ఉద్యమాన్ని విస్తరించగా.. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి, కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. అబూజ్‌మడ్ కేంద్రంగా ఒడిసా రాష్ట్ర కమిటీకి పనిచేసేవారు. మావోయిస్టు పీఎల్‌జీఏ దళం ఒకటో బెటాలియన్ కమాండర్ మాడ్వీ హిడ్మాకు ఈయనే గురువు. ఏపీ సీఎం చంద్రబాబుపై 2003లో తిరుపతి అలిపిరిలో క్లైమోర్ మైన్‌తో జరిపిన దాడికి చలపతి సూత్రధారి. ఛత్తీస్‌గఢ్‌లోనూ పలు దాడుల్లో ఈయన పాత్ర కీలకం. 2010 బలిమెలలో పోలీసుల ఊచకోత, 2011లో ఒడిసాలోని మల్కనగిరి కలెక్టర్ వినీల్ కృష్ణను అపహరించిన కేసు, 2018లో అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమల హత్య వెనక ఈయనే ప్రధాన సూత్రధారి అని చెబుతారు. అబూజ్‌మడ్‌లోకి బలగాలు చొచ్చుకువస్తుండడంతో.. గరియాబంద్‌ను సురక్షిత స్థావరం(సేఫ్‌జోన్)గా మలచుకునే క్రమంలో బలగాలు ఈయన బృందాన్ని చుట్టుముట్టాయి. నిజానికి చలపతికి నిరంతరం ఏకే-47 ఆయుధాలు ధరించిన 9 మంది మావోయిస్టులు భద్రత కల్పిస్తారు. వీరిలో ఐదుగురు మహిళా నక్సల్స్- బస్తర్‌కు చెందిన అమల, చోటీ, నాని, దీప్స, రీనా ఉంటారు. మరో గార్డు సుఖ్‌రామ్ హ్యాండ్‌హెల్డ్ మెటల్ డిటెక్టర్‌తో.. చలపతిని కలిసేందుకు వచ్చే ఇతర మావోయిస్టులను తనిఖీ చేసేవారని తెలుస్తోంది. వయసు పైబడడంతో చలపతి రెండు కర్రల సాయంతో నడిచేవారని సమాచారం. మంగళవారం నాటి ఎన్‌కౌంటర్‌లో కూడా ఆయన మృతదేహం పక్కన రెండు కర్రలు ఉండడం గమనార్హం..! ఎన్‌కౌంటర్ మృతుల్లో సింహభాగం ఈయన అంగరక్షకులేనని ఛత్తీస్‌గఢ్ పోలీసులు తెలిపారు.

ఇంగ్లిష్ నేర్పించే హనుమంతు!

ఈ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందినట్లుగా భావిస్తున్న నల్లగొండ జిల్లాకు చెందిన పాక హనుమంతు 42 ఏళ్ల క్రితం నక్సల్స్ ఉద్యమంలో చేరారు. నల్లగొండలో డిగ్రీ చదివే సమయంలోనే ర్యాడికల్ విద్యార్థి సంఘం వైపు ఆకర్షితుడయ్యారు. ఏబీవీపీ-ర్యాడికల్ విద్యార్థుల మధ్య 1982లో జరిగిన ఘర్షణలో ఇతనే ప్రధాన నిందితుడు కావడంతో.. అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన దళంలోనే ఛత్తీస్‌గఢ్‌కు చెందిన యువతిని వివాహం చేసుకున్నారు. మావోయిస్టులకు ఇంగ్లిష్, రాజనీతి శాస్త్రంలో పాఠాలు చెప్పేవాడని, పలు భాషలను అనువదించేవాడని సమాచారం. వాస్తవానికి ఐదేళ్ల క్రితమే హనుమంతు అనారోగ్యంతో మృతిచెందినట్లు వార్తలొచ్చాయి. అయితే.. నెలక్రితం తాను బతికే ఉన్నట్లు బంధుమిత్రులకు సమాచారం ఇచ్చారు. అంతలోనే ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. రెండేళ్ల క్రితం తండ్రి, ఇటీవల తల్లి మృతిచెందడంతో.. హనుమంతు నివసించిన గుడిసె ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. ఆయన ఇద్దరు సోదరులు నల్లగొండలో కూలీపనులు చేసుకుంటున్నారు. కాగా.. నల్లగొండ జిల్లాకే చెందిన మోడెం బాలకృష్ణ కూడా మంగళవారం నాటి ఎన్‌కౌంటర్‌లో మరణించినట్లు ప్రచారం జరుగుతోంది.

2025లో వరుస దెబ్బలు

గత ఏడాది నుంచే మావోయిస్టు పార్టీ వైపు నష్టం పెరిగింది. 300 మందికిపైగా నక్సల్స్ హతమవ్వగా.. 450 అరెస్టులు, 850 లొంగుబాట్లు జరిగాయి. 2025 ఆరంభం నుంచే నక్సల్స్‌కు ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఈ నెల 5న బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు, 15న బీమారంపాడు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది, తాజాగా గరియాబంద్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మృతి చెందారు. కాగా.. తాజా ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయి స్పందించారు. నక్సలైట్లు ఆఖరి శ్వాస తీసుకుంటున్నారని, ఇది బలగాల గొప్ప విజయమని అమిత్‌షా పేర్కొనగా.. భారీ ఆపరేషన్‌లో విజయం సాధించిన బలగాలను విష్ణుదేవ్ అభినందించారు. 2026 మార్చికల్లా ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజం లేకుండా చేస్తామని ఇరువురూ పునరుద్ఘాటించారు.

కేంద్ర కమిటీలో.. మిగిలింది 14 మంది తెలుగువాళ్లే..!

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకులను కాపాడుతూ వస్తున్న అబూజ్‌మడ్‌లో బలగాలు చొచ్చుకువెళ్తుండడంతో.. మావోయిస్టులు కొత్త షెల్టర్‌జోన్‌కు మారుతున్నారు. సింహభాగం కేంద్ర కమిటీ సభ్యులు వయసు పైబడడంతో వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. మంగళవారం నాటి ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన చలపతి కూడా రెండు కర్రల సాయంతోనే నడిచేవారు. ప్రస్తుతం కేంద్ర కమిటీలో 14 మంది తెలుగు వారుండగా.. వీరిలో పది మందికి పైగా ఇలాంటి సమస్యలతో బాధపడుతున్నారు. వీరిలో.. మావోయిస్టు పార్టీ రథసారధి నంబాళ్ల కేశవరావు, మాజీ కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మల్లోజుల వేణుగోపాల్ 70 ఏళ్లకు పైబడ్డవారే..! వీరు జ్ఞాపకశక్తి సమస్యలను ఎదుర్కొంటూ.. మనుషులను గుర్తించలేకపోతున్నారని సమాచారం. మిగతా వారిలో కడారి సత్యనారాయణరెడ్డి, మోడెం బాలకృష్ణ, తెంటూ లక్ష్మీనర్సింహాచలం, పుల్లూరి ప్రసాదరావు కూడా అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. రిక్రూట్‌మెంట్లు లేక.. అగ్రనాయకులు, క్యాడర్ వరుస ఎన్‌కౌంటర్లు, పెద్ద సంఖ్యలో లొంగుబాట్లతో మావోయిస్టు పార్టీ ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో ఓ వైపు కేంద్ర బలగాలను ఎదుర్కోవడం.. మరోవైపు అగ్రనేతలను కాపాడుకోవడం ఇప్పుడు మావోయిస్టు పార్టీకి సవాలుగా మారింది. మల్లోజుల కోటేశ్వరరావు భార్య పోతుల కల్పన కేంద్ర కమిటీ సభ్యుల్లో ఏకైక మహిళ కాగా.. ఆమె జనతన సర్కార్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. అడపాదడపా పోలీసుల వ్యూహాలను తిప్పికొడుతున్న కేంద్ర కమిటీ సభ్యుల్లో తిప్పిరి తిరుపతి, గాజర్ల రవి, కట్టా రామచంద్రారెడ్డి, బడే దామోదర్ అలియాస్ చొక్కారావు, పసునూరి నరహరి ఉన్నారు. అయితే.. అరెస్టవుతున్న, లొంగిపోతున్న మావోయిస్టులతో ఇప్పుడు దళాలకు ముప్పు పొంచి ఉందని తెలుస్తోంది. కాంకేర్‌లో అరెస్టయిన ప్రభాకర్‌రావు ద్వారా.. మావోయిస్టు పార్టీ అగ్ర నాయకత్వానికి సంబంధించిన కీలక సమాచారం నిఘావర్గాలకు చేరినట్లు తెలుస్తోంది. కేంద్ర కమిటీ సభ్యులు ఎక్కడున్నారనే సమాచారాన్ని పక్కాగా తెలుసుకున్నాకే.. బలగాలు దాడులకు పాల్పడడం ఇందుకు నిదర్శనం. తన బెటాలియన్‌కు చెందిన 30 మంది వరకు మావోయిస్టులు లొంగిపోయాక.. హిడ్మా కూడా పెద్దగా దాడులు జరిపిన దాఖలాలు లేవు.

నల్లగొండలో కాంగ్రెస్, బీఆర్ఎస్ బాహాబాహీ

» బీఆర్ఎస్ రైతు మహా ధర్నా ఫ్లెక్సీల తొలగింపుతో వివాదం

నల్లగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ మునిసిపల్ కార్యాలయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు మంగళవారం బాహాబాహీకి దిగాయి. బీఆర్ఎస్ రైతు మహాధర్నా ఫ్లెక్సీల అంశంలో ఇరువర్గాల మధ్య మొదలైన గొడవ తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. బీఆర్ఎస్ మంగళవారం నిర్వహించ చేపట్టిన రైతు మహా ధర్నాకు హైకోర్టు అనుమతి నిరాకరించింది. దీంతో, బీఆర్ఎస్ నేతలు పట్టణంలో ఏర్పాటు చేసిన మహా ధర్నా ఫ్లెక్సీలను మునిసిపల్ సిబ్బంది సోమవారం అర్ధరాత్రి తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి మంగళవారం ఉదయం మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ కార్యాలయంలోకి వెళ్లారు. ఆ సమయంలో కమిషనర్ లేకపోవడంతో అక్కడే బైఠాయించారు. పోలీసులు వారిని బలవంతంగా బయటకు తరలించే యత్నం చేస్తుండగా మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి తదితరులు అక్కడికి చేరుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య మొదలైన మాటల యుద్ధం ఘర్షణకు దారి తీసింది. ఒకానొక సమయంలో ఫర్నిచర్ ధ్వంసం చేయడంతో పాటు ఒకరిపై ఒకరు పూలకుండీలు విసురుకున్నారు. పరిస్థితి అదుపుతప్పడంతో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు బలవంతంగా నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. కాగా, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రోద్బలంతోనే కాంగ్రెస్ కార్యకర్తలు తమపై దాడి చేశారని పోలీసుస్టేషన్ నుంచి విడుదలైన తర్వాత కంచర్ల భూపాల్‌రెడ్డి ఆరోపించారు.

ఏజెన్సీ మునిసిపాలిటీలకు ఎన్నికలెప్పుడో?

» ఏళ్ల తరబడి ప్రత్యేకాధికారుల పాలనలోనే
» ఏజెన్సీ పరిధిలో దేశ వ్యాప్తంగా 174 మునిసిపాలిటీలు
» రాష్ట్రంలో పాల్వంచ, మణుగూరు, మందమర్రి ఇదే జాబితాలో

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరికొద్ది నెలల్లో మునిసిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెలాఖరుతో సుమారు 130 మునిసిపాలిటీల పాలక వర్గాల గడువు ముగియనుంది. ఎన్నికల నిర్వహణకు పురపాలకశాఖ సన్నద్ధమవుతున్న తరుణంలో గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో ఎన్నికలకు నోచుకోని ఏజెన్సీ పరిధిలోని మునిసిపాలిటీల అంశం చర్చనీయాంశమైంది. తెలంగాణలో గిరిజన ఏజెన్సీ ప్రాంతం కింద పాల్వంచ, మణుగూరు, మందమర్రి మునిసిపాలిటీలున్నాయి. 2001 జనాభా లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా 167 మునిసిపాలిటీలు ఏజెన్సీ పరిధిలో ఉండేవి. ప్రస్తుతం వీటి సంఖ్య 174 చేరిందని మునిసిపల్ కౌన్సిల్ ఫోరం తెలిపింది. ఏజెన్సీ పరిధిలో ఉన్న మునిసిపాలిటీల్లో మధ్యప్రదేశ్‌లో అత్యధికంగా 46, జార్ఖండ్ ఛత్తీస్‌గఢ్‌లో ఒక్కో రాష్ట్రంలో 40, ఒడిసాలో 20, గుజరాత్‌లో 13 ఉన్నాయి. మహారాష్ట్రలో 12, తెలంగాణలో 3 ఉన్నాయి. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మునిసిపల్ కౌన్సిల్ ఫోరం తరపున చైర్మన్ భూక్యా రామూ నాయక్ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు సోమవారం విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీ పరిధిలోని పంచాయతీలలో ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ప్రాంతాలకు పంచాయతీ పొడగింపు చట్టం(పీఈఎస్ఏ)-1996కు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. అలాగే ఏజెన్సీ పరిధిలో ఉన్న పట్టణ ప్రాంతాల్లోనూ ఎన్నికల నిర్వహణకు 2001లో రాజ్యసభలో ప్రవేశపెట్టిన మునిసిపాలిటీస్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియా యాక్ట్(ఎంఈఎస్ఏ) ముసాయిదా బిల్లును పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి సిఫారసు చేశారు. 2003లో ఈ కమిటీ నివేదిక ఇచ్చింది. 2010లో ఎంఈఎస్ఏ ముసాయిదా బిల్లు పార్లమెంట్‌లో చర్చకు పెట్టారు. ఆ తరువాత దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ముసాయిదా బిల్లు అటకెక్కింది. దీంతో పట్టణ ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణకు ఆటంకం ఏర్పడిందని, ఎన్నికల నిర్వహణకు అవకాశం కల్పించి, గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ప్రకారం పాలకవర్గంలో భాగస్వామ్యం కల్పించాలని మునిసిల్ కౌన్సిల్ ఫోరం ప్రభుత్వాన్ని కోరుతోంది.

తుర్కియేలో భారీ అగ్ని ప్రమాదం

» 66 మంది మృతి, 51 మందికి గాయాలు

అంకారా, జనవరి 21: తుర్కియేలో మంగళవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. వాయువ్య తుర్కియేలోని బోలు ప్రావిన్స్‌లో ఉన్న ఓ 12 అంతస్తుల స్కీ రిసార్టు హోటల్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 66 మంది మృతి చెందగా, 51 మంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. స్థానిక కాలమానం ప్రకారం తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో ఈ ప్రమాదం సంభవించిందని, దీనికి గల కారణాలు తెలియాల్సి ఉందని వారు వెల్లడించారు. గదుల్లో కమ్ముకున్న పొగ కారణంగా కొంత మంది మృతి చెందగా, మరికొందరు తమను తాము రక్షించుకునే క్రమంలో పై అంతస్తుల నుంచి కిందకు దూకి మరణించినట్లు తెలిపారు.

గుర్తింపు పొందిన పార్టీగా జనసేన

» ఇక ఆ పార్టీకే గాజుగ్లాసు గుర్తు
» పవన్ కల్యాణ్‌కు ఈసీ లేఖ



అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) జనసేనను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుర్తింపు పొందిన పార్టీల జాబితాలో చేర్చింది. దీంతోపాటు గాజు గ్లాసు గుర్తును ఆ పార్టీకే రిజర్వ్ చేసింది. ఈ మేరకు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు ఎన్నికల సంఘం మంగళవారం సాయంత్రం లేఖ పంపింది. సార్వత్రిక ఎన్నికల్లో వంద శాతం విజయం నమోదు చేసిన పార్టీగా జనసేన రికార్డు సాధించింది. పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లో, రెండు లోక్‌సభ స్థానాల్లో విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ క్రమంలో గుర్తింపు పొందిన పార్టీగా నిలిచి, గాజు గ్లాసు గుర్తును కూడా పొందింది. ఈ పరిణామంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా స్థాయి న్యాయాధికారుల సమస్యలపై కమిటీలు వేయండి

» హైకోర్టులకు సుప్రీం సూచన

న్యూఢిల్లీ, జనవరి 21: జిల్లా స్థాయి న్యాయాధికారుల సమస్యల పరిష్కారానికి ఇద్దరు న్యాయమూర్తులతో కమిటీలు ఏర్పాటు చేయాలని మంగళవారం సుప్రీంకోర్టు అన్ని హైకోర్టులకు సూచించింది. నాలుగు వారాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొంది. రెండో జాతీయ జడ్జీల వేతన సవరణ సంఘం చేసిన సిఫార్సులు అమలయ్యేలా చూడాలని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. జీతాలు, పెన్షన్లు, ఇతర పదవీ విరమణ ప్రయోజనాలు సక్రమంగా అందేలా ఈ కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని పేర్కొంది. వాటికి 'జిల్లా న్యాయ వ్యవస్థ సర్వీసు నిబంధనల కమిటీ' అన్న పేరు పెట్టింది. వెంటనే ఆ కమిటీల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించాలని, రిటైర్డు జిల్లా జడ్జీని ఈ కమిటీకి నోడల్ అధికారిగా నియమించాలని తాజా ఆదేశాల్లో పేర్కొంది.

దండకారణ్యంలో 'ఎర్ర'కోటలకు బీటలు!

20 ఏళ్ల మావోయిస్టుల ఆధిపత్యానికి చెక్

» అప్పటి నక్సల్స్.. ఇప్పుడు డీఆర్‌జీ బలగాలు
» 650 క్యాంపులు.. నిరంతర నిఘా
» 'ఆపరేషన్ కగార్'తో బలగాల పైచేయి
» ఏడాదిలో 300 మంది నక్సల్స్ మృతి



చర్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): దండకారణ్యంలో 'ఎర్ర'కోటలకు బీటలు పడ్డాయి..! 20 ఏళ్లుగా అబూజ్‌మడ్ కేంద్రంగా ఏకఛత్రాధిపత్యంగా దండకారణ్యాన్ని కంచుకోటగా మలచుకున్న మావోయిస్టులు ఇప్పుడు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. కేంద్ర కమిటీ సభ్యులు సైతం ప్రత్యక్ష ఎన్‌కౌంటర్లలో చనిపోతున్నారు. దండకారణ్యం, డీవీసీఎం కమిటీ సభ్యులదీ అదే పరిస్థితి. ఎండాకాలం వస్తే.. ఆకురాలిపోయి, బలగాల డ్రోన్ కెమెరాలకు చిక్కే ప్రమాదం.. టన్నెల్స్‌లోనూ ఉండలేని పరిస్థితి.. ఈ నేపథ్యంలో ఎక్కడ తలదాచుకోవాలో తెలియని దుస్థితి..! లొంగిపోయిన నక్సలైట్లను పోలీసులు డీఆర్‌జీ పేరుతో బలగాలుగా మారుస్తూ.. మావోయిస్టులపై ఆయుధాలుగా మలచుకుంటున్నారు. వారు ఇచ్చే సమాచారంతో.. అడవుల్లో వారినే ముందుకు నడుపుతూ నక్సల్స్‌పై 'ఆపరేషన్ కగార్' పేరుతో వేట సాగిస్తున్నారు. బస్తర్‌లోని 7 జిల్లాల్లో సుమారు 8 వేల మంది డీఆర్‌జీ బలగాలను నియమించారు. వీరితోపాటు.. సీఆర్పీఎఫ్, కోబ్రా బలగాలతో దండకారణ్యంలో 650కి పైగా బేస్ క్యాంపులను ఏర్పాటు చేశారు. మావోయిస్టుల కదలికలపై సమాచారం వచ్చిందే తడవుగా.. ఈ క్యాంపుల నుంచి బలగాలు కూంబింగ్‌కు వెళ్తుంటాయి. దీంతో ఇప్పుడు అబూజ్‌మడ్ లాంటి నక్సల్స్ కంచుకోటల్లో బలగాలు పాగా వేస్తున్నాయి. ఇలా గత ఏడాది ఆరంభం నుంచి 42 ఎన్‌కౌంటర్లు జరగ్గా.. 300 మందికి పైగా మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో చలపతి, శంకర్రావు, సాగర్, నర్సింహారావు వంటి భారీ రివార్డులున్న నక్సలైట్లు కూడా ఉన్నారు.

భారీ రివార్డులున్న అగ్రనేతలు

మావోయిస్టు అగ్రనేత గణపతిపై రూ.2.52 కోట్ల రివార్డు ఉంది. మరో నేత కేశవరావు అలియాస్ బస్వరాజ్‌పై రూ.1.5 కోట్లు, గెరిల్లా యుద్ధ నిపుణుడు మాడ్వి హిడ్మాపై రూ. కోటి రివార్డు ఉన్నట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. కాగా.. భారీ రివార్డులున్న అగ్రనేతల్లో పలువురు అనారోగ్యంతో మృతిచెందడం గమనార్హం..! ఈ కోవలో కిషాండా(రూ.1.47కోట్లు) 2021లో ఝార్ఖండ్‌లో అరెస్టవ్వగా.. అనారోగ్యంతో మృతిచెందారు. కటకం సుదేశన్(రూ.1.47కోట్లు) 2023 జూన్‌లో గుండెపోటుతో మరణించారు. దేవ్‌కుమార్‌సింగ్ అలియాస్ అరవింద్‌జీ (రూ.1.32కోట్లు) కూడా గుండెపోటుతో కన్నుమూశారు.

ఇసుక మాఫియాపై పోరాడినందునే వామనరావు దంపతుల హత్య

» బీఆర్ఎస్ హయాంలో సమగ్ర దర్యాప్తు జరగలేదు
» సీబీఐ విచారణ అవసరం.. సుప్రీంలో వాదనలు

న్యూఢిల్లీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా మంథనిలో న్యాయవాది దంపతుల హత్య కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యం మంగళవారం సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. 2021 ఫిబ్రవరి 17న జరిగిన న్యాయవాది గట్టు వామనరావు దంపతుల హత్య కేసు దర్యాప్తును సీబీఐకి ఇవ్వాలని కోరుతూ తండ్రి కిషన్ రావు అదే ఏడాది సెప్టెంబర్ 18 పిటిషన్ దాఖలు చేశారు. నిందితులు తనను బెదిరిస్తున్నందున వేగంగా విచారణ జరిపి దోషులను శిక్షించాలని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం విచారణ జరిపింది. కిషన్ రావు తరఫున సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి వాదనలు వినిపిస్తూ ఇసుక మాఫియాపై పోరాడినందుకే న్యాయవాది ఆ దంపతులను నడిరోడ్డుపై దారుణంగా నరికి చంపారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సమగ్ర దర్యాప్తు జరగలేదని చెప్పారు. నిందితుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో పోలీసులు పేర్కొనలేదని తెలిపారు. ఈ కేసును నిందితుడు మధుకర్ రావు ప్రభావితం చేశారని, ఆయన అప్పటి అధికారపార్టీ నాయకుడు కావడం వల్లే పోలీసులు ఆయనను విచారించలేదని చెప్పారు. సీబీఐకి అప్పగించడానికి తమకు అభ్యంతరం లేదని గతంలో తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాది చెప్పారని, కానీ దాన్ని అమలు పరచలేదని తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ నిందితులపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయని పేర్కొంది. అయినా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమర్థించడం లేదని, అయినా ఎందుకు ఆందోళన చెందుతున్నారని ప్రశ్నించింది. నిందితులు బెయిల్‌పై బయటే ఉన్నారని, వామనరావు తండ్రి కిషన్ రావును బెదిరిస్తున్నారని న్యాయవాది సమాధానం ఇచ్చారు. నిందితుల తరఫున సీనియర్ న్యాయవాదులు బసంత్, నాగముత్తులు వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం సీబీఐ దర్యాప్తుపై అభిప్రాయం తెలపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

మెదక్- కాచిగూడ మధ్య విద్యుత్ రైలు పరుగులు

» రూ.15.49 కోట్లతో 17.2 కి.మీల మేర పనులు పూర్తి
» జెండా ఊపి రైలును ప్రారంభించిన అధికారులు



విద్యుత్ రైలు ట్రయల్‌రన్‌ను ప్రారంభిస్తున్న రైల్వే అధికారులు

మెదక్ అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మెదక్ నుంచి కాచిగూడ మార్గంలో మంగళవారం విద్యుత్ రైలు పరుగులు తీసింది. మెదక్ నుంచి అక్కన్నపేట మీదుగా కాచిగూడకు రోజూ నడిచే డీజిల్ ఇంజన్ రైలును మంగళవారం విద్యుత్ ఇంజన్‌తో నడిపారు. మెదక్-అక్కన్నపేట వరకు రూ.15.49 కోట్లతో 17.2 కి.మీ. మేర పనులు పూర్తి కావడంతో ట్రయల్ రన్ నిర్వహించారు. దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ బ్రిజ్‌మోహన్ మీనా ట్రయల్‌రన్‌ను అక్కన్నపేటలో జెండా ఊపి ప్రారంభించారు. ట్రయల్‌రన్ విజయవంతం కావడంతో సాయంత్రం 5 గంటలకు మెదక్- కాచిగూడ్‌కు విద్యుత్ రైలు పరుగులు పెట్టింది. ఈ సందర్భంగా బ్రిజ్‌మోహన్ మీనా మాట్లాడుతూ, విద్యుదీకరణ పూర్తయినందున ఇక్కడి నుంచి భవిష్యతులో తిరుపతి, ముంబై వంటి దూర ప్రాంతాలకు రైళ్లు నడిపేందుకు వీలు కలిగిందన్నారు. మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు నిర్మించిన రైలు మార్గంలోనూ విద్యుదీకరణ పనులు త్వరలో చేపడుతున్నట్లు చెప్పారు. హైదరాబాద్ డివిజన్‌లో విద్యుదీకరణ 100 శాతం పూర్తయినట్లు తెలిపారు.

మే 3 నుంచి ఏపీలో గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలు

» 89 పోస్టులకు 4,496 మంది పోటీ

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలు మే 3వ తేదీ నుంచి 9 వరకు జరుగుతాయని ఏపీపీఎస్సీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. దీని ప్రకారం.. మే 3, 4 తేదీల్లో తెలుగు, ఇంగ్లీష్ అర్హత (క్వాలిఫైయింగ్ నేచర్) పరీక్షలు ఉంటాయి. 5న సమకాలీన అంశాలు, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ అంశాలపై సాధారణ వ్యాసరూప ప్రశ్నల పేపర్-1 పరీక్ష నిర్వహిస్తారు. 6న ఆంధ్రప్రదేశ్, భారతదేశ చరిత్ర, సంస్కృతి, జాగ్రఫీల మీద పేపర్-2 పరీక్ష నిర్వహిస్తారు. 7న పాలిటీ, రాజ్యాంగం, పరిపాలన, న్యాయ, విలువలపై పేపర్-3 పరీక్ష జరుగుతుంది. 8న ఆంధ్రప్రదేశ్, భారతదేశ ఎకానమీ, అభివృద్ధిపై పేపర్-4 పరీక్ష నిర్వహిస్తారు. 9న సైన్స్, టెక్నాలజీ, పర్యావరణ అంశాలపై చివరి పరీక్ష పేపర్-5 ఉంటుంది. 2023లో జారీ అయిన ఈ గ్రూప్-1 నోటిఫికేషన్‌లో మెయిన్స్‌కు 4,496 మంది ఎంపికయ్యారు. ఈ నోటిఫికేషన్ ద్వారా 89 గ్రూప్ పోస్టులను భర్తీ చేయనున్నారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురం కేంద్రాల్లో ఆయా తేదీల్లో పరీక్షలు జరుగుతాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శాంతి...నిజంగానే?!

'గాజా కాల్పుల విరమణ ఒప్పందం సృష్టికర్త డోనాల్డ్ ట్రంప్ కదా..?' అంటూ వెనకనుంచి వినిపించిన ఓ వ్యాఖ్యలాంటి ప్రశ్నను జో బైడెన్ చిన్నచిరునవ్వుతో జోక్ అని తీసిపారేశారు. హమాస్–ఇజ్రాయెల్ చర్చల్లో అప్పటికి కాబోయే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దూత కూడా ఉన్న విషయం తెలిసిందే. పదిహేను నెలల భీకరమైన విధ్వంసం తరువాత, సదరు కాల్పుల విరమణ ఒప్పందం ఆదివారంనుంచి అమల్లోకి రావడమే కాదు, ఉభయపక్షాలనుంచి బందీల అప్పగింత కూడా ఎటువంటి అడ్డంకులూ లేకుండా జరిగింది. కేవలం ట్రంప్ హెచ్చరికతోనే, బైడెన్ మాదిరిగా ఆయనను సులువుగా పెరట్లోకట్టేసుకోవడం సాధ్యం కాదని తెలిసినందునే నెతన్యాహూ దిగివచ్చాడనీ, ఒప్పందం అమల్లోకి వచ్చిందనీ అంతా అనుకున్నారు. కానీ, అమెరికా అధ్యక్షుడైన వెంటనే తనకు ఈ ఒప్పందం ఎక్కువకాలం నిలుస్తుదన్న నమ్మకంలేదని ట్రంప్ తీసిపారేశారు. కాల్పుల విరమణ ఒప్పందంలోని దశలన్నీ దాటేట్టుగా ఆయన చూస్తాడని, గట్టిగా నిలబడతాడని అనుకుంటున్న తరుణంలో ఈ వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించేవే.

ఆదివారం ఉదయం ఎనిమిదిన్నరనుంచి కాల్పుల విరమణ అమల్లోకి రావాల్సి ఉండగా, తొలివిడతగా విడుదలచేయాల్సిన ముగ్గురు బందీల జాబితాను హమాస్ ఇవ్వలేదన్న సాకుతో మరింత ఉధృతంగా దాడులను కొనసాగించింది ఇజ్రాయెల్. ముగ్గురు యువతులను రెడ్‌క్రాస్‌కు అప్పగించేలోగా ఓ పాతికమంది ప్రాణాలు తీసింది. కాల్చేస్తా, పేల్చేస్తా అంటూ నెతన్యాహూ ఓ పక్క అంటున్నా, కాల్పులు నిలిచిపోవడం, బందీల విడుదల జరగడం ఓ అతిపెద్ద ఉపశమనం. ఇజ్రాయెల్ బాంబుదాడులకు నేలమట్టమైపోయిన అల్‌సరయా స్క్వేర్‌లో చోటుచేసుకున్న ఈ అప్పగింత కార్యక్రమాన్ని, హమాస్ అందించిన గిఫ్ట్‌బ్యాగులతో రెడ్‌క్రాస్ వాహనాల్లో కూచున్న ఆ యువతులను ఇజ్రాయెల్ ఆసుపత్రులకు తరలించడాన్ని ప్రపంచమంతా ఆనందంగా గమనించింది. ఇందుకు ప్రతిగా, 90మంది పాలస్తీనా మహిళలూ పిల్లలను ఇజ్రాయెల్ వదిలిపెట్టడమూ జరిగింది. శనివారం మరో నలుగురు బందీలను అప్పగించబోతున్నట్టు హమాస్ మంగళవారం చేసిన ప్రకటన ఆ సంస్థ ఈ ఒప్పందానికి కట్టుబడివున్నదనడానికి నిదర్శనం. ఆహారసరఫరాలతో గాజాలోకి వందలాది ట్రక్కులు ప్రవేశించడం ఓ అరుదైన దృశ్యం. గాజావాసులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు, కూలిన ఇళ్ళను చూసి దుఃఖిస్తున్నారు. 470 రోజులకు పైగా భయంకరమైన విధ్వంసాన్ని చవిచూసిన వారికి నిరవధికంగా ఆహారం, మందులు, ఇతర సరఫరాలు అందాల్సి ఉంది.

కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా ప్రతీ ఇజ్రాయెలీ బందీకీ ప్రతిగా పదులూ వందలసంఖ్యలో పాలస్తీనా ఖైదీలను విడిచిపెట్టవలసి రావడం నెతన్యాహూకు ఇబ్బందికరమైన స్థితే. ఒప్పందంపై ఇజ్రాయెలీలు ఏమనుకుంటున్నారో కచ్చితంగా తెలియదు కానీ, నెతన్యాహూ కూటమి ప్రభుత్వంలో మాత్రం లుకలుకలు ఆరంభమైనాయి. కొందరు మంత్రివర్గ సహచరులను, కొంత మద్దతును ఆయన కోల్పోవలసి రావచ్చు. ఇద్దరు ఉన్నతస్థాయి సైనికాధికారులు హఠాత్తుగా రాజీనామా చేయడానికి ఈ ఒప్పందమే కారణమని అంటారు. ఈ ఆగ్రహాన్ని ఉపశమింపచేయడం కోసం కాబోలు, ఒకపక్క హమాస్‌తో యుద్ధం ఆపి, మరోపక్క వెస్ట్‌బ్యాంక్‌లోని జెనిన్‌లో ఇజ్రాయెల్ సైన్యం తన పైశాచికత్వాన్ని ప్రదర్శిస్తోంది.

తొలిదశ ఆరువారాలూ సవ్యంగా గడిస్తే కాల్పుల విరమణ ఒప్పందం కచ్చితంగా నిలుస్తుంది. హమాస్ దగ్గర బందీలుగా ఉన్నవారిలో ముప్పై మూడుమంది విడుదలై, 1900మంది పాలస్తీనియన్ ఖైదీలు బయటకువస్తే ఇరుపక్షాలమధ్య నమ్మకం పెరుగుతుంది. మధ్య గాజానుంచి, ఈజిప్ట్‌సరిహద్దులనుంచి ఇజ్రాయెల్ సైన్యం ఉపసంహరించుకున్నపక్షంలో వాతావరణం మరింత మెరుగుపడుతుంది. గత పదిహేను నెలలకాలంలో హమాస్ బాగా దెబ్బతిన్నప్పటికీ, ప్రస్తుత సంధికాలం అది తిరిగిశక్తిని పుంజుకొనేందుకు ఉపకరిస్తుందన్న అనుమానాలు బాగా ఉన్నాయి. కాల్పుల విరమణ అమల్లోకి రాగానే ఆయుధాలు చేబూనిన హమాస్ మిలిటెంట్లు వీరవిహారం చేస్తున్న దృశ్యాలు విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. అపనమ్మకాలను, ఉద్రిక్తతలను పెంచే ఇటువంటి సందర్భాలు రాబోయే రోజుల్లో మరిన్ని చూడవలసి రావచ్చు. బైడెన్‌ను దాటి ఇజ్రాయెల్‌కు సాయపడటానికి ట్రంప్ సిద్ధంగా ఉన్నారనడానికి అధికారంలోకి రాగానే ఇజ్రాయెల్‌కు ఆయన ఇచ్చిన బాంబులూ వరాలే నిదర్శనం. ఒప్పందానికి ముఖ్యకారకుడని అనుకుంటున్న ఆయనే దానిని ఆఖరువరకూ నిలిచేట్టు చూడాలని ప్రపంచమంతా కోరుకుంటోంది. శాంతిని పెంచడం కష్టం కానీ, తుంచడం సులువే.

డ్రిల్, బేబి, డ్రిల్ అనేది ఆకర్షణీయమైన రాజకీయ నినాదం. వ్యాపారాత్మక దృష్టితో చూసినప్పుడు అది ఆత్మహత్యా సదృశమని చెప్పక తప్పదు. ఎక్కువగా ఉత్పత్తి చేస్తే సరఫరా–గిరాకీ సమతౌల్యం దెబ్బతిని డ్రిల్లింగ్ చేసే సంస్థలు నష్టపోతాయి. అమెరికా తీర ప్రాంతాలలో పర్యావరణ పరిరక్షణ కొరకు బైడెన్ ప్రభుత్వం విధించిన ఆంక్షల వలన తమ వ్యాపారాలు దెబ్బతినడంతో అమెరికన్ చమురు సంస్థలు ట్రంప్‌కు అండగా నిలిచాయి కానీ తాము నష్టపోవడానికి మాత్రం కాదు.


ట్రంప్ 'స్వర్ణ' స్వప్నం పగటి కలే!

చమురు ధరల పెరుగుదల ద్రవ్యోల్బణానికి ఒక ప్రధాన కారణం. చమురు ఉత్పాదక దేశాలు మినహా ప్రపంచవ్యాప్తంగా అమెరికాతో సహా అన్ని దేశాలకు ఈ ప్రాథమిక సూత్రం వర్తిస్తుంది. చమురు ధరలను సాకుగా చూపి 'డ్రిల్, బేబీ, డ్రిల్' అంటూ ఎన్నికల ప్రచారంలో డొనాల్డ్ ట్రంప్ హోరెత్తించారు, విజయం సాధించారు. అధ్యక్ష పదవీ బాధ్యతలు స్వీకరించిన వెన్వెంటనే చమురు ఉత్పత్తిపై ఆయన వ్యాఖ్యలు ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.

ట్రంప్ సోమవారం నాడు రెండవసారి అధికారం చేపట్టిన మరుక్షణమే అమెరికాలో ఇంధన అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. స్వదేశంలో చమురు ఉత్పత్తిని ఇతోధికంగా పెంపొందించడంపై ట్రంప్‌కు ఉన్న ఆసక్తి, ఆయన ఇస్తున్న ప్రాధాన్యానికి ఆ ప్రకటన ఒక సంకేతం. అమెరికాలో చమురు ఉత్పత్తిపై ఉన్న నిషేధాజ్ఞలను తొలగించారు; చమురు ఉత్పాదకతకు అడ్డంకులు సృష్టిస్తున్న పర్యావరణ నిబంధనలకు పాతర పెట్టారు. అంతేకాకుండా కర్బన ఉద్గారాల తగ్గింపునకు ఉద్దేశించిన పారిస్ ఒడంబడిక నుండి వైదొలుగుతున్నట్టు ట్రంప్ ప్రకటించారు. పర్యావరణ పరిరక్షణ పేరిట ప్రజల ఇళ్ళ నుండి గ్యాసు లేదా చమురుతో నడిచే హీటర్లను కూడ తొలగించడానికి బైడెన్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లుగా ఎన్నికల ప్రచారంలో ట్రంప్ ఎద్దేవా చేశారు. అందుకు తగినట్లుగా ట్రంప్ అధికారం చేపట్టిన వెంటనే పర్యావరణ పరిరక్షణకు సంబంధించి బైడెన్ తీసుకున్న అనేక నిర్ణయాలను రద్దు చేశారు.

గల్ఫ్ లేఖ

రష్యా – ఉక్రెయిన్ యుద్ధం ఫలితంగా చమురు ధరలు పెరిగిపోయాయి. ఆ ధరలను నియంత్రించేందుకు అమెరికా తన ముందస్తు నిల్వల నుంచి భారీ పరిమాణంలో చమురును మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీంతో చమురు నిల్వలు తగ్గి, గత 40 సంవత్సరాలలో ఎన్నడూ లేని రీతిలో కనిష్ఠ స్థాయిలోకి పడిపోయాయి. అందుకే తాను పూర్తి స్థాయి సామర్థ్యానికి నిల్వలను పునరుద్ధరిస్తానని ట్రంప్ ప్రకటించారు. 1973 అరబ్ –ఇజ్రాయిల్ యుద్ధం అనంతరం అరబ్బు దేశాలు అమెరికాకు చమురు ఎగుమతులపై నిషేధం విధించాయి. పర్యవసానంగా చుట్టుముట్టిన సమస్యలను అధిగమించేందుకై అమెరికా ముందస్తు చమురు నిల్వల విధానాన్ని ప్రారంభించింది.



అమెరికా గత కొద్ది కాలంగా చమురు, సహజ వాయువు ఉత్పత్తిలో రష్యా అరబ్బు దేశాలను మించిపోయింది. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తరువాత రష్యాపై ఆంక్షల వలన సహజ వాయువు ఉత్పత్తిలో అమెరికా ప్రపంచ అగ్రగామిగా నిలిచింది. అదే విధంగా చమురు ఉత్పత్తిలో కూడ సౌదీ అరేబియాను ప్రస్తుతానికి అధిగమించింది. భూగోళం మీద కేవలం అమెరికాలో మాత్రమే అత్యధికంగా చమురు, సహజవాయువు నిల్వలు ఉన్నాయని, వీటిని యావత్తు ప్రపంచానికి ఎగుమతి చేయడం ద్వారా అమెరికాలో స్వర్ణయుగానికి నాంది పలుకుతామని ట్రంప్ తన ఎన్నికల ప్రచారంలో పదే పదే చెప్పారు. మొదటిసారి అధ్యక్షుడుగా ఉన్నప్పుడు కూడా చమురు ధరల విషయమై ట్రంప్ అనేక ప్రగల్భాలు పలికారు. ట్రంప్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నా చమురు ధరల విషయంలో గల్ఫ్ దేశాలు అమెరికాకు చుక్కలు చూపించాయి. తమ వ్యూహాత్మక విధానంతో అమెరికా చమురు సంస్థలను దాదాపుగా దివాలా తీయించాయి. ఇది ఎవరూ విస్మరించలేని వాస్తవం.

సరఫరా– డిమాండ్ సూత్రంతో నడిచే మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో ధరలను నియంత్రించడం అంత సులువు కాదు. చమురు వినియోగంలో భారత్, చైనా సహా ఆసియా దేశాలది సింహభాగం. అయితే అమెరికాలోని చమురు ఉత్పాదక రాష్ట్రాల నుంచి ఈ దేశాలకు భారీ నౌకలలో చమురు రవాణా వ్యవధి ఇంచుమించు రెండు నెలలు. అమెరికా తక్కువ ధరకే చమురు విక్రయించినా దూరం కారణాన రవాణా వ్యయం అత్యధికంగా ఉంటుంది. పైగా అమెరికా చమురు తేలిక రకమైంది. దాన్ని శుద్ధి చేయడం సాంకేతికంగా భారత్ తదితర ఆసియా దేశాల రిఫైనరీలకు అంత సులభం కాదు. ఈ కారణాన వెనిజులా చమురు ఆధారిత దేశీయ అంబానీ, ఎస్సార్ రిఫైనరీలు అంతగా రాణించలేకపోతున్నాయి.

వీటన్నింటికీ మించి అమెరికాలో చమురు ఉత్పాదక వ్యయం అరబ్ దేశాలతో పోల్చితే అధికంగా ఉంటుంది. పీపా చమురు ఉత్పత్తికి అమెరికాలో సగటున 50 నుంచి 70 డాలర్లు ఖర్చు అవుతుంది. అదే అరబ్ దేశాలలో అయితే పీపా చమురు ఉత్పత్తి వ్యయం సగటున 10 డాలర్లకు మించదు. ఉత్పాదక వ్యయం తక్కువగా ఉండడంతో పాటు వినియోగ దేశాలకు భౌగోళికంగా అనుకూలమైన ప్రాంతాలు కావడంతో అరబ్ దేశాలు అమెరికా ఎగుమతి ఆకాంక్షలపై నీళ్ళు చల్లుతున్నాయి.

డ్రిల్, బేబీ, డ్రిల్ అనేది నిస్సందేహంగా ఆకర్షణీయమైన రాజకీయ నినాదం. అయితే వ్యాపారాత్మక దృష్టితో చూసినప్పుడు అది ఆత్మహత్యా సదృశమని చెప్పక తప్పదు. ఎక్కువగా డ్రిల్లింగ్ చేసి ఉత్పత్తి చేస్తే సరఫరా–గిరాకీ సమతౌల్యం దెబ్బతిని డ్రిల్లింగ్ చేసే సంస్థలు నష్టపోతాయి. అమెరికా తీర ప్రాంతాలలో చమురు వెలికితీతపై పర్యావరణ పరిరక్షణ కొరకు బైడెన్ ప్రభుత్వం విధించిన ఆంక్షల వలన తమ వ్యాపారాలు దెబ్బతినడంతో అమెరికన్ చమురు సంస్థలు ట్రంప్‌కు అండగా నిలిచాయి కానీ తాము నష్టపోవడానికి మాత్రం కాదు.

చమురు సంపాదనతో అమెరికాలో స్వర్ణయుగానికి నాంది పలుకుతానని ట్రంప్ ప్రకటించడం ముదావహమే కానీ సకల దేశాలూ తమ చమురునే కొనుగోలు చేయాలనే నిర్బంధ వైఖరే ఆక్షేపణీయం. అంతర్జాతీయ చమురు వ్యాపారంలో (అరబ్ దేశాల పెత్తనం ఉన్న) ఒపెక్ కూటమి వాటా 60 శాతానికి పైగా ఉన్నది. భూగోళంపై చమురు నిక్షేపాలలో 72 శాతం ఈ కూటమి సభ్య దేశాలలోనే ఉన్నాయి. అమెరికా ఎన్నటికీ ఈ కూటమి దేశాలతో పోటీపడలేదు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఉచితాలతో అప్పుల ఊబిలోకి!



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'ప్రజలకు స్వీట్లు మాదిరి ఉచితాలను పంచిపెడుతూ పోతే ఆధునిక భారత దేశం అంధకార యుగంలోకి జారిపోతుంది.. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్‌ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించలేం' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2022 జూలై 16న యూపీలో బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ వేను ప్రారంభిస్తూ హెచ్చరించారు. మోదీ దారిలో కేంద్రమంత్రులు కూడా ఉచితాలను విమర్శించారు. అయితే ఆ తర్వాత ఏడాదే మధ్యప్రదేశ్‌లో లాడ్లీ బెహనా పథకం క్రింద మహిళలకు నెలకు రూ. 1250 చొప్పున చెల్లిస్తామని, క్రమంగా దాన్ని రూ. 3వేల వరకు పెంచుతామని బీజేపీ ప్రకటించడంతో ఆ రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి రాగలిగింది. ఈ పథకాన్ని 'గేమ్ ఛేంజర్'గా ఆ పార్టీ నేతలే అభివర్ణించారు. మధ్యప్రదేశ్‌లోనే కాదు, ఆ తర్వాత ప్రతి రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఉచితాల మీద ఉచితాలను ప్రకటిస్తూ ఎన్నికల్లో ప్రయోజనం పొందింది. ఇటీవల జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో కూడా లడ్కీ బెహన్ పథకం వల్ల బీజేపీకి పెద్ద ఎత్తున మహిళలు ఓట్లు వేశారు. ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కనీవినీ ఎరుగని స్థాయిలో ప్రకటిస్తున్న ఉచితాల హామీలను బట్టి చూస్తే ఈ పార్టీయేనా గతంలో ఉచితాలను వ్యతిరేకించింది అని ఆశ్చర్యం కలుగుతుంది.

దేశ రాజకీయాల్లో ఈ ఉచితాల సంస్కృతి ఎంత పెనవేసుకుపోయింది అంటే ఆర్థిక వ్యవస్థపై దీని వల్ల తీవ్రమైన భారం పడుతుంది అని తెలిసినా ఏ రాజకీయ పార్టీ కూడా ఉచితాలను ప్రకటించేందుకు వెనుకాడడం లేదు. ఉచితాలను సమర్థంగా అమలు చేస్తే అధికారంలోకి తప్పకుండా రాగలుగుతాం అని ఆమ్ ఆద్మీ పార్టీ పలు ఎన్నికల్లో నిరూపించింది. మంచి నీరు, విద్యుత్, ఆరోగ్యం, విద్య మహిళలకు బస్సు ప్రయాణం, వృద్ధులకు తీర్థ యాత్ర.. ఇలా ప్రతి రంగంలోనూ ఉచితాలను ప్రవేశపెట్టి అమలు చేయడం ద్వారా 2013 నుంచి ఇప్పటి వరకూ ఆప్‌కు ఎన్నికల్లో తిరుగులేకుండా పోతోంది. ఢిల్లీ మద్యం కేసులో అరెస్ట్ అయి జైలు నుంచి విడుదల అయిన తర్వాత ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ మరిన్ని ఉచితాలను ఎడా పెడా ప్రకటించారు. మహిళలకు ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన క్రింద నెలకు రూ. 2100 చొప్పున నగదు బదిలీ చేస్తామని, ఆలయాలు, గురుద్వారాల్లో పూజారులకు నెలకు రూ. 18వేల చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తామని, ఆటో డ్రైవర్లకు, వారి కుటుంబ సభ్యులకు కూడా బీమా, వివాహాలు, స్కూలు యూనిఫారంల రూపంలో ఆర్థిక సహాయం అందిస్తామని, ఢిల్లీలో అద్దె గృహాలలో ఉన్న వారందరికీ ఉచిత విద్యుత్, నీరు సరఫరా చేస్తామని ఈ ఎన్నికల్లో ఆప్ అధినేత ప్రకటించి ప్రత్యర్థి పార్టీలను కూడా ఆత్మరక్షణలో పడేలా చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా గెలవాలనుకుంటున్న బీజేపీ తాను కూడా ఉచితాల వర్షాన్ని కురిపించింది. కేజ్రీవాల్ కంటే ఒక అడుగు ముందుకు వేసి మహిళలకు రూ. 2500 చొప్పున నెలకు చెల్లిస్తామని, గర్భిణీ స్త్రీలకు రూ. 21వేలతో పాటు ఆరు పోషకాహార కిట్లను పంచిపెడ్తామని బీజేపీ ప్రకటించింది. తమ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా ఇది కేవలం మొదటి భాగం మాత్రమే అనడాన్ని బట్టి కేజ్రీవాల్ ఆ పార్టీపై ఎంత ప్రభావం చూపుతున్నారో అర్థమవుతుంది. ఢిల్లీ మాత్రమే కాదు, ఇప్పుడు యావద్దేశమూ ఉచితాల బాటలో పయనిస్తోంది. 2024–25లో 9 రాష్ట్రాలు మహిళలకు నగదు బదిలీ క్రింద రూ. లక్ష కోట్లు ఖర్చు పెట్టాయని చట్టసభల పనితీరును అధ్యయనం చేసే పీఆర్ఎస్ పరిశోధనా సంస్థ వెల్లడించింది.

రూ. 76 వేల కోట్ల ఢిల్లీ బడ్జెట్‌లో దాదాపు రూ. 15వేల కోట్లకు పైగా ఉచితాలకు, సబ్సిడీలకే ఖర్చవుతుందని, రూ. 8,159 కోట్ల మేరకు బడ్జెటరీ లోటు ఏర్పడుతుందని, పెద్ద ఎత్తున అప్పులు చేయక తప్పదని తెలిసి కూడా కేజ్రీవాల్ తిరిగి అధికారంలోకి రావడానికి ప్రజలకు హామీలను కురిపించక తప్పడం లేదు. జాతీయ చిన్నపొదుపు మొత్తాల నిధి నుంచి కూడా ఆప్ ప్రభుత్వం అప్పులు చేసి రోజువారీ ఖర్చులను భరించాల్సి వస్తోంది.

కేంద్ర ఆర్థిక పరిస్థితి కూడా అంత దివ్యంగా ఏమీ లేదు. ఈ ఆర్థిక సంవత్సరాంతానికి మార్కెట్ అప్పులతో సహా కేంద్రం అప్పులు రూ. 185 లక్షల కోట్లకు చేరుకోబోతున్నాయి. జీడీపీలో 56.8 శాతం దేశం అప్పులే ఉన్నాయి. ప్రతి ఏడాదీ రూ. 30 లక్షల కోట్లు ప్రభుత్వం అదనంగా అప్పులు చేయాల్సి వస్తున్నది. రాష్ట్రాల పరిస్థితి కూడా ఇంతకంటే దారుణంగా ఉన్నది. ఎన్నికల్లో గెలిచేందుకు రకరకాల ఉచితాలను ప్రకటించిన ప్రభుత్వాలు వాటిని అమలు చేయడం కోసం నానా కష్టాలు పడాల్సి వస్తోంది. మహారాష్ట్రలో లడ్కీ బెహనా పథకం అమలు చేసేందుకు ఏటా రూ. 46వేల కోట్లు ఎలా తేవాలా అని ప్రభుత్వం గింజుకుంటున్నట్లు సమాచారం.

నగదు బదిలీల వల్ల ప్రజల వినియోగ సామర్థ్యం పెరిగి ఆర్థిక వ్యవస్థకు ఎంతో కొంత తోడ్పడుతుందనే వాదన ఒకటి ఉన్నది. అయిత నిరుత్పాదక వ్యయం వల్ల జరిగే నష్టాలు అన్నీ ఇన్నీ కావు కదా. ప్రజలకు చేతినిండా పని కల్పించలేని ప్రభుత్వాల అసమర్థత వల్ల ఆర్థిక వ్యవస్థకు ఎంత మేరకు నష్టం జరుగుతుందో, దాని వల్ల సమాజంలో జరిగే నష్టాలు ఎన్నో కూడా ఊహించవచ్చు. 'ఏదీ ఉచితంగా లభించదు. కొందరికి లభించే ఉచితాలకు సమాజంలో మరెవరో చెల్లించాల్సి వస్తుంది' అని ఆర్థికవేత్తలు అంటున్నారు. వేల కోట్లు బ్యాంకులకు అప్పులు బాకీపడిన, విదేశాలకు పరారైన, కోట్ల రూపాయలు పన్నులు ఎగ్గొట్టిన, రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చిన సంపన్నులు మాత్రం ఈ ఉచితాలను భరించడం లేదన్నది మాత్రం వాస్తవం. అందుకే దేశంలో అసమానతలు తగ్గించాలంటే లక్షల కోట్లకు పడగలెత్తిన (సూపర్ రిచ్) సంపన్నులపై మరిన్ని పనులు విధించినప్పుడే దేశంలో అసమానతలు తగ్గుతాయని గత ఏడాది ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో జరిగిన ఒక సెమినార్‌లో ప్రసంగించిన ఫ్రెంచ్ ఆర్థికవేత్త థామస్ పికెటీ అన్నారు. దేశం సంపదలో 40 శాతం పైగా కేవలం ఒక శాతం సంపన్నులు కబళించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బహుశా కార్పొరేట్లకు, సంపన్నులకు రుణాలను రద్దు చేయడం, భారీ ప్యాకేజీని ప్రకటించడం, కొంతమంది సంపన్నులకు అనుకూలంగా విధానాలను రూపొందించడాన్ని ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతోనే దేశంలో రాజకీయ పార్టీలు వారిని ప్రలోభపెట్టేందుకు ఉచితాలను ప్రయోగిస్తున్నారేమో అన్న అనుమానం కూడా లేకపోలేదు. నిజానికి ఉచితాలను అమలు చేసి రాజకీయ ప్రయోజనాలు పొందే పార్టీలు ఎవరి జేబులు కొడుతున్నాయో, సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. ఉచితాల వల్ల జరిగే భారీ వ్యయాన్ని భరించేందుకు ఆర్థిక లోటు లక్ష్యాలను, పెట్టుబడి, రెవిన్యూ వ్యయాలను, మౌలిక సదుపాయాలకు పెట్టే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం సవరించాల్సి వస్తోంది. దాని వల్ల ఏ వర్గం నష్టపోతోంది?

ఆర్థికవేత్తల ప్రకారం సబ్సిడీలు వేరు, ఉచితాలు వేరు. సబ్సిడీల వల్ల కొన్ని సందర్భాల్లో పెట్టిన ఖర్చు తిరిగి వస్తుంది. కాని ఉచితాలు గోడకు వేసిన సున్నం లాంటివే. ఆరోగ్యం, విద్య ప్రభుత్వ సేవలు అందించడాన్ని ఉచితాలుగా వర్గీకరించలేమని, వీటిలో కొన్ని ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యవంతం కావడానికి తోడ్పడతాయని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎనపీఎఫ్‌పీ)కి చెందిన పరిశోధకులు అంటున్నారు. 'ఒక వస్తువు సేకరించినప్పుడు పెట్టే వ్యయానికి, దాన్ని అమ్మిన ధరకు మధ్య తేడాయే సబ్సిడీ' అని ప్రముఖ ఆర్థికవేత్త, రిజర్వుబ్యాంకు మాజీ గవర్నర్ సి. రంగరాజన్ నిర్వచించారు. ప్రజలకు అత్యవసరమైన వస్తువులపై, వ్యక్తికన్నా సమాజానికి తోడ్పడే వస్తువులపై పెట్టే సబ్సిడీని సమర్థించవచ్చు కాని అంతకు మించి ఏది చేసినా అది ఉచితమే అవుతుందని ఆయన అన్నారు. ఉత్పత్తి వ్యయాని కంటే తక్కువగా లేదా ఉచితంగా ఇచ్చిన వస్తువు, సేవలను ఉచితాలనే భావించవచ్చని వివేక్ కౌల్ అనే మరో ఆర్థికవేత్త అన్నారు. ఆర్థికవేత్తలు ఏమి చెబుతున్నప్పటికీ సంక్షేమ వ్యయం, సబ్సిడీలు, ఉచితాలకూ మధ్య సరిహద్దులు రోజురోజుకూ చెరిగిపోతున్నాయి. సమాజంలో అట్టడుగు వర్గాలకు చేయూత నిచ్చేందుకు, విద్యను, నైపుణ్యాన్ని పెంపొందించేందుకు, ఆరోగ్య సంరక్షణ కల్పించేందుకు మాత్రమే సహాయం చేయాలన్న నిబంధనను ప్రభుత్వాలు పెట్టుకోవడం లేదు. దీనివల్ల దాదాపు అన్ని వర్గాలూ ఉచితాలను ఆశించే పరిస్థితి ఏర్పడుతోంది. 'ఉచితాలకు మీరు నిధులు కేటాయిస్తారు కాని న్యాయమూర్తుల జీతాలు, పింఛన్లు చెల్లించేందుకు మాత్రం మీ వద్ద డబ్బులు లేవు. ఎంతకాలం హేతుబద్ధత లేకుండా ఈ ఉచితాలను కొనసాగిస్తారు?' అని సుప్రీంకోర్టు కూడా ప్రశ్నించింది. ఢిల్లీలోని ప్రతిష్ఠాత్మకమైన ఎయిమ్స్ ఆసుపత్రిని ఇటీవల సందర్శించిన కాంగ్రెస్ నేత రాహుల్ ఆసుపత్రి కారిడార్లలో, ఫుట్‌పాత్‌లపై చికిత్స కోసం రోజుల తరబడి వేచి చూస్తూ రాత్రింబగళ్లు పడిగాపులు కాస్తున్న వేలాది పేదలను చూసి చలించిపోయారు. ఈ మానవత్వ సంక్షోభాన్ని పట్టించుకోవాల్సిందిగా ఆయన ఆరోగ్యమంత్రి నడ్డాకు లేఖ రాశారు. ఎయిమ్స్‌లోనే కాదు, దేశంలో అనేక ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ దుస్థితి కొనసాగుతోంది. ఉచితాలపై కంటే ఇలాంటి వాటి గురించి ప్రభుత్వాలు ఎందుకు పట్టించుకోవడం లేదు? జమిలి ఎన్నికలు, ఉమ్మడి పౌరస్మృతి వంటివి బీజేపీకి ముఖ్యమే కావచ్చు కాని ఉచితాలపై నరేంద్రమోదీ వివిధ రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయసాధనకు ప్రయత్నించడం తక్షణ అవసరం. పారదర్శకత, నిర్దిష్ట కాలపరిమితిని నిర్ణయించడం, అవసరమైన వారిని గుర్తించడం, లక్ష్యాలను సమర్థంగా సాధించారా లేదా సమీక్షించడం వంటి విధానాల ద్వారా ఉచితాలను, సబ్సిడీలను హేతుబద్ధం చేయాల్సి ఉంది. లేకపోతే ఈ ఉచితాల పరంపర ఎంత హాస్యాస్పదమైన స్థాయికైనా దిగజారవచ్చు.



ఉచితాలను అమలు చేసి రాజకీయ ప్రయోజనాలు పొందే పార్టీలు ఎవరి జేబులు కొడుతున్నాయో, సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. ఉచితాలపై వివిధ రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయసాధనకు ప్రధాని మోదీ ప్రయత్నించాలి. పారదర్శకత, నిర్దిష్ట కాలపరిమితిని నిర్ణయించడం, అవసరమైన వారిని గుర్తించడం, లక్ష్యాలను సమర్థంగా సాధించారా లేదా సమీక్షించడం వంటి విధానాల ద్వారా ఉచితాలను, సబ్సిడీలను హేతుబద్ధం చేయాలి.

పిల్లలకు స్మార్ట్ ఫోన్ ఎందుకు?

ఇటీవలే చైనా కంపెనీ వివో మనదేశంలో స్మార్ట్ ఫోన్ వినియోగంపై ఓ సర్వే నిర్వహించగా విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సర్వే ప్రకారం స్మార్ట్ ఫోన్ ఎక్కువగా వాడటం వల్ల తల్లిదండ్రుల, పిల్లల సంబంధాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని, రోజులో సగటున పెద్దలు ఐదు గంటలకు పైగా, పిల్లలు నాలుగు గంటలకు పైగా స్మార్ట్ ఫోన్లు వాడుతున్నారని తెలిపింది. ఇందులో ఎక్కువ భాగం సామాజిక మాధ్యమాలలో (ఫేస్‌బుక్, వాట్సప్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్) వినోద కార్యక్రమాలు వీక్షిస్తున్నట్లు తెలిపింది. దీని ద్వారా యుక్త వయస్సు పిల్లలు, చిన్న పిల్లలు ఇతర దురలవాట్లకు గురయ్యే ప్రమాదముందని కూడా సూచించింది. సంబంధాలు దెబ్బతినడానికి స్మార్ట్ ఫోన్ కూడా ప్రధాన కారణం అని 73 శాతం మంది తల్లిదండ్రులు, 69 శాతం మంది పిల్లలు ఈ సర్వేలో అంగీకరించటం విశేషం. అలాగే స్మార్ట్ ఫోన్ లేకుండా మేం ఉండలేం అని 76శాతం మంది తల్లిదండ్రులు, 71 శాతం మంది పిల్లలు ఈ సర్వేలో ఒప్పుకొన్నారంటే దేశంలో స్మార్ట్ ఫోన్ వినియోగం వల్ల మానవ సంబంధాల విధ్వంసం రాబోయే రోజుల్లో ఎలా ఉండబోతుందో ఊహించుకోవచ్చు. స్మార్ట్ ఫోన్ వినియోగాన్ని ఇటీవలే ఆ[illegible]యా దేశం 16సంవత్సరాలలోపు పిల్లలకు నిషేధించింది. మన దేశం కూడా ముందు ముందు ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎదుర్కోకుండా ఉండాలంటే ముందు జాగ్రత్తగానే మేల్కొని పిల్లలకు, పెద్దలకు హాని కల్గించే స్మార్ట్ ఫోన్లను, వాటిలో వచ్చే అశ్లీలమైన వీడియోలు ఏవైనా ఉంటే నిలిపివేసే విధంగా కఠిన చర్యలు తీసుకోవాలి.

– డా. మహ్మద్ హసన్
అసిస్టెంట్ ప్రొఫెసర్

పద్యకవుల్లో ప్రజాకవి.. మల్లవరపు జాన్

ఆధునిక సాహిత్యంలో ప్రజా చైతన్యానికి పట్టుగొమ్మగా నిలిచే పద్య కవిత్వం రాసిన విశిష్ట కవి మల్లవరపు జాన్. 'మధుర కవి'గా తెలుగునాట ప్రసిద్ధికెక్కిన జాన్, నాలుగు దశాబ్దాల పాటు అవిచ్ఛిన్నంగా సాహిత్యసేద్యం చేసి, పద్య కవిత్వానికి వినూత్న జవజీవాలను అందించాడు. జాన్ పేరు ఈ తరం వచన కవులకు పెద్దగా పరిచయం లేకపోవచ్చు కానీ, జాషువానంతర పద్య కవులకు మాత్రం నులివెచ్చని జొన్నరొట్టె లాంటి ఆయన పద్యం అత్యంత ప్రీతిపాత్రమైనది.

మల్లవరపు జాన్ ప్రకాశం జిల్లా చీమకుర్తి పట్టణంలో 1927 జనవరి 22న మాదిగ సామాజిక వర్గానికి చెందిన దావీదు, రత్నమ్మ దంపతులకు జన్మించాడు. అంటరానితనం, పేదరికం కారణంగా అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని, కఠోరమైన శ్రమతో సంస్కృతాంధ్ర భాషా సాహిత్యాలను అధ్యయనం చేసి, తెలుగు పండితునిగా, పద్యకవిగా ఎదిగి, తెలుగు జాతికి విశేషమైన సేవలందించాడు. విశ్వప్రకాశం, అతుకుల బ్రతుకులు, క్రాంతి రేఖలు, చిరస్మరణీయులు, భావ విపంచి మొదలగు పద్యకావ్యాలతో ఆధునిక కవిత్వంలో జాన్ సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాడు.



మల్లవరపు జాన్ కావ్యాలను పరిశీలించమని తుమ్మల సీతారామమూర్తి రస హృదయులైన భాషాభిమానులకు హితవు పలికాడు. "పురుషుల్ జేసిన పుణ్య మెట్టిదియె యెపుడున్ మానభంగాలకున్ గురియైపోయిన జాడలేదు" అని స్త్రీ వాదిలా కన్నెర్ర జేశాడు. ఛందో బందోబస్తుల రహదారుల్లో జాన్ ప్రజా సమస్యల కేంద్రంగా శక్తివంతమైన పద్య కవిత్వం రాశాడు. అభ్యుదయ కవితా ప్రభంజనం తీరం దాటుతున్న సాహిత్య సంక్షోభంలో రచయితగా రంగప్రవేశం చేసిన మల్లవరపు జాన్, అస్తిత్వ ఉద్యమాల సాహిత్య సందర్భంలో కన్నుమూశాడు (2006). ఈ నలభైయేళ్ళలో సాగిన సామాజిక ఉద్యమాలతో కవికి ప్రత్యక్షంగా సంబంధం లేకపోయినప్పటికీ, ఆయా ఉద్యమాల మౌలికావేశాలు, అవి లేవనెత్తిన ప్రాథమిక ప్రశ్నలు జాన్ కవిత్వంలో సర్వత్రా కనబడతాయి. "పురుషులతో సమానంగా సర్వకార్యములు నెరపెడి శక్తియుక్తులు నేర్చిన" ఆధునిక స్త్రీలను అణిచివేయడం సభ్యసమాజానికి సిగ్గుచేటు కలిగించే విషయమని ఎలుగెత్తి చాటిన మల్లవరపు జాన్ సాహిత్య వ్యక్తిత్వం ఎంతో ఉదాత్తమైనది.


విశ్వమానవాళికి సమతా సందేశాన్నందించిన గౌతమ బుద్ధుని సమున్నత మూర్తిమత్వాన్ని జాన్ కవి ఆరాధించాడు. కులీనుల ఇళ్ళలో కుక్కకు కూడా మనిషి హెూదా లభిస్తుందని, కానీ కుల సమాజంలో దళితులకు జీవించే హక్కు లేకుండా పోతుందని, ఈ దుర్మార్గమైన విషమ పరిస్థితిని రూపుమాపలేని భారతదేశాన్ని చూసి ప్రపంచం పరిహసిస్తుందని మల్లవరపు జాన్ 'అస్పృశ్యత' అనే ఖండికలో నిశితంగా విమర్శించాడు. "మాలయతడు, నేను మాదిగ కులజుడనను భేద ముండునంత దనక, కలిసి తిరగలేముకదా కులీనులతోడ, ఇంట గెలిచి రచ్చకేగుమయ్య" (విశ్వప్రకాశం) అని సూటిగా ఇంటి గుట్టును బయటపెట్టిన జాన్ విలువైన మాటల్ని ఆచరణాత్మకంగా నిజం చేయాల్సిన అవసరమెంతైనా ఉంది. "పరరాజన్యులు లేరు, నేడు ప్రజలే పాలించు రాజ్యంబులో, తరుగే మున్నది? సర్వహక్కుల సమానత్వము నీ సొమ్మురా తిరిపెమ్మెత్తెదవేల? సంఘటిత శక్తిన్ జూప లే లెమ్ము, నీ యరచేతన్ పరిపాలనా చరణ భాగ్యంబెన్నడో దోచె" (విశ్వప్రకాశం) అంటూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనల వెలుగులో దళితులకు కర్తవ్యాన్ని నూరిపోశాడు.

సంస్కృత భాషా సముద్రాల్ని లంఘించిన పండితోత్తముల మెప్పుకోసం ఆయన పద్యం రాయలేదు. లెక్కకు మిక్కిలి సమస్యలతో సతమతమవుతున్న సగటు మనిషిలో కనువిప్పు కలిగించాలనే ఉత్తమ సంకల్పంతోనే మల్లవరపు జాన్ ప్రయోజనాత్మకమైన పద్య కవిత్వం రాశాడు. అందుకే జాన్ పద్యం గుడిలో తీర్థం వంటిది కాదు. చౌరాస్తాలోని చలివేంద్రంలో దొరికే చల్లని మంచినీరు వంటిది. ఆ మంచినీటి తత్వం వల్లనే మల్లవరపు కవిత్వంలో మధురత్వంతో అంతకంటే మించిన సజీవత్వం నిలువెల్లా పరిమళిస్తుంది. సుతిమెత్తని ఎత్తిపొడుపు, మర్యాదపూర్వకమైన మందలింపు, సంభాషణా సిద్ధమైన పద్యధార మొదలైన లక్షణాల వల్ల జాను కవిత్వం ఎంతోమంది పాఠకులకు చేరువయింది. అత్యాధునిక సాహిత్యంలో వచన కవితా రూపానికి సమాంతరంగా పద్యాన్ని కదం తొక్కించి, వచన కవుల్లోని ఆధునికతని ఆహ్వానించి, జాతీయ–అంతర్జాతీయ పరిణామాలకు స్పందిస్తూ, ఎప్పటికప్పుడు తాజా కవిత్వాన్ని సృజించిన జాన్ పద్యకవుల్లో ప్రజాకవి. భావంలో ఎంత ఆధునికత ఉన్నా, మరెంత సమకాలికత ఉట్టిపడినా, పొరపాటున అది పద్య కవిత్వమైతే ఏ మాత్రం ఆదరించని రూపలౌల్యం సోకాల్డ్ విమర్శకుల్ని పట్టిపీడిస్తున్నందువల్ల మల్లవరపు జాన్‌కి తెలుగు సాహిత్యంలో రావాల్సినంత గుర్తింపు రాలేదు.

■ డాక్టర్ కోయి కోటేశ్వరరావు
ప్రభుత్వ సిటీ కళాశాల, హైదరాబాద్
(నేడు మల్లవరపు జాన్ జయంతి)

అయోధ్య ఆలయానికి వార్షికోత్సవ శోభ!

హిందువుల ఐదు శతాబ్దాల స్వప్నం నెరవేరి అప్పుడే ఏడాది గడిచింది. 2024 జనవరి 22న అయోధ్యలో నిర్మించిన భవ్య రామ మందిర ఆరంభోత్సవాన్ని తలచుకుంటే మది ఉప్పొంగుతుంది. ప్రపంచ దేశాలు ఒళ్లంతా కళ్ళు చేసుకుని వీక్షించిన సుమధుర ఘట్టం అది. బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ వార్షికోత్సవ వేడుకను జరుపుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ సమాజం సిద్ధమవుతున్నది. 'ప్రతిష్ఠ ద్వాదశి' పేరుతో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జనవరి 11 నుంచి 13 వరకూ ప్రతిష్ఠాపన వేడుకల కార్యక్రమాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. న భూతో న భవిష్యత్ అనే రీతిలో భూమండలమంతా సంబరాలు చేసుకున్న ఈ సుదినానికి నేటికి ఏడాది.



న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా సుప్రీంకోర్టులో విజయం సాధించి మందిరం నిర్మించుకున్న సందర్భం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. శ్రీమంతుల నుంచి పేదవారి వరకు ప్రతి హిందువూ మనస్ఫూర్తిగా నిధి సమర్పించి నిర్మించుకున్న ఈ మందిరం హిందువుల స్వాభిమాన సంకేతం. కులాలు, వర్గాలు, ప్రాంతాలు, భాషలు, పేద ధనిక తరతమ భేదాలు మరిచి అంతా రామనామం జపించిన ఐక్యతా రాగం రామ మందిరం ప్రతిష్ఠ సందర్భం. ప్రతి ఇంటికీ రాములవారి అక్షింతలను అందజేసి మందిర ప్రారంభానికి ఆహ్వానించిన కార్యక్రమం ఓ అద్భుతం. 2024 జనవరి 1 నుంచి 15 వరకు దేశంలోని 11 కోట్ల కుటుంబాలకు అక్షింతలు అందజేసిన కార్యక్రమం ఓ ఆధ్యాత్మిక విప్లవం. దాదాపు 40 కోట్లకు పైగా శ్రీరామ భక్తులను కలిసి అక్షింతలు ఇచ్చి అయోధ్యకు ఆహ్వానించడం ఓ ఘన చరిత్ర. మందిరం ప్రారంభం రోజున పూజ సామాగ్రికి, పూలూ పండ్లకూ కొరత ఏర్పడింది. దేవాలయాలు కిక్కిరిసిపోయాయి. జనవరి 22వ తేదీ రాత్రి దీపావళిని మించి టపాసులు పేలాయి. ప్రతి ఇంటిపైనా దీపాలు వెలిగాయి. ఇలా ఒకటేమిటి, ఒళ్ళు పులకరింపచేసే ఆనాటి స్మృతులు అనేకం.

రామాలయ ప్రారంభం తర్వాత ప్రజలు తాజ్ మహల్‌ను మించి అయోధ్య రాముడిని దర్శించుకోవడం విశేషం. 2024 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 13.55 కోట్ల మంది భారతీయులు, లక్షలాది మంది విదేశీయులు దర్శించుకున్నారు. అంటే నెలకు దాదాపు కోటికి పైగా భక్తులు రాములవారిని దర్శించుకున్నారు.

– పగుడాకుల బాలస్వామి
విశ్వహిందూ పరిషత్, తెలంగాణ



గురు పోరు!

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సమాయత్తం

- ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పరిధిలో ఎన్నికలు
- మార్చి 29వ తేదీతో పూర్తికానున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పదవీకాలం
- ఫిబ్రవరి మూడోవారంలో నోటిఫికేషన్ వచ్చే అవకాశం
- ఇప్పటికే పోటీ చేసే అభ్యర్థులను ప్రకటిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు
- తమ అభ్యర్థిని బరిలో నిలిపిన భారతీయ జనతా పార్టీ
- అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్న ఇండిపెండెంట్లు
- మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 25వేల మంది టీచర్ ఓటర్లు

వివరాలు : 7 లో..

ఎమ్మెల్సీ ఎన్నికలకు టీచర్లు సిద్ధమవుతున్నారు. వచ్చే నెలలో జరగనున్న తెలంగాణ శాసనమండలి ఉపాధ్యాయ పోరుకు అభ్యర్థులు కసరత్తు మొదలుపెట్టారు. ఉపాధ్యాయ సంఘాల తరఫున కొందరు అభ్యర్థులు బరిలో దిగుతుండగా, పార్టీల మద్దతుతో మరికొందరు పోటీకి సిద్ధమవుతున్నారు. ఇక మరికొందరు స్వతంత్రంగా బరిలో దిగేందుకు తయారవుతున్నారు. అయితే గత 2019 ఎన్నికల్లో టీజీ యూటీఎఫ్ తరఫున పోటీ చేసి ఎమ్మెల్సీగా విజయం సాధించిన నర్సిరెడ్డి పదవీకాలం ఫిబ్రవరి 29తో ముగియనుంది. దీంతో ఈలోగానే ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ క్రమంలో వచ్చే నెల మూడో లేదా నాలుగో వారంలో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరపాలని యోచిస్తోంది. ఈ క్రమంలో ఎన్నికల బరిలో నిలిచేందుకు ఉవ్విళ్లూరుతున్న అభ్యర్థులు ఏర్పాట్లు ముమ్మరం చేసుకుంటున్నారు. ప్రస్తుత ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మళ్లీ బరిలో నిలవనుండగా, గత ఎన్నికల్లో పీఆర్‌టీయూ నుంచి పోటీ చేసి ఓడిపోయిన పూల రవీందర్.. టీచర్స్ జాక్ తరఫున బరిలో దిగుతున్నారు. అలాగే పీఆర్‌టీయూ నుంచి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి బరిలో దిగుతున్నారు. ఇక బీజేపీ నుంచి మాజీ పీఆర్‌టీయూ నేత సరోత్తంరెడ్డి తపస్ మద్దతుతో బీజేపీ అభ్యర్థి బరిలో దిగుతున్నారు. వీరితో పాటు మాజీ కూడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ స్వతంత్రంగా అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. అలాగే మరో సంఘం నుంచి హర్షవర్ధన్‌రెడ్డి, సీపీఎస్ సంఘం నుంచి వెంకటస్వామి లాంటి నేతలు బరిలో ఉండడంతో పోటీ ఆసక్తికరంగా మారింది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

మల్టీ లెవల్ మార్కెటింగ్ స్కీమ్‌లతో

అప్రమత్తంగా ఉండాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



వరంగల్ క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీమ్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో సూచించారు. ప్రజల సొమ్ము దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త పోకడలతో ప్రజల బలహీనతలను పెట్టుబడిగా చేసుకునేందుకు కొత్త పంథాలను ప్రయోగిస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీమ్‌లతోపాటు పిరమిడ్ లాంటి స్కీమ్‌ల ద్వారా ప్రజల నుంచి డబ్బులను దోచేస్తున్నారన్నారు. ఈ స్కీమ్‌ల ప్రధాన లక్ష్యం విలాసవంతమైన వస్తువులు అందజేస్తామని, సొంత ఇంటి కలను నెరవేరుస్తామని, విదేశీ యాత్రలకు పంపిస్తామని మోసపూరితమైన వాగ్దానాలతో ఈ స్కీమ్‌లను నిర్వహిస్తున్న సైబర్ నేరగాళ్లు మొదటగా కొంత రుసుముతో ప్రాథమిక సభ్యత్వాన్ని కల్పిస్తారన్నారు. సభ్యత్వం పొందిన వారితో మరికొంతమందిని చేర్పిస్తే పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని ప్రజలను ప్రలోభపెడుతూ కోట్లలో డబ్బులు కొల్లగొట్టడం ఈ స్కీమ్‌ల ప్రధాన లక్ష్యమన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ప్రజల దృష్టిని ఆకర్షించే ప్రకటనలను నమ్మి మోసపోవద్దని, ఇలాంటి స్కీమ్‌ల పట్ల నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మోసపోయినట్లుగా భావిస్తే తక్షణమే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమీప పోలీస్‌స్టేషన్‌ల కానీ ఫిర్యాదు చేయాలన్నారు. లేదా కమిషనరేట్ కార్యాలయంలో సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లోనైనా బాధితులు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

గంజాయిని పట్టించిన పోలీసు జాగిలం

కాజీపేట రైల్వేస్టేషన్‌లో ఘటన



గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

వరంగల్ క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే స్టేషన్‌లో రవాణాకు సిద్ధంగా ఉన్న గంజాయి బ్యాగ్‌ను మంగళవారం కమిషనరేట్ పోలీసు జాగిలం పసిగట్టి పట్టుకుంది. కాజీపేట రైల్వేస్టేషన్ నుంచి గంజాయి తరలిస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ యాంటీ డ్రగ్ టీంకు సమాచారం రాగా, పోలీసు జాగిలంతో రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. రైల్వేస్టేషన్ పరిసరాలతో పాటు ప్లాట్‌ఫారమ్‌లపై జాగిలంతో విస్తృతంగా తనిఖీలు చేయడంతో ప్లాట్‌ఫారమ్-1పై వరంగల్ వైపు ప్రయాణికులు కూర్చొనే బల్ల వద్ద జాగిలం పెద్దగా అరవడంతో పోలీసులు బ్యాగ్‌ను తెరిచిచూడగా 4 కిలోల గంజాయి లభ్యమైంది. ఈ తనిఖీల్లో యాంటీ డ్రగ్ టీం ఇన్స్‌పెక్టర్ సురేశ్, ఆర్ఐ శివకేశవులు, ఆర్ఎస్సైలు పూర్ణ, మనోజ్, నాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలలో అర్హులకు

లబ్ధి చేకూర్చాలి



వీసీలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లుభట్టివిక్రమార్క

- పథకాలకు అర్హుల ఎంపిక నిరంతర ప్రక్రియ
- దరఖాస్తుల సమర్పణకు చివరితేదంటూ ఏమీ లేదు
- గ్రామ సభల నిర్వహణపై వీసీలో డిప్యూటీ సీఎం సమీక్ష



హనుమకొండ కలెక్టరేట్ నుంచి వీసీలో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, ఇతర అధికారులు

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పారదర్శకంగా అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చాలని, పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని, ప్రజలు అనవసరంగా ఆందోళన చెందొద్దని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధనశాఖల మంత్రి మల్లు భట్టివిక్రమార్క స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారితో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గ్రామ సభల నిర్వహణపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిం చారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. నాలుగు నూతన పథకాల అమలు కోసం మంగళవారం గ్రామ సభలు ప్రారంభించి రాష్ట్రంలో మొదటిరోజు 4,938 గ్రామ, వార్డు సభలు నిర్వహించామన్నారు. గ్రామ సభలలో ప్రదర్శించిన పథకాల అర్హుల ప్రాథమిక జాబితాలో అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా స్వీకరించి విచారణ చేపట్టాలని, అనర్హులుగా తేలితే జాబితా నుంచి తొలగించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సభలలో పెట్టే ప్రాథమిక జాబితా మంజూరు పత్రం కాదని, కేవలం దరఖాస్తుల స్వీకరణ జాబితా మాత్రమేనని ప్రజలకు తెలియజేయాలలన్నారు. అర్హులు ఎవరైనా ఉంటే దరఖాస్తులు తీసుకుంటామని, విచారించి అర్హులకు తప్పనిసరిగా పథకాలు అందిస్తామని ప్రజలకు స్పష్టంగా అధికారులు తెలపాలన్నారు. ఆయా పథకాల కోసం వచ్చిన దరఖాస్తుల జాబితా మాత్రమే గ్రామసభలలో చదవాలని, ఈ జాబితాలు మంజూరు చేసిన, ఆమోదించిన లేదా తుది జాబితాలు కాదనే విషయాన్ని ప్రజలకు అధికారులు స్పష్టంగా తెలియజేయాలన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన గ్రామసభలు మొదటిరోజు విజయవంతంగా ముగిశాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు.

మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 91లక్షల తెల్లరేషన్ కార్డులు 2కోట్ల 80లక్షల లబ్ధిదారులతో ఉన్నాయని, పదేళ్లలో నూతన రేషన్ కార్డులు జారీ చేయని కారణంగా ప్రస్తుతం ప్రజల నుంచి అధికంగా డిమాండ్ ఉందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే అనంతరం ఇండ్లు లేని దాదాపు 30లక్షల మంది అర్హులను గుర్తించి వివరాలు జిల్లాలకు పంపామని, వీరిలో ఇంటి స్థలం ఉన్నవారిలో ప్రాధాన్యత క్రమంలో మొదటి విడత కింద తీసుకుని ఇండ్లు మంజూరు చేయాలన్నారు. ఈ వీసీలో హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓలు, డీఆర్‌డీఓ మేన శ్రీను, తదితర అధికారులు పాల్గొన్నారు. వరంగల్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

అర్హులైన ప్రతీ ఒక్కరికి

సంక్షేమ పథకాలు

హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

హసన్‌పర్తి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మండలంలోని నాగారం గ్రామంలో స్పెషలాఫీసర్ ఎఫ్‌ఏసీ ఎంపీడీవో కె.కర్ణాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో కలెక్టర్ ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరై దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... అర్హులైన ప్రతీ ఒక్కరికి రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అందుతాయని తెలిపారు. గ్రామ సభలలో అర్హులైన లబ్ధిదారులు తమ పేర్లు రాలేదని ఆందోళనకు గురికావద్దని తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియ అని, పేర్లు రాని అర్హులైన లబ్ధిదారులు తిరిగి ఈ గ్రామ సభలలో దరఖాస్తు చేసుకుంటే తప్పకుండా పరిశీలించి న్యాయం చేయాలని ప్రభుత్వం అవకాశమిచ్చిందన్నారు. ఇంకా దరఖాస్తు చేసుకోని లబ్ధిదారులు గ్రామసభలలో దరఖాస్తు చేసుకుంటే దరఖాస్తులు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో గంగా భవాని, మండల స్పెషలాఫీసర్ వెంకటేష్, డిప్యూటీ తహసీల్దారు రహీం, ఏపీవో విజయలక్ష్మి, ఏఈవో సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం లంచాలు ఇవ్వొద్దు

- పైసలడిగితే నా టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయండి
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వర్ధన్నపేట రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రజలకు పథకాలను అందించాలనే లక్ష్యంతో ఉందని, దానికి విరుద్ధంగా ఎవరైనా పథకాలు ఇప్పిస్తామని పైసలడిగితే.. తన టోల్‌ఫ్రీ నంబర్ 8096107107కు ఫోన్ చేసి చెప్పాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారు వాటిని పొం దేందుకు ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన అవసరం లే దన్నారు. మంగళవారం మండలంలోని ఇల్లందలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఎమ్మెల్యే పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇం దిరమ్మ రాజ్యంలో ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారు లకు ఎంపిక చేసేందుకు అధికారులనే మీ ఇండ్లలోకి పంపిస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలనే ఆలోచనతోనే అధికారులు ప్రజల దగ్గరకు వస్తున్నారని తెలిపారు. అందరి సమ్మతితోనే గ్రామ సభలో పేర్లను పెట్టి అర్హులైన వారికి ఎంపిక చేస్తున్నట్లుగా గుర్తు చేశారు. ఇందిరమ్మ రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా ఈనెల 26 నుంచి ప్రభుత్వం ఇవ్వబోతోందని తెలిపారు. ఇక మండలంలోని కొత్తపెల్లి, అంబేద్కర్‌నగర్, చెన్నారంలో సైతం ప్రత్యేక అధికారులైన ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీవో ధనలక్ష్మి, ఏవో విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. చెన్నారంలో డీఆర్డీవో పీడీ కౌసల్యదేవి పాల్గొని మాట్లాడుతూ.. ప్రభుత్వం విధించిన విధివిధానాల ప్రకారం అర్హులైన పేదలకు ఎంపికచేసి వారికి పథకాలు అందేలా చేస్తామన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ విజయ్‌సాగర్, ఏఎంసీ డైరెక్టర్ మాలతిరెడ్డి, జీపీ కార్యదర్శి రామారావు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, జిల్లా నాయకుడు పోశాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలను

ఘనంగా నిర్వహించాలి

సమీక్షలో వరంగల్ కలెక్టర్ సత్యశారద



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. మంగళవారం వరంగల్ కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని, ప్రొటోకాల్ ప్రకారం అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వైద్య బృందం, అగ్నిమాపక యంత్రాంగం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 25వ తేదీలోగా ప్రశంసాపత్రాలను సిద్ధం చేయాలని, అన్ని శాఖలు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీ రవీందర్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నైపుణ్య అభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు చర్యలు

మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో జిల్లాకేంద్రంలో నైపుణ్య అభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలని, ఇందుకోసం తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని ఔత్సాహిక మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో వి-హబ్ సహకారంతో (స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్) నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా మహిళలు ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదిగేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. ఇందుకోసం వివిధ రంగాల్లో శిక్షణ ఇవ్వడానికి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, డీపీవో కల్పన, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, వి-హబ్ సంచాలకుడు జాహిద్ అక్తర్ షేక్, సహాయ సంచాలకులు ఊహ, డీపీఎం రేణుక, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్ పరీక్షలు

- 5 కేంద్రాల్లో మూడు రోజుల పాటు నిర్వహణ
- హాజరుకానున్న 7,542 మంది విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వరంగల్, హనుమకొండ జిల్లాల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 5ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షను మూడు రోజుల పాటు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. 22, 23, 24 తేదీల్లో నిర్వహించే పరీక్షకు 7,542 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. చింతగట్టులోని నోబుల్ టెక్నాలజీస్, భీమారంలోని మోక్షిత్ కంప్యూటర్స్, ఎర్రగట్టుగుట్ట వద్ద గల అయాన్ డిజిటల్ జోన్, పద్మాక్షిరోడ్‌లోని జయ ఇంజనీరింగ్ కాలేజ్, బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాల్లో పరీక్ష జరుగనుంది. పరీక్ష మొదటి సెషన్ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పరీక్ష జరుగనుంది. కాగా, పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులు రెండు గంటల ముందుగానే చేరుకోవాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను రెండు గంటల ముందు నుంచే అనుమతిస్తారు. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. అన్ని పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్ష సిటీ కోఆర్డినేటర్ కె.శ్రీలతరెడ్డి చెప్పారు. విద్యార్థులు నిర్దేశిత సమయంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఆమె కోరారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఫార్మసీ రంగానిది కీలక పాత్ర

- మానవ మనుగడలో ఫార్మసిస్టుల భూమిక గొప్పది
- కేయూ ఫార్మసీ కళాశాలకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు
- వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
- కేయూలో అంతర్జాతీయ ఫార్మసీ వర్క్‌షాప్

6

దర్గా దర్శనం.. ముక్తి మార్గం..

- 500ఏళ్ల చరిత్ర కలిగిన మాషూక్ రబ్బానీ దర్గా
- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- పలు రాష్ట్రాల నుంచి మత గురువుల రాక

7



ఇంటెలిజెన్స్ ఎస్పీ భాస్కర్‌రావుకు స్వామివారి చిత్రపటాలను అందిస్తున్న ఈవో

వెంకన్న సన్నిధిలో పోలీసు ఉన్నతాధికారులు

చిలుపూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంటెలిజెన్స్ ఎస్పీ ఆర్.భాస్కర్ రావు మంగళవారం సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా వారికి పూజారులు బ్రాహ్మణపల్లి రవిందర్‌శర్మ, రంగాచార్యులు వేదమంత్రాలు ఆలపించి స్వామివారి తీర్థప్రసాదాలతో పాటు, ఆశీర్వచనం సహా స్వామివారి చిత్రపటాలను అందించారు. ఎస్పీ భాస్కర్‌రావు మాట్లాడుతూ తమ ఇలవేల్పు బుగులు వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్టుబోర్డు ఛైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో భాగం లక్ష్మీప్రసన్న, కుర్రెంల మోహన్, డీఎస్పీ ఎ. సత్యనారాయణ, సీఐ ఎమ్డీ సాధిక్‌పాషా, ఎస్సై ఆరిఫుద్దీన్ పాల్గొన్నారు.



రమేష్‌ను సన్మానిస్తున్న ఆబోపా నాయకులు

డాక్టర్ చేపూరు రమేష్‌కు ఘన సత్కారం

న్యూశాయంపేట, జనవరి21 (ఆంధ్రజ్యోతి): ఆల్ బ్రాహ్మణ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(ఆబోపా) ఆధ్వర్యంలో హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వరంగల్ పబ్లిక్‌స్కూల్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో డాక్టర్ చేపూరు రమేష్‌ను ఘనంగా సన్మానించారు. 25 ఏళ్లుగా జ్యోతిష్యశాస్త్రంలో సేవలందిస్తూ ఎన్నో రాష్ట్ర, జాతీయ అవార్డు అందుకున్న జ్యోతిష్య పండితుడు డాక్టర్ చేపూరి రమేష్‌ను బ్రాహ్మణ సంఘం తరపున సన్మానించినట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు తెలిపారు. కార్యక్రమంలో లయన్ మోత్కూరి మనోహర్‌రావు, వద్దిరాజు వెంకటేశ్వర్‌రావు, మదన్‌మోహన్, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

వరంగల్ క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్తంభంపల్లి గ్రామ శివారులో పేకాటడుతున్న నలుగురు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ సీఐ సార్ల రాజు బృందం పట్టుకొని రూ.31.720 స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. పట్టుబడ్డ వారిలో గొర్రెకుంటకు చెందిన జన్ను శ్రీకాంత్, ఖిలావరంగల్ కామని హరిశ్, దేశాయిపేటకు చెంది మాతంగ శ్రీనివాస్, ఎల్‌బీనగర్‌కు చెందిన ఎస్‌కె. షఖీల్ ఉండగా గొర్రెకుంటకు చెందిన జన్ను రాజు, వంగ శివ పరారైనారన్నారు. పట్టుబడ్డ వ్యక్తులతోపాటు స్వాధీనపరుచుకున్న నగదు, 4 సెల్‌ఫోన్‌లను స్థానిక పోలీసులకు అప్పగించామన్నారు.

పూర్తయిన పరస్పర బదిలీల దరఖాస్తుల ప్రక్రియ

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పరస్పర బదిలీల ప్రక్రియకు సంబంధించిన దరఖాస్తు పరిశీలన మంగళవారం సైతం కొనసాగింది. వరంగల్ జిల్లాలో 55, హనుమకొండ జిల్లాలో 91 దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. పరస్పర బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్న ఉపాధ్యాయులు అండర్‌టేకింగ్ సర్టిఫికెట్లను అందజేసి వారి ధృవపత్రాలను పరిశీలన చేయించుకున్నారు. పూర్తి చేసిన నివేదికను జిల్లా విద్యాశాఖాధికారులు బుధవారం డీఎస్సీకి పంపించనున్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఫార్మసీ రంగం పాత్ర కీలకం

- కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
- కేయూలో అంతర్జాతీయ ఫార్మసీ వర్క్‌షాప్



వర్క్‌షాప్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, డీన్ గాదె సమ్మయ్య తదితరులు

కేయూ క్యాంపస్ జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఫార్మసీ రంగం కీలకమని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఉద్బోధించారు. మంగళవారం కేయూ ఫార్మసీ కళాశాల నేతృత్వంలో 'డ్రగ్ డిస్కవరీ ఇన్నోవేషన్ డెవలప్‌మెంట్' అనే అంశంపై ఒక్కరోజు అంతర్జాతీయ వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా కేయూ ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్ ఫ్లెక్సీని ఫార్మసీ విభాగం డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం కేయూ సెనెట్ హాల్‌లో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన వర్క్‌షాప్‌లో వీసీ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మానవ మనుగడలో ఫార్మసిస్టుల పాత్ర గొప్పదన్నారు. రోజురోజుకూ విభృంభిస్తున్న అనేక రోగాలకు ఫార్మసిస్టులు నూతన ఔషధాలను కనుగొని ఎందరో ప్రాణాలను కాపాడుతున్నారని కొనియాడారు. ప్రపంచ వ్యాప్తంగా, మరీ ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అలాగే ఫార్మసీ అల్యూమినీలో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రఖ్యాత ఫార్మసిస్టులు ఉన్నారని చెప్పారు. ఫార్మసీ కళాశాల వర్సిటీకి గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. వర్సిటీలోని ఫార్మసీ కళాశాలను రూసా నిధులతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. రూ.12 కోట్ల నిధులతో పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కేయూ ఫార్మసీ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలను జరుపుకుంటుందని తెలిపారు. ఇన్నోవేషన్‌తో చేసే పరిశోధనలలో నిబద్ధత ఉంటుందని అన్నారు. తాను న్యూరో ఫార్మకాలజీపై పరిశోధనలు చేసిన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఫార్మసీలో పరిశోధనలను ప్రోత్సహిస్తానని వెల్లడించారు.

రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఫార్మసిస్టులకు ఔషధాలపై పూర్తి పట్టుఉండాలని సూచించారు. ఔషధాలు రోగులకు ప్రాణాలు పోసి, జీవాన్ని నిలుపుతాయని గుర్తు చేశారు. ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు సైంటిఫిక్ మెథడలాజీని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఫార్మసిస్టులు నూతన ఔషధాలను కనుక్కోవాలని కోరారు. ఫార్మసీ విద్యార్థులు క్లాస్‌లోని థియరీతో పాటు ప్రాక్టికల్ విధానాన్ని ఎక్కువగా అనుసరించాలని అన్నారు. ప్రపంచ దేశాలన్నీ నూతన ఔషధాల తయారీపై తీవ్రంగా పోటీపడుతున్నాయని వివరించారు. ఫార్మసీ నూతన ఆవిష్కరణల్లో యువత, విద్యార్థులు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నీరడి ప్రసాద్ ఉద్దేశాలను వెల్లడించారు. ఫార్మసీ కళాశాల ఔన్నత్యాన్ని వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో ఫార్మసీ విభాగం ప్రొఫెసర్ జె. కృష్ణవేణి, ప్రొఫెసర్ వై.నర్సింహారెడ్డి, డాక్టర్ షయేదా, రిటైర్డు ప్రొఫెసర్లు సారంగపాణి, కిషన్, అచ్చయ్య, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీలంతా ఏకతాటిపైకి రావాలి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో నిలవాలి..
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కూరపాటి రమేశ్

వరంగల్ మెడికల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బీసీలంతా ఏకమైతేనే అధికారాన్ని సులభంగా చేపట్టవచ్చని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. ఈ నెల 24న హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించే 'స్థానిక సంస్థల ఎన్నికలు-బీసీల పాత్ర'పై మంగళవారం హోటల్ అశోకాలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లాకమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ కూరపాటి రమేశ్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. నూటికి 70శాతం ఉన్న బీసీలు 78 ఏళ్లలో పూర్తిగా అధికారాన్ని కోల్పోయారని, బీసీలకు దక్కాల్సిన ఫలాలన్నీ అగ్రకులాలు హస్తగతం చేసుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా సోయి తెచ్చుకొని అందరూ ఏకమై వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు అయిన సీట్లు మినహా మిగతా సీట్లలో బీసీలే పోటీ చేయాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ కె.వీరస్వామి, డాక్టర్ సిహెచ్.రాములు, సుందర్‌రాజ్ యాదవ్, డాక్టర్ ఎల్.చంద్రమోహన్, డాక్టర్ కె.వెంకటస్వామి, డాక్టర్ కె.వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యూఢిల్లీ అస్మాన్ సంస్థ స్టూడెంట్ కౌన్సిలర్ రాజేంద్రప్రసాద్

విద్యార్థులు దృఢచిత్తంతో పరీక్షలను ఎదుర్కోవాలి

న్యూఢిల్లీ అస్మాన్ సంస్థ స్టూడెంట్ కౌన్సిలర్ రాజేంద్రప్రసాద్

కేయూ క్యాంపస్ జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దృఢచిత్తంలో రానున్న వార్షిక పరీక్షలను ఎదుర్కొని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని న్యూఢిల్లీలోని అస్మాన్ స్టూడెంట్ కౌన్సెలర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని ప్రభుత్వ వృత్తివిద్యా కళాశాలలో విద్యార్థులకు పరీక్షల నేపథ్యంలో సైకాలజికల్ టెస్టు నిర్వహించారు. పలు ప్రశ్నాలను అడిగి విద్యార్థుల మానసిక దృక్పథాన్ని అంచనా వేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. పరీక్షల సమయంలో విద్యార్థుల మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రేణు కుంట్ల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థు లు పరీక్షలంటే భయం పెట్టుకోకుండా ప్రణాళికబద్ధంగా పరీక్షలకు సిద్ధం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాకాలను సందర్శించిన సీసీఎఫ్ భీమానాయక్



పాకాలలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న సీసీఎఫ్ భీమానాయక్

ఖానాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పాకాల సరస్సును చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీసీఎఫ్) భీమానాయక్ మంగళవారం సందర్శించారు. పాకాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పాకాల సరస్సులో బోటు షికారు చేశారు. చెరువు కట్టపై నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలించారు. పాకాల తూములను, బయోడైవర్సీటీ పార్క్, బటర్‌ఫ్లై గార్డెన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకాలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలపెడతామన్నారు. పాకాలలో పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించేందుకు దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వరంగల్, మహబూబాబా ద్ డీఎఫ్‌వోలు అనూజ్ అగర్వాల్, విశాల్, ఎఫ్‌డీవో చంద్రశేఖర్, ఎఫ్ఆర్వో రవికిరణ్, డీఆర్వో రీణా, ఎఫ్‌బీవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్‌లో ఇక్బాల్‌కు డాక్టరేట్



ఆసీం ఇక్బాల్

కేయూ క్యాంపస్ జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎమ్డీ ఆసీం ఇక్బాల్ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు మంగళవారం తమిళనాడులోని అన్నామలై విశ్వవిద్యాలయం ఈసీఈ విభాగంలో ప్రొఫెసర్ డాక్టర్ కె.దేవరాజన్, కో గైడ్ వాగ్దేవి ఇంజరింగ్ కళాశాల అధ్యాపకులు సయ్యద్ ముస్తాక్ అహ్మద్ పర్యవేక్షణలో పరిశోధన గ్రంథాన్ని రూపొందించినందుకు గాను డాక్టరేట్ ప్రకటించారు. 'కాఫ్ స్పీచ్ సిగ్నల్ అనాలిసిస్ యూజింగ్ హైబ్రిడ్ ఆప్టిమైజేషన్, డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ ఫర్ రియల్ టైమ్ ఆస్తమా డిసిజ్ డిటెన్షన్ అప్లికేషన్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని రూపొందించారు. ఆసీం ఇక్బాల్ 2013 కాకతీయ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. హనుమకొండ ఆలంకార్ ప్రాంతానికి చెందిన ఆసీం ఇక్బాల్ ఇంటర్నేషనల్ జర్నల్స్‌లో 9 రిసెర్చ్ ఆర్టికల్స్ ప్రచురించారు. కేయూ పరీక్షల విభాగంలో అడిషనల్ కంట్రోలర్‌గా విధులు నిర్వహిస్తున్నారు 2018లో భారత్ వికాస్ అవార్డు, 2020-21 ఏడాదికిగాను ఐఈఐ యంగ్ ఇంజనీర్ అవార్డును పొందారు. హనుమకొండ జిల్లా బెస్ట్ ఎన్ఎస్ఎస్ అవార్డును పొందారు. ఆసీం ఇక్బాల్ తండ్రి ఎమ్డీ సర్వర్ వర్సిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేశారు. తల్లి ఖతీజాబేగం, మోబిన్ బేగంలతో పాటు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ రమణ తదితరులు ఆసీం ఇక్బాల్‌ను అభినందించారు.

రయ్యాల శ్రీధరాచార్యులకు జాతీయ పురస్కారం

స్వర్ణ కంకణధారణ చేసిన సకల కళా వేదిక



కరీంనగర్ ఫిల్మ్ చాంబర్‌లో శ్రీధరాచార్యులకు పురస్కారం అందజేస్తున్న సకల కళా వేదిక నిర్వాహకులు

వరంగల్ కల్చరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తెలుగు ఉపాధ్యాయుడు, గాయకుడు, కవి, కళాకారుడు రయ్యాల శ్రీధరాచార్యులకు జాతీయ పురస్కారం దక్కింది. శ్రీఆర్వాని సకల కళా వేదిక సాహితీ కళాసేవ సంస్థ ఉపాధ్యాయ శ్రేష్ఠ జాతీయ పురస్కారం ప్రకటించడంతో పాటు స్వర్ణ కంకణధారణ చేసింది. కరీంనగర్‌లోని ఫిలించాంబర్‌లో సోమవారం సంక్రాంతిప్రతిభా పురస్కారాలను ప్రదానం చేసింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారిని సన్మానించారు. ఇందులో భాగంగా రయ్యాల శ్రీధరాచార్యులకు జాతీయ పురస్కారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు దూడపాక శ్రీధర్, కవి, విమర్శకులు వైరాగ్యం ప్రభాకర్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

ఆలయ భూముల వివరాలు సేకరిస్తున్నాం

దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కె. నాగసంధ్యారాణి

ఫటాఫట్



వరంగల్ కల్చరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రసిద్ధ దేవాలయాలకు చెందిన భూముల వివరాలు సేకరిస్తున్నామని వరంగల్ జోన్ దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కె.నాగసంధ్యారాణి అన్నారు. ఇటీవల బాధ్యత స్వీకరించిన ఆమె మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి : ఉమ్మడి జిల్లాలో దేవాలయ భూముల వివరాలు మీ వద్ద ఉన్నాయా?

డిప్యూటీ కమిషనర్ : ఇప్పటివరకు పూర్తిస్థాయిలో లేవు. ప్రస్తుతం సేకరిస్తున్నాం. ఈ విషయంలో త్వరలోనే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తాం.

ఆంధ్రజ్యోతి: ప్రస్తుతం ఆలయాల నిర్వహణ ఎలా ఉంది?

డిప్యూటీ కమిషనర్ : త్వరలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్ని దేవాలయాలను సందర్శిస్తా. అక్కడి పరిస్థితులు తెలుసుకొని తగు నిర్ణయాలు తీసుకుంటా.

ఆంధ్రజ్యోతి: ఉమ్మడి జిల్లాలో జాతర నిర్వహణ ఎలా జరిగింది..?

డిప్యూటీ కమిషనర్ : కొత్తకొండ వీరభద్రస్వామి, ఐనవోలు మల్లన్న, గీసుగొండ లక్ష్మీనర్సింహస్వామి జాతరలు ప్రశాంతంగా ముగిశాయి.

ఆంధ్రజ్యోతి : కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాల నిర్వహణపై సమీక్ష ఎప్పుడు?

డిప్యూటీ కమిషనర్ : ఫిబ్రవరి మాసంలో శ్రీకాళేశ్వరం ముక్తీశ్వరస్వామి ఆలయ కుంభాభిషేకం ప్రసిద్ధ పీఠాధిపతులతో నిర్వహిస్తాం. అనంతరం మే నెలలో సరస్వతి పుష్కరాలపై అధికారులతో సమావేశం నిర్వహిస్తాం.

ఆంధ్రజ్యోతి : మేడారం మినీ జాతర ఏర్పాట్లు ఎలా ఉన్నాయి..?

డిప్యూటీ కమిషనర్: త్వరలో మేడారం జాతరలో అభివృద్ధి పనులను పరిశీలిస్తా. మంత్రుల పర్యటన కూడా ఉంది. తర్వాత తగు చర్యలు తీసుకుంటా.

ఆంధ్రజ్యోతి : కోర్టు కేసులపై శాఖాపరమైన చర్యలేంటి?

డిప్యూటీ కమిషనర్ : దేవాదాయ శాఖకు సంబంధించిన ఆస్తులను తిరిగి పొందేలా చర్యలు చేపడుతాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో పర్యాటక ప్రాంతాల్లో ఏర్పాట్లు ఎలా ఉన్నాయి?

డిప్యూటీ కమిషనర్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో త్వరలో పర్యటించి అభివృద్ధి పనులు పరిశీలిస్తా.

రాజ్యాంగ పరిరక్షణ సదస్సును విజయవంతం చేయాలి

డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్



రాజ్యాంగ పరిరక్షణ సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీబీఎఫ్ నేతలు

వడ్డెపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : హసన్‌పర్తి మండలం ఎర్ర గట్టు గుట్ట కల్యాణ మండపంలో ఈ నెల 25న నిర్వహించే భారత రాజ్యాంగ పరిరక్షణ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ దళిత బహుజనులకు పిలుపునిచ్చారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ పరిరక్షణ రాష్ట్ర సదస్సు కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళిత బహుజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకోసం ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

75 ఏళ్ల భారత రాజ్యాంగ ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహించే ఈ సదస్సులో ముఖ్య అతిథులుగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, ఎమ్మెల్యేలు కేఆర్. నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ హాజరవుతారని డీబీఎఫ్ కార్యకర్తలు, అంబేద్కర్ వాదులు, ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు బొర్ర సంపూర్ణ, మేకల అనిత, చుంచు నరేష్, ప్రజా సంఘాల నాయకులు అజ్మీరా వెంకట్, పుల్యాల మంజుల, రాజు, కిరణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కేదాసి మోహన్‌ను సన్మానిస్తున్న బక్కి వెంకటయ్య

జాతీయ అవార్డు గ్రహీతకు సన్మానం

బాలసముద్రం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు పొందిన ఎమ్మార్పీఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్‌ను హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని తన కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య మంగళవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. సన్మాన కార్యక్రమంలో కమిషన్ మెంబర్ రాంబాబు నాయక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2535	2160
పల్లికాయ (సూక)	6100	5600
పల్లికాయ (పచ్చిది)	4400	4100
కందులు	6850	5560
పెసళ్లు	-	-
పత్తి	7200	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	15300	9000
తేజ ఏసీ	13000	11000
వండర్‌హాట్ ఏసీ	13500	11500
యూఎస్341ఏసీ	13500	12300
యూఎస్ 341 కొత్తది	15100	11500
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	3000


- వరంగల్ వ్యవసాయం

గురు పోరు!

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సమాయత్తం

- ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో ఎన్నికలు
- ఇప్పటికే పోటీ చేసే అభ్యర్థులను ప్రకటిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు





(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై పలు సంఘాలు, రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. మార్చి 29వ తేదీతో వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పదవీకాలం పూర్తికానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఎన్నికల సంఘం ఓటరు నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేసింది. ఫిబ్రవరి మూడో లేదా చివరి వారంలో నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది. దీంతో ఇప్పటి నుంచే ఆయా ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను బరిలో నిలిపేందుకు కసరత్తు చేస్తున్నాయి. కొన్ని ఉపాధ్యాయ సంఘాలతో పాటు బీజేపీ.. తమ అభ్యర్థులను ప్రకటించి ఎన్నికల ప్రచారాన్ని కూడా మొదలు పెట్టాయి. అయితే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌ల వైఖరి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. పార్టీ తరపున అభ్యర్థులను బరిలో దింపుతారా? లేక ఏదైనా ఉపాధ్యాయ సంఘానికి మద్దతు ఇస్తారా? అనేది ఉత్కంఠగా మారింది.

మార్చిలో పోలింగ్

వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీకాలం మార్చి29వ తేదీతో పూర్తికానుంది. దీంతో ఎన్నికల సంఘం టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికకు కావాల్సిన ఏర్పాట్లను చేపట్టింది. గత అక్టోబరు నెల నుంచి ఉపాధ్యాయ ఓటరు నమోదును చేపట్టింది. డిసెంబరు 31న తుది ఓటరు జాబితాను ప్రకటించింది. మొత్తం 24,905 మంది ఓటర్లుగా తమ పేరును నమోదు చేసుకున్నారు. వీరిలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 10,960మంది ఓటర్లు, ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి 8,041మంది ఓటర్లు, ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 5,904మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 24,905మందిలో 14,940మంది పురుషులు, 9,965మంది మహిళ ఓటర్లు ఉన్నారు. 2019 మార్చిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో 20,888మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. ఈసారి అదనంగా 4,017మంది ఓటర్లు అదనంగా నమోదయ్యారు. అలాగే 2019లో 181 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఈసారి 200పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అదనంగా 19 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 76 పోలింగ్ కేంద్రాలు, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 77 పీసీలు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 47 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే ఈ తుది ఓటరు జాబితా ఆధారంగా ఫిబ్రవరి మూడో లేదా చివరివారంలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి, మార్చి రెండో వారంలో ఎమ్మెల్సీ ఎన్నికలను నిర్వహించనున్నారు. అయితే మొత్తం 55 ఉపాధ్యాయ సంఘాలు ఉండగా, ప్రధానంగా ఎన్నిక బరిలో నాలుగైదు సంఘాలే పాల్గొంటున్నాయి.

పార్టీలకు సవాల్‌గా టీచర్ ఎమ్మెల్సీ

వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలే అయినప్పటికీ వీటిలో ఆయా రాజకీయ పార్టీలే కీలక పాత్ర పోషిస్తున్నాయి. టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీజేపీ ఏకంగా సరోత్తమ్‌రెడ్డి పేరును ప్రకటించింది. గత 2019 ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి పూల రవీందర్‌కు బీఆర్ఎస్ మద్దతు ప్రకటిం చింది. యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డికి సీపీఎం, ఇతర వామపక్షాలు అండగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం కూడా నర్సిరెడ్డికి వామపక్షాలు బాసటగా నిలుస్తుండగా, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు మద్దతు ఎవరికి అనేది ఉత్కంఠగా మారింది. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి బీఆర్ఎస్ సుముఖత వ్యక్తం చేయటం లేదు. అయితే టీచర్ జాక్ పేరుతో బరిలో దిగుతున్న మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌కు బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందా? లేక ఇండిపెండెంట్‌గా బరిలో దిగనున్న వరంగల్ కూడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్‌కు మద్దతు ఇస్తుందా? అనేది ఆసక్తికరంగా మారింది. వరంగల్, నల్లగొండ ఖమ్మం ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌కు ఉపాధ్యాయుల్లో మద్దతుదారులు ఉన్నారు. దీంతో బీఆర్ఎస్ మద్దతు ఎవరికి అనేది ఆసక్తికరంగా మారింది. ఇక అధికార కాంగ్రెస్ పార్టీ సైతం టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని నిలపెట్టడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గత రెండు ఎన్నికల్లో కాంగ్రెస్ ఎవరికి మద్దతు ఇవ్వలేదు, అభ్యర్థిని కూడా బరిలో దించలేదు. శాసనమండలిలో ఎమ్మెల్సీ సంఖ్య అవసరం కావటంతో కచ్చితంగా పోటీ చేయడమా? లేక ఏదైనా ఉపాధ్యాయ సంఘానికి మద్దతుగా నిలవటమో కాంగ్రెస్ చేస్తుందనే చర్చ జరుగుతోంది. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ సైతం కాంగ్రెస్ మద్దతు కోసం ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. దీంతో కాంగ్రెస్ తీసుకునే నిర్ణయమే ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రభావం చూపించే అవకాశం ఉంది. మొత్తానికి టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలైనప్పటికీ రాజకీయ రంగు పడటం ఖాయంగా కనిపిస్తోంది.

12 జిల్లాలోని ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు..

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు
వరంగల్	13	2,225
హనుమకొండ	15	5,098
మహబూబాబాద్	16	1,618
జనగామ	12	921
భూపాలపల్లి	07	323
ములుగు	09	612
సిద్ధిపేట	04	163
నల్లగొండ	37	4,483
సూర్యాపేట	23	2,637
యాదాద్రి భువనగిరి	17	921
ఖమ్మం	24	3,955
భద్రాద్రి కొత్తగూడెం	23	1,949
మొత్తం	200	24,905

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తలపడేందుకు ఉపాధ్యాయ సంఘాలు సన్నద్ధం అవుతున్నాయి. తెలంగాణలో 55కుపైగా ఉపాధ్యాయ సంఘాలు ఉన్నప్పటికీ ప్రధానంగా టీజీ యూటీఎఫ్, పీఆర్‌టీయూ, తపస్ మధ్యే ప్రధానంగా పోటీ నెలకొంది. 2019 మార్చిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి పూల రవీందర్‌పై టీజీ యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి విజయం సాధించారు. ఈసారి పక్కాగా ఎమ్మెల్సీ సీటు దక్కించుకోవాలని మూడు ప్రధాన సంఘాలతో పాటు టీజీ జాక్, స్వతంత్ర అభ్యర్థులు సైతం పోటీ పడుతున్నారు. ఇప్పటికే టీజీ యూటీఎఫ్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మరోసారి బరిలో దిగనున్నట్లు ఆ సంఘం ప్రకటించింది. అలాగే పీఆర్‌టీయూ నుంచి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి బరిలో దిగుతున్నారు. ఇక బీజేపీ నుంచి మాజీ పీఆర్‌టీయూ నేత సరోత్తంరెడ్డి పోటీకి దిగుతున్నారు. తపస్ మద్దతుతో బీజేపీ అభ్యర్థి బరిలో దిగుతుండటం, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ టీచర్స్ జాక్ పేరుతో పోటీకి సై అంటుండటంతో పోటీ ఆసక్తికరంగా మారింది.

తేల్చుకుందాం రా..

అయితే వీరితో పాటు విద్యాసంస్థల అధినేత, మాజీ కూడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్‌తో పాటు మరో సంఘం నుంచి హర్షవర్ధన్‌రెడ్డి, సీపీఎస్ సంఘం నుంచి వెంకటస్వామి లాంటి నేతలు బరిలో ఉంటున్నట్లు ప్రకటించారు. వీరితో పాటు డజను మందికిపైగా ఇండిపెండెంట్‌లుగా పోటీ చేసేందకు ముందకు వస్తుడటంతో ఎమ్మెల్సీ ఎన్నికలు రసవత్తరంగా మారుతున్నాయి. అయితే ఈ ఎన్నికలను పీఆర్‌టీయూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. 2013లో పీఆర్‌టీయూ నుంచి గెలిచిన పూల రవీందర్.. ఆ తరువాత బీఆర్ఎస్‌లోకి వెళ్లారు. దీంతో అయన కొంత వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. 2019లో పీఆర్‌టీయూ అభ్యర్థిగా పూల రవీందర్ బరిలో దిగారు. బీఆర్ఎస్ మద్దతు ప్రకటించినప్పటికీ టీజీ యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. అయితే పీఆర్‌టీయూ రెబల్ అభ్యర్థిగా సరోత్తమ్‌రెడ్డి బరిలో ఉండటంతో పూల రవీందర్‌కు దెబ్బగా మారింది. దీంతో ఈసారి పక్కాగా ఎమ్మెల్సీ సీటు దక్కించుకోవాలని పీఆర్‌టీయూ, సిట్టింగ్ సీటును నిలపెట్టుకోవాలని యూటీఎఫ్‌లు ప్రత్యేకంగా దృష్టి పెట్టగా, తపస్ సహకారంతో ఎమ్మెల్సీ సీటులో పాగా వేయాలని బీజేపీలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. దీంతో ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాలు తమ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పరిధిలోని ఉపాధ్యాయులను వ్యక్తిగతంగా కలుసుకుంటూ మద్దతు కోరుతున్నారు. తక్కువ ఓట్లు ఉండటంతో గెలుపోటములకు ఒక్క ఓటు కూడా కీలకం కావటంతో అభ్యర్థులు ప్రతీ ఓటరు కలుసుకునేలా ప్రణాళికతో వెళుతున్నారు.

బిజీ జూ

వన విజ్ఞాన్‌కు పెరిగిన సందర్శకుల తాకిడి

- పులులు, బైసన్ల రాకతో కళకళలాడుతున్న పార్కు
- రెండింతలు పెరిగిన ఆదాయం
- త్వరలో సింహం, తెల్లపులి రాక



పార్కుకు వస్తున్న పర్యాటకులు

అడవి దున్న

హనుమకొండ కలెక్టరేట్, జనవరి21(ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్‌లో ఉన్న జూపార్కుకు పర్యాటకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. హనుమకొండ, వరంగల్ నగరాలతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు కుటుంబ సమేతంగా తరలివచ్చి పార్కులో ఉన్న జంతువులను, పక్షులను చూస్తూ సరదాగా గడుపుతున్నారు. కొన్నేళ్ల కిందట పార్కుకు వచ్చిన చిరుతపులిని దూరప్రాంతాల ప్రజలు వచ్చి తిలకించేవారు. అయితే జిల్లా అటవీ శాఖ అధికారులు హైదరాబాద్‌లోని నెహ్రూ జులాజికల్ పార్కు నుంచి ఇటీవల జూపార్కుకు తీసుకువచ్చిన రెండు పెద్ద పులులు, అడవి దున్న, హగ్‌డీర్, బార్కింగ్ డీర్‌లకు సంబంధించిన ఎన్‌క్లోజర్‌లను 10రోజుల కిందట రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురఖ ప్రారంభించిన విషయం తెలిసిందే. దీంతో పార్కుకు కొత్తగా వచ్చిన పెద్ద పులులు, అడవిదున్న, హగ్‌డీర్‌లను చూసేందుకు పర్యాటకులు ఉత్సాహంగా పార్కుకు వచ్చి జంతువులను ఆసక్తిగా చూస్తున్నారు. పర్యాటకుల తాకిడి పెరగడంతో జూపార్కుకు ఆదాయం కూడా రెండింతలు పెరిగింది.

పెద్ద సంఖ్యలో రాక

గతంలో పెద్ద పులులను ప్రజలు టీవీలలో లేదా సెల్ ఫోన్‌లలో మాత్రమే చూసేవారు. పులులను చూడాలనే ఆసక్తి ఉన్న ప్రజలు హైదరాబాద్‌లోని నెహ్రూ జూపార్కుకు వెళ్లి చూసి వచ్చేవారు. అయితే హనుమకొండ జూపార్కుకు రెండు పులుల రావడంతో పులులను చూడాలనుకునేవారికి మంచి అవకాశం వచ్చింది. దీంతో ట్రైసిటీస్‌లోని ప్రజలు పులులను చూసేందుకు జూపార్కు బాట పడుతున్నారు. ముఖ్యంగా ఆదివారం రోజు స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రోజు కావడంతో ఆదివారం పర్యాటకుల తాకిడి మరింత పెరుగుతోంది.

త్వరలో సింహం, తెల్లపులి రాక

త్వరలో జూపార్కుకు సింహంతోపాటు తెల్లపులిని తీసుకువచ్చేందుకు జిల్లా అటవీ శాఖ అధికారులు మంతనాలు జరుపుతున్నారు. ఇవి కూడా పార్కుకు వస్తే పర్యాటకుల తాకిడి మరింత పెరిగి ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంది. ఈ జూపార్కు వరంగల్, కాజీపేట, హనుమకొండ ప్రజలకు మధ్యలో ఉండి అందుబాటులో ఉండటంతో ఈ ప్రాంతాల ప్రజలు ఎక్కువగా పార్కుకు వస్తున్నారు.

ఆదాయం డబుల్

గతంతో పోలిస్తే జూపార్కుకు వచ్చే ఆదాయం ప్రస్తుతం రెట్టింపైంది. గతంలో నెలకు రూ.10వేల నుంచి 12వేలు వచ్చేదని, పులులు, ఇతర జంతువులు వచ్చినప్పటి నుంచి ఆదాయం నెలకు రూ.20వేల నుంచి 25వేలు వస్తోందని జిల్లా అటవీ శాఖ అధికారులు తెలిపారు. పర్యాటకుల తాకిడి ఆదివారం ఎక్కువగా ఉంటోందని చెబుతున్నారు.


పులుల రాకతో పెరిగిన పర్యాటకులు

ఇటీవల జూపార్కుకు రెండు పులులు, అడవిదున్నతోపాటు మరిన్ని కొత్త జంతువులు వచ్చాయి. దీంతో ఈ కొత్త జంతువులను చూసేందుకు ప్రజలు జూపార్కుకు తరలివస్తున్నారు. ఆదాయం కూడా గతంతో పోలిస్తే ఇప్పుడు మరింత పెరిగింది. హనుమకొండ వరంగల్, కాజీపేట ప్రాంతాల నుంచి ఎక్కువగా పర్యాటకులు కుటుంబంతో కలిసి జంతువులను చూసేందుకు పార్కుకు వస్తున్నారు.

\- జూపార్కు బీట్ ఆఫీసర్ శారద

చిత్రకళాద్రష్ట కొండపల్లి

- కుంచెతో చరిత్ర చిత్రిక
- భారతీయ సంప్రదాయ చిత్రకళకు వన్నెలు
- పోతనకు మొదటి సారి చిత్రరూపం
- తెలుగు తల్లి ఆవిష్కరణ
- నేడు ప్రముఖ చిత్రకళాకారుడు కొండపల్లి శేషగిరిరావు జయంతి



వరూధిని ప్రవరాఖ్యుడు



కొండపల్లి శేషగిరిరావు

హనుమకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కదిలే ఊహలకు రేఖాకృతి కలిగిస్తే అది చిత్రలేఖనం. చిత్రాన్ని రచించడం ఒక మధుర సాధన. చిత్రాన్ని చూసి ఆనందించడం మధురతర సాధన. ఈ రెండింటిలోనూ శిఖరాగ్రస్థాయికి చేరిన మనీషి కొండపల్లి శేషగిరి రావు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన చిత్రకారుల్లో లబ్ధప్రతిష్టుడు ఆయన.. ఈ నెల 22న శేషగిరిరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రకళా ప్రతిభపై కథనం.

మానుకోట వాసి

తెలుగు చిత్రకళా ప్రపంచంలో ఓ వటవృక్షం అయిన కొండపల్లి శేషగిరిరావు 1924లో మహబూబాబాద్ జిల్లా పెనుగొండలో జన్మించారు. ఒక బ్రాహ్మణ భూస్వామ్యకుటుంబంలో జన్మించిన శేషగిరిరావు తండ్రి గోపాలరావు. తల్లి రామచూడామణి. శేషగిరిరావులోని సృజనాత్మకతను గుర్తించిన పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ దీనదయాళ్.. ఆనాడే కొండపల్లి గొప్ప కళాకారుడు అవుతాడని ప్రకటించారు. 1947లో ఆర్ట్ డిప్లొమా పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. బెంగాల్ శాంతినికేతన్‌లో చిత్రలేఖనం అభ్యసించారు. ఆచార్య నందలాల్ బోసు శిష్యరికంలో చిత్రకళలో అనేక మెళకువలు నేర్చుకున్నారు. 1950 నుంచి 1984 వరకు హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో ఉపాధ్యాయుడిగా పని చేశారు. బాల్యంలో ఆయన చుట్టూ ఉన్న కళా సంపద కళాభిమానాన్ని తట్టిలేపింది. వేయిస్తంభాల గుడిలోని ప్రతీ స్తంభం ఆయనకు రోజుకో పాఠం చెప్పింది. రామప్పగుడిలోని శిల్పకళా సౌందర్యం హృదయాంతరాలల్లో నిండిపోయింది. కాకతీయుల దేవాలయాల్లోని శిల్పాల సోయగంపై సునిశిత అధ్యయనం చేసిన కొండపల్లి.. వాటి నుంచి పొందిన స్ఫూర్తితో కొన్ని వందల చిత్రాలను గీశారు. శిల్పుల మనోగతాల్ని, వారి అభిరుచిలో తొంగిచూసిన ప్రత్యేకతలను, విశిష్టతలను తాను అవగతం చేసుకోవడమే కాక తన చిత్రాల ద్వారా ప్రజాబాహుళ్యానికి చాటిచెప్పే ప్రయత్నం చేశారు. భారతీయ ఇతిహాసాలను చిత్రిక పట్టడంలో శేషగిరిరావుది అందెవేసిన చేయి. ప్రకృతి, చారిత్రక గాథలను ముఖ్యంగా కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలాన్ని ఆయన సజీవ చిత్రాలుగా మలిచారు. ఆక్వాటెక్చర్ పెయింటింగ్‌లకు ఆయన మార్గదర్శకుడిగా చెబుతారు. లండన్, అమెరికా, మాస్కో తదితర దేశాల్లో జరిగిన ఎగ్జిబిషన్లలో ప్రదర్శనకు ఉంచిన శేషగిరిరావు చిత్రాలకు అనేక ప్రశంసలు వచ్చాయి. సాలార్‌జంగ్ మ్యూజియం సహా వాషింగ్టన్ డీసీలోని భారత రాయబార కార్యాలయం, పిట్స్‌బర్గ్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఆయన చిత్రాలు మరింత శోభను తీసుకువచ్చాయి.

పోతనకు రూపం

40 ఏళ్ల కిందట వరంగల్‌లో పోతన పంచశతి ఉత్సవాలు జరిగినప్పుడు పోతన చిత్రానికి మొట్టమొదటి సారిగా రూపం ఇచ్చింది శేషగిరిరావు. అంత అందం, అంత ప్రశాంతత, అంత భక్తిభావం ఆ చిత్రంలో ఆయన ఒలికించారు. పోతన భాగవతాన్ని 16సార్లు చదివి తన మనోఫలకంపై ముద్రించుకున్నందు వల్లనే పోతన చిత్రంలో అంత జీవం వచ్చినట్టు చెబుతారు. శేషగిరిరావు కొన్ని వేల చిత్రాలను గీశారు. రాణి రుద్రమ దేవి, గణపతి దేవుడు, పల్నాటి బ్రహ్మనాయుడు లాంటి చారిత్రక వ్యక్తులు, శకుంతల, వరూధినీ ప్రవరాఖ్యుడు, దమయంతి వంటి ఇతిహాస వ్యక్తుల చిత్రాలు ఆయన కుంచె నుంచి జాలువారాయి. కాకి పడగలు పట చిత్రాలను వెలుగులోకి తెచ్చారు. తొలి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా కొండపల్లి తెలుగు తల్లిని సాక్షాత్కరింప చేశారు. తెలుగు చిత్రకళను అంతర్జాతీయ వేదికపై సగౌరవంగా నిలబెట్టిన కొద్దిమందిలో శేషగిరారావు ఒకరు.

అవార్డులు

శేషగిరిరావు చిత్రకళా ప్రతిభను గుర్తించిన అనేక సంస్థలు ఆయనను సముచితంగా సత్కరించాయి. అవార్డులను ప్రదానం చేశాయి. హైదరాబాద్, మైసూరు, మద్రాసు, అలిండియా ఆర్ట్ ఎగ్జిబిషన్, కోల్‌కతా అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఏపీ లలిత కళా అకాడమీ అవార్డులను ప్రదానం చేశాయి. కేంద్ర మానవ వనరుల శాఖ పక్షాన 1988లో ఎమిరేటస్ ఫెలోషిప్‌ను, తెలుగు యూనివర్సిటీ ద్వారా డాక్టరేట్‌ను ఆయన అందుకున్నారు. ప్రతిష్ఠాత్మకమైన హంస అవార్డును కూడా ఆయన పొందారు. చిత్రకారుడిగా కొండపల్లి శేషగిరిరావు తను అనుభవాలను, చిత్ర రచనా పద్ధతులను వివరిస్తూ రాసిన వ్యాసాలను కొండపల్లి నీహారిణి సంపాదకత్వంలో చిత్రకళా రామనీయకం పేరుతో 2011లో ప్రచురితమైంది.

- 500 ఏళ్ల చరిత్ర కలిగిన మాషూక్ రబ్బానీ దర్గా
- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

దర్గా దర్శనం.. ముక్తి మార్గం..



విద్యుత్ దీపాల వెలుగుల్లో ఉర్సు దర్గా



మాషూక్ రబ్బానీ కుమారుడైన గౌస్ మొయినోద్దీన్ ఖాద్రీ పవిత్ర సమాధి దర్గా

కరీమాబాద్, జనవరి 21, (ఆంధ్రజ్యోతి):వరంగల్ అండర్ రైల్వే గేటు ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన హజ్రత్ మాషూఖ్ రబ్బాని దర్గాకు 500 వందల ఏళ్ల చరిత్ర ఉంది. ఎలాంటి సమస్యలున్నా ఈ దర్గాను ఒక్కసారి దర్శించుకుంటే చాలు.. సకల సమస్యలు దూరమవుతాయని ప్రజల నమ్మకం. ఏటా ఇక్కడ జరిగే ఉత్సవాలకు దేశవిదేశాల నుంచి లక్షలాది మంది తరలివస్తారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల వారు ఈ దర్గాను దర్శించుకోవడం విశేషం. బుధవారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు ఇక్కడ అట్టహాసంగా వేడుకలు జరిపేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

మాషూఖ్ రబ్బానీ, దర్గా చరిత్ర

ఇరాక్ దేశం బాగ్దాద్ ప్రాంతం నుంచి భారతదేశానికి వచ్చిన ఔళియా (అవదూత)లల్లో మాషూఖ్ రబ్బానీ హహమతుల్లాలై ఒకరు. ఈయన అసలు పేరు సయ్యదనా జలాల్ ఉద్దీన్ జమాల్ అల్ బహర్. 12 ఏళ్ల చిరు ప్రాయంలోనే ఆయన తల్లి శిక్షణలో ఖురాన్ కంఠస్థం చేశారు. ప్రజలకు ధార్మిక సిద్ధాంతాలను తెలియజేసే పర్యటనలో భాగంగా ఆయన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం తురుకల సోమారం గ్రామ గుట్టల్లో విడిది చేశారు. ఆ ప్రాంత వాసులను రకరకాల రుగ్మతలను నయంచేశారు. అంధులకు దృష్టిని ప్రసాదించి తన మహిమను చూపారు. అనంతరం అక్కడి నుంచి ఉర్సు ప్రాంతానికి వచ్చారు. ఉర్సు ప్రాంతంలోని గుట్టల్లో 12 ఏళ్ల పాటు దైవారాధన చేస్తూ ప్రజలను ఎన్నో రుగ్మతల నుంచి విముక్తుల్ని చేస్తూ తన 81వ యేట పరమపదించారు. ఆయనను సమాధి చేసిన ప్రాంతమే ఈ ఉర్సు దర్గా.

వైభవంగా ఉర్సు (సంధల్) ఉత్సవాలు

ఉర్సు (సంధల్) ఉత్సవాలు ఈ నెల 22, 23, 24 తేదీల్లో మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. బుధవారం రాత్రి మాషూఖ్ రబ్బానీ పవిత్ర సమాధికి సంధల్ కార్యక్రమం (గంధలేపనం) నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు సయ్యద్‌షా హైదర్ హిలాలోద్దిన్ ఖాద్రీ నవీద్ బాబా ఇంటి నుంచి గంధాన్ని దర్గాకు తీసుకువెళ్తారు. ఈ సందర్భంగా ఫకీర్లు చేసే విన్యాసాలు ఒళ్లు గుగుర్పొడిచే విధంగా ఉంటాయి. 23వ తేదీన ఉత్సవాలు, 24న ప్రత్యేక ప్రార్థనలతో ఉత్సవాలు ముగుస్తాయి.

వివిధ ప్రాంతాల నుంచి సందర్శకుల రాక

దర్గా ఉత్సావాలకు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో మత గురువులు, భక్తులు, సందర్శకులు వస్తుంటారు. వారికి మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రబ్బానీ వారసులు, పీఠాధిపతులు సయ్యద్ షా హైదర్ హిలాలోద్దిన్ ఖాద్రీ నవీద్ బాబా, ఉబేద్ బాబాల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు.

దర్గా ప్రాంతంలో విశాలమైన మజీద్

దర్గా పరిసరాలల్లో ముస్లింలు ప్రార్థన చేసుకునేందుకు విశాలమైన మజీద్ అన్ని హంగులతో సిద్ధమైంది.ఒకేసారి దాదాపు 1500 మంది ప్రార్థన చేసుకునే అవకాశం ఈ దర్గాలో ఉంది. ప్రతీ శుక్రవారం వేల సంఖ్యలో ముస్లింలు ఈ మజీద్‌లో ప్రార్థన చేస్తారు.



ఉత్సవాలను విజయవంతం చేయండి..

అత్యంత అట్టహాసంగా బుధవారం నుంచి ప్రారంభమయ్యే మాషూక్ రబ్బానీ దర్గా ఉత్సవాలను విజయవంతం చేయాలి. దేశం నలు మూలల నుంచి వస్తున్న భక్తుల కోసం దర్గా పరిసర ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు చేశాం. పారిశుధ్య చర్యలు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యం, భోజనాలు, విడిది తదితర సౌకర్యాలు కల్పించాం. జిల్లా యంత్రాంగం కూడా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తోంది.

\- పీఠాధిపతులు ఖాద్రీనవీద్ బాబా, ఉబేద్ బాబా



హెడ్మాస్టర్ల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కడియం శ్రీహరి

హెచ్‌ఎంల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆవిష్కరించారు. మంగళవారం హనుమకొండలోని ఆయన నివాసంలో సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అలాగే కలెక్టర్ కార్యాలయంలో సత్యశారద చేతుల మీదుగా డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్. రవీందర్, ఎల్. సుధాకర్‌రావు, బి.మహేష్‌నాయక్, హెచ్‌ఎంలు పట్టాభి, సదాశివరావు, పరమేశ్వర్, ప్రద్యుమ్న తదితరులు పాల్గొన్నారు.



క్రేటా ఎలక్ట్రిక్ కారును విడుదల చేస్తున్న ఎస్‌బీఐ ఏజీఎం రాజశేఖర్, షోరూం డైరెక్టర్ పృథ్వీ, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ శ్రీధర్

క్రేటా ఎలక్ట్రిక్ కారు మార్కెట్‌లోకి విడుదల

హనుమకొండ టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని ములుగురోడ్ వద్ద గల హేమ హ్యుండాయ్ కారు షోరూంలో ఎస్‌బీఐ బ్రాంచ్ ఏజీఎం రాజశేఖర్, షోరూం డైరెక్టర్ పృథ్వీ, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ శ్రీధర్ చేతుల మీదుగా మంగళవారం క్రేటా ఎలక్ట్రిక్ కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా షోరూం డైరెక్టర్ పృథ్వీ మాట్లాడుతూ.. ఈ కారులో అధునాతన ఫీచర్లతో కూడిన సరికొత్త అల్టీమేట్ బ్యాటరీ ఏర్పాటు చేశారన్నారు. ఒక్కసారి చార్జింగ్ చేస్తే 473 కిలోమీటర్లు ప్రయాణించగలదని తెలిపారు. బ్యాటరీ 10శాతం నుంచి 80శాతం 58 నిమిషాలలో (50కేడబ్ల్యూ), 39 నిమిషాలలో (100కేడబ్ల్యూ) డీసీ చార్జింగ్ అవుతుందని చెప్పారు.

కేవలం 7.9 సెకన్లలో సున్నా నుంచి 100 కిలోమీటర్ల వేగానికి చేరుకుంటుందని అన్నారు. వీ టూ ఎల్ (వెహికిల్ టూ లోడ్) ఫీచర్ బ్యాటరీతో పాటు సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు చార్జింగ్ చేయవచ్చని పేర్కొన్నారు. 42 కేడబ్ల్యూహెచ్, 51.4 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్‌లలో విడుదల చేస్తున్నారని చెప్పారు. ఈ కారు రూ.17.99లక్షల నుంచి రూ.24.37 లక్షల ధరలో లభ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆదిత్య, ఏజీఎం మహేష్‌తో పాటు షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్టా ఆంగ్ల ఒలింపియాడ్ పోటీలు



విజేతలైన విద్యార్థులతో ఒలింపియాడ్ నిర్వాహకులు

హనుమకొండ కల్చరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎల్టా ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఆంగ్ల ఒలింపియాడ్‌ను, ఉపన్యాస పోటీలను మంగళవారం ములుగు రోడ్డులోని లాల్‌బహదూర్ కాలేజీలో నిర్వహించారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్, తెలంగాణ ఎస్సీఆర్టీ భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో జిల్లాలోని అన్ని మండలాల నుంచి జడ్పీ ప్రభుత్వ, కేజీబీవీ, మోడల్ స్కూళ్లకు చెందిన 8, 9 తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్బీ కాలేజీ ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్ రావు, జిల్లా డీసీఈబీ సెక్రెటరీ క్రిష్ణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల ఆంగ్ల ప్రావీణ్యతను పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. గెలుపొందిన విద్యార్థులకు అబ్దుల్ కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు దేవునూరి ఆనంద్ ద్వారా డిక్షనరీలను బహుమతులుగా అందచేశారు. కార్యక్రమంలో ఎల్టా రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకటేశ్వర రావు, అసోసియేట్ అధ్యక్షుడు పూల శ్రీనివాస్, ఎల్టా వరంగల్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎల్ వంశీమోహన్, వివిధ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు టీఎస్ సీపీఎస్‌యూ జిల్లా విస్తృతస్థాయి సమావేశం

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కలెక్టరేట్‌లోని టీజీఓ భవన్‌లో బుధవారం సాయంత్రం సీపీఎస్ ఉద్యోగుల జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్ హాజరు కానున్నారని తెలిపారు. సమావేశం అనంతరం సంక్రాంతికి ఉపాధ్యాయులకు నిర్వహించిన పోటీల్లో విజేతలను ప్రకటించి బహుమతులను ప్రదానం చేయనున్నామని, జిల్లావ్యాప్తంగా ఉన్న సీపీఎస్‌యూ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని జీవన్‌కుమార్ ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మడికొండ ఎస్సై రాజ్‌కుమార్

మడికొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని మడికొండ ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. గ్రేటర్ వరంగల్ 45వ డివిజన్ తరాలపల్లిలోని జడ్పీ పాఠశాలలో పోలీసులు మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ క్రైం, 100 డయల్, సాంఘిక దురాచారాలు, సిటిజన్ ఫీడ్ బ్యాక్, క్యూ ఆర్ కోడ్ వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అరుణ, ఉపాధ్యాయులు ఆర్ శ్రీనివాస్, టి. అనిల్‌కుమార్, ఎస్. విజయ్‌భాస్కర్, శ్రీగుణ, కౌసరున్నీసా బేగం, హెడ్ కానిస్టేబుల్, రామనాథం, కానిస్టేబుల్ వాసు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజ్‌కుమార్

అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తాం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

కాజీపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ రేషన్ కార్డుతో పాటు ఇతర పథకాలు అందిస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట 47వ డివిజన్ ఇంపీరియల్ కాలనీ, 61వ డివిజన్ సిద్ధార్థనగర్‌లో మంగళవారం అధికారులతో కలిసి ఎమ్మెల్యే వార్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం జనవరి 26 నుంచి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం సేకరించిన వివరాల ఆధారంగా రేషన్ కార్డులేని నిరుపేదలను గుర్తించి కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేస్తామన్నారు. గతంలో దరఖాస్తులు చేసుకోకున్నా ఇప్పుడు కూడా దరఖాస్తులు చేసుకుంటే కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. దరఖాస్తుదారులు ప్రజాపాలన కేంద్రంలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్‌లు విజయశ్రీ రజాలీ, జక్కుల రవీందర్ యాదవ్, నాయకులు ఎండీ అంకూస్, గొట్టిముక్కుల రమాకాంత్ రెడ్డి, తక్కళపల్లి సాగరిక, షైసారపు సిరిల్ లారెన్స్, షేక్ అజ్గర్, గాదెపాక రమేశ్‌తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామ సభలు ప్రారంభం

హసన్‌పర్తి (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంచాయతీ గ్రామాల్లో మొదటి రోజు మంగళవారం నాలుగు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించినట్లు ఎఫ్ఏసీ ఎంపీడీవో కర్ణాకర్ రెడ్డి తెలిపారు. పంచాయతీ గ్రామాలలో నిర్వహించ తలపెట్టిన గ్రామ సభల షెడ్యూల్ వివరాలిలా ఉన్నాయి.

మొదటి రోజు మంగళవారం అనంతసాగర్, అర్వపల్లి, నాగారం, సీతంపేట గ్రామాలలో స్పెషలాఫీసర్లు ఎ.అనురాధ, టి.జయశ్రీ, కె. కర్ణాకర్‌రెడ్డి, చల్ల ప్రసాద్‌ల ఆధ్వర్యంలో జరిగాయి. రెండో రోజు బుధవారం బైరాన్‌పల్లి, జయగిరి, మల్లారెడ్డిపల్లి, పెంబర్తి గ్రామాల్లో ఉదయం 10 గంటలకు కొత్తపల్లిలో మధ్యాహ్నం 1 గంటకు ఆయా గ్రామాల స్పెషలాఫీసర్లు ఈసరి రవిందర్, వెంకటేశ్వర్లు, కె.కర్ణాకర్‌రెడ్డి (కొత్తపల్లి, మల్లారెడ్డిపల్లి), ఎన్. శ్రీనివాస్‌ల పర్యవేక్షణలో గ్రామ సభలు ప్రారంభమవుతుందని తెలిపారు. అలాగే మూడోరోజు గురువారం సిద్ధాపూర్, సూదన్‌పల్లి గ్రామాలలో ఉదయం 10 గంటలకు ఆయా గ్రామాల స్పెషలాఫీసర్లు ఎన్.సుధ, ఎం.డి.రహీం, అనిల్‌ల పర్యవేక్షణలో కొనసాగుతుంది.

అలాగే నాలుగో రోజు శుక్రవారం గుంటూరుపల్లిలో ఉదయం 9 గంటలకు స్పెషలాఫీసర్ కె. కర్ణాకర్‌రెడ్డి, హెచ్‌సీఎన్ తండాలో మధ్యాహ్నం 2 గంటలకు స్పెషలాఫీసర్ వి.అర్చన, సీతానాగారంలో ఉదయం 10 గంటలకు స్పెషలాఫీసర్ డి.కిశోర్ పర్యవేక్షణలో కొనసాగుతుందని ఎఫ్ఏసీ ఎంపీడీవో కె.కర్ణాకర్‌రెడ్డి తెలిపారు.

షెడ్యూల్ ప్రకారమే వార్డు సభలు

బల్దియా అసిస్టెంట్ కమిషనర్ జోనా

వరంగల్ కార్పొరేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జరుపుతున్న వార్డు సభల నిర్వహణ షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని బల్దియా అసిస్టెంట్ కమిషనర్ జోనా మంగళవారం తెలిపారు. తొలిరోజు నిర్వహించిన కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, బుధవారం కూడా ఎంపిక చేసిన డివిజన్‌లలో వార్డు సభలు జరుగుతాయని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఆయా డివిజన్‌లలో వార్డు సభలు జరుగుతాయని వెల్లడించారు. ఇప్పటికే వార్డుల వారిగా అధికారులను కేటాయించామని, అధికారులు క్రమశిక్షణతో వార్డు సభలలో విధులు నిర్వహించాలని అన్నారు. బుధవారం ఉదయం కాశిబుగ్గ సర్కిల్ పరిధిలో 13, 20,23, 26, 32, 34, 38 తో పాటు 41వ డివిజన్‌లో వార్డు సభలు జరుగుతాయని తెలిపారు. వర్ధన్నపేట పరిధిలో 45, 56 ఇంకా కాజీపేట సర్కిల్ పరిధిలో 4,17,30, 39,53,63 డివిజన్‌లలో జరుగుతాయని జోనా తెలిపారు.

5వ డివిజన్ వార్డు సభ వాయిదా

గ్రేటర్ వరంగల్ నగరంలోని 5వ డివిజన్‌లో బుధవారం జరగాల్సిన వార్డు సభ అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు అదనపు కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం జరగాల్సిన వార్డు సభ ఈ నెల 23న నిర్వహించనున్నట్టు డీసీ వెల్లడించారు. ప్రజలు గుర్తించి ప్రకటించిన తేదీన హాజరు కావాలని సూచించారు.

వార్డు సభల దరఖాస్తుల వివరాలు ఇలా..

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో తొలి రోజు మంగళవారం జరిగిన వార్డు సభలలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను బల్దియా అధికారులు వెల్లడించారు. ఆయా సభలకు బల్దియా అధికారులు హాజరై ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా దరఖాస్తులు స్వీకరించారు. బల్దియా పరిధిలో 20 కేంద్రాలలో వార్డు సభలు నిర్వహించగా, 5,908 కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు రాగా, 2,687 ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. కాగా, రెండో రోజు బుధవారం జరిగే వార్డు సభల షెడ్యూల్‌ను అధికారులు వెల్లడించారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉపాధ్యాయులు

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఉపాధ్యాయ దంపతులు క్షీరాభిషేకం చేశారు. స్పౌజ్ బదిలీలను చేపట్టి భార్యాభర్తలను ఒకే దగ్గర విధులు నిర్వర్తించేలా చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో స్పౌజ్ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ కందకట్ల సురేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దంపతులు సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ తప్పిదంతో జీవో నెంబరు 317తో విడిపోయి ఇబ్బందులకు గురవుతున్న భార్యాభర్తలైన ఉద్యోగులను ఒకే చోట విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, శ్రీహరి, శ్రీపాల్, సుధారెడ్డి, వేణు, రాజు, రాధిక, గౌసియా, కల్పన, మంజుల, శశికళ, ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

లెనిన్‌కు ఘన నివాళి



లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ విప్లవ కమ్యూనిస్టు నేత లెనిన్ వర్ధంతి మంగళవారం హనుమ కొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కర్రె భిక్షపతి మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టు పార్టీని విస్తరించడం కోసం నిరంతరం అధ్యయనం చేసి ప్రజాపోరాటాలే దిక్కు అని చెప్పిన లెనిన్ ఆశయసాధనకు కమ్యూనిస్టు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు భిక్షపతి, కరుణాకర్, ఎల్లేష్, శ్రీనివాస్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో..

మడికొండ (ఆంధ్రజ్యోతి): మడికొండలోని రావినారాయణరెడ్డి కాలనీలో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం లెనిన్ వర్ధంతిని జరుపుకున్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ముఖ్య అతిథిగా పాల్గొని లెనిన్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయకార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు మాలోత్ శంకర్‌నాయక్, రాసమల్ల దీన, పద్మ, సత్యలక్ష్మి, కమల, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సంఘ సభ్యుల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న సంజీవ

జూలైవాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సంఘంలోని సభ్యుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా, కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ వారికి అండగా నిలుస్తున్నట్లు త్రిచక్ర పొదుపు సంఘం అధ్యక్షుడు ఇసంపెల్లి సంజీవ అన్నారు. మంగళవారం రెవెన్యూ కాలనీలో త్రిచక్ర పొదుపు, పరపతి సహాయ సహకార సంఘం నాల్గవ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇసంపెల్లి సంజీవ మాట్లాడుతూ.. 2020లో మొదలైన సంఘం అంచలంచెలుగా ఎదుగుతూ నేడు రూ.3కోట్ల 39లక్షల టర్నోవర్‌తో కొనసాగుతుండటం క్రమశిక్షణకు, అంకితభావానికి నిదర్శనమన్నారు. త్రిచక్ర సొసైటీ గౌరవ అధ్యక్షుడు వినయ్‌భాస్కర్ సహకారం, ఆటో కార్మికుల పట్ల వారికి ఉన్న ప్రేమాభిమానాలే ఈ స్థాయికి తీసుకొచ్చాయని తెలిపారు. ఇక ముందు కూడా ప్రతీ సభ్యుడు ఇదే విధంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో త్రిచక్ర పొదుపు సంఘం ప్రధాన కార్యదర్శి మంద శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి చీకటి కుమార్, డైరెక్టర్స్ మడికొండ బాబు, కలకోట్ల జయరాం, జిలకర స్వామి, పసునూరి బాబు, బొల్లం సంజీవ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాంనగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా హనుమకొండలోని పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రకాశ్‌రెడ్డిపేట, పోస్టల్ కాలనీ, పోలీస్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, విద్యుత్‌నగర్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని కిషన్‌పుర, లష్కర్‌బజార్ ఏరియాలో ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు, నయీంనగర్ ఏరియాలో మాధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు, యాదవనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ తెలిపారు.

హిందీ అభ్యాస దీపిక ఆవిష్కరణ



హిందీ అభ్యాస దీపికను ఆవిష్కరిస్తున్న డీఈవో వాసంతి

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డీసీఈబీ, జిల్లాలోని హిందీ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో రూపొందించిన హిందీ అభ్యాస దీపికను డీఈవో డెడ్రే వాసంతి ఆవిష్కరించారు. మంగళవారం డీఈవో కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో పదో తరగతి వార్షిక పరీక్షల కోసం సిద్ధం అవుతున్న విద్యార్థుల కోసం రూపొందించిన అభ్యాస దీపికను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంవో శ్రీనివాస్, ఎంఈవోలు నెహ్రూ, మనోజ్‌కుమార్, డీసీఈబీ జాయింట్ సెక్రెటరీ ప్రసన్నకుమార్, రామకృష్ణ, గౌస్‌పాషా, లక్ష్మణ్, సుధాకర్, రఫిక బేగం, ఆదినారాయణ, చక్రి పాల్గొన్నారు.

ఎస్సార్‌యూతో రెండు విశ్వవిద్యాలయాలు ఎంవోయూ



ఎంవోయూ పత్రాన్ని చూపిస్తున్న యూనివర్సిటీ ప్రతినిధులు


హసన్‌పర్తి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సార్ విశ్వవిద్యాలయం తెలంగాణలోని తొలి విశ్వవిద్యాలయంగా న్యూజిలాండ్ యూనిఫెస్ట్-2025 ప్రకటించింది.

ఈ క్రమంలోనే ఎస్సార్ విశ్వవిద్యాలయంతో న్యూజిలాండ్ యూనిఫెస్ట్‌లో రెండు విశ్వవిద్యాలయాలతో ఎంవోయూ చేసుకున్నట్లు ఎస్సార్ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ దీపక్‌గార్గ్ తెలిపారు. మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయంలోని ఎస్సార్‌ఐఎక్స్ ఆడిటోరియంలో న్యూజిలాండ్ యూనిఫెస్ట్-2025ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సార్‌యూ వీసీ దీపక్‌గార్గ్ మాట్లాడుతూ ఎస్సార్ విశ్వవిద్యాలయం న్యూజిలాండ్‌లోని రెండు విశ్వవిద్యాలయాలైన ఒటాగో, మాస్సీ విశ్వవిద్యాలయాలతో ఎంఓయూ కుదుర్చుకున్న తెలంగాణలో తొలి విశ్వవిద్యాలయంగా ఎస్సార్ నిలిచిందని తెలిపారు. ఎస్సార్ యూనివర్సిటీ అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు మొదటి రెండేళ్లు క్యాంపస్‌లో పూర్తిచేసి తదుపరి రెండేళ్లు ఒటాగోలో ఫుడ్ సైన్స్ బీఎస్సీని పొందుతారని తెలపారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ వ్యవహారాల, కార్పొరేట్ అవుట్ రీచ్ డైరెక్టర్ ప్రితా చక్రవర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి, వి.మహేష్‌రెడ్డి, ఏవీవీ.సుధాకర్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశభక్తి గీతాల పోటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వల్లంపట్ల ఆర్ట్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు దేశభక్తి గీతాల పోటీలను నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు వల్లంపట్ల నాగేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23, 24న హనుమకొండలోని డైట్ కళాశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ రెండు రోజులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 వరకు జరిగే పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

కిట్స్ విద్యార్థులకు ప్రథమ బహుమతి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి

హసన్‌పర్తి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ హైపర్ మోడ్ నాలెడ్జ్ గ్రాఫ్, ఏఐ చాలెంజ్ హ్యాకథాన్‌లో కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన పావుశెట్టి యశ్వంత్‌కృష్ణ, ఈషా బెల్లాడికి గ్రాండ్ ప్రైజ్ వచ్చినట్లు కిట్స్ ప్రిన్సిపాల్ కె.అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన విద్యార్థి అభినందన సభలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ హైపర్ మోడ్ నాలెడ్జ్ గ్రాఫ్, అర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ చాలెంజ్ ఇంటర్నేషనల్ హ్యాకథాన్‌లో గ్రాండ్ ప్రైజ్‌గా కిట్స్ విద్యార్థులు నగదు రూ.2.7లక్షలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 533 బృందాలు పాల్గొనగా భారత్ నుంచి ఎంపికైన ఏకైక టీంలో ఇద్దరు కిట్స్ విద్యార్థులు కావడంపై కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు కె.రాజనరేందర్ రెడ్డి, వి.శంకర్, యశ్వంత్, ప్రభాకరాచారి, ధృతి, ఎస్. దాస్, రాకేష్‌కుమార్ సాహూ, తల్లిదండ్రులు డాక్టర్ పావుశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వార్డు సభ

వడ్డెపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ జవహర్‌కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో డివిజన్ వార్డు సభ (గ్రామ సభ) బుధవారం ఉదయం 9 గంటలకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు ఆదేశం మేరకు నిర్వహించనున్నట్లు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంకా హరిబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలకు సంబంధించి నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు తమ దరఖాస్తులకు జిరాక్స్ ప్రతులను జతపర్చి అధికారులకు సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.

క్రికెట్ పోటీల్లో తాళ్ల పద్మావతి విద్యార్థుల ప్రతిభ

కాజీపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట సోమిడి తాళ్ల పద్మావతి ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి టీ10 క్రికెట్‌లో ప్రతిభ కనబర్చారు. ఉత్తర్‌ప్రదేశ్ లక్నోలో ఇటీవల జరిగిన పోటీలలో అయాన్‌నాయక్, శివసాయిరెడ్డి విద్యార్థులు ప్రతిభ కనబరిచి తృతీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్ తాళ్ల వంశీ చైతన్య, ఇతర సిబ్బంది విజేతలను బహుమతులు అందించి అభినందించారు.



షీల్డ్ అందుకుంటున్న విద్యార్థులు

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

వరంగల్ మెడికల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న సుమారు 17,541 మంది ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం విడుదల చేసిన పీఆర్‌సీ 7 నెలల ఏరియర్స్‌ను తక్షణమే చెల్లించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలవుతున్నా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం లేదని, వెంటనే కొత్త జీవో విడుదల చేసి వేతనాలు పెంచాలన్నారు. డిస్ట్రిక్ట్ సెలోన్ కమిటీ ద్వారా రిక్రూట్‌మెంట్ అయిన ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సాయం

కాజీపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడిపికొండకు చెందిన ఫొటోగ్రాఫర్ జేరుపోతుల రంజిత్ అనారోగ్యంతో మృతి చెందాడు. వారి కుటుంబానికి మంగళవారం ఫొటో, వీడియో గ్రాఫర్స్ ఉమ్మడి వరంగల్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.1.70 లక్షల చెక్కు అందించారు. కార్యక్రమంలో కాజీపేట డివిజన్ అధ్యక్షుడు టి. జగదీశ్వర్, ఉమ్మడి వరంగల్ జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చెవి రంధ్రాలు సాగితే...

ఫ్యాషన్‌లో భాగంగా మహిళలు రకరకాల చెవి పోగులు, జుంకాలు, హ్యాంగింగ్స్ పెట్టుకుంటూ ఉంటారు. వీటి బరువు వల్ల చెవి రంధ్రాలు క్రమంగా పెద్దవై సాగుతుంటాయి. అలాంటప్పుడు చెవులకు ఆభరణాలు వేలాడకుండా అందంగా అమరేలా కొన్ని చిట్కాలు పాటించవచ్చు.

- బరువైన జుంకాలు, లోహాలతో రూపొందించిన కమ్మలు పెట్టుకునేటపుడు సిలికాన్‌తో తయారు చేసిన ఇయర్ లోబ్ ప్యాడ్స్‌ను ఉపయోగించాలి. ఇవి ఆధారంగా నిలిచి ఆభరణం వేలాడకుండా చెవి తమ్మె మీద పూర్తిగా అమరేలా చేస్తాయి.
- కర్ణాభరణాలకు బ్యాక్ స్టాపర్ స్థానంలో డబుల్ స్టాపర్‌ను ఉపయోగిస్తే జారకుండా నిలబడతాయి.
- చెవి క్లిప్ ఉన్న జుంకాలు ఎంచుకోవడం మంచిది. ఇవి రంధ్రం మీద బరువు పడనీయకుండా చెవి మీద నిటారుగా నిలుస్తాయి.
- చూడడానికి భారీగా కనిపిస్తున్నప్పటికీ అంత బరువు లేని కర్ణాభరణాలు ప్రస్తుతం విరివిగా లభ్యమవుతున్నాయి. వీటిని ఎంపిక చేసుకుంటే చెవి రంధ్రాలు కనపించవు. అంతేకాదు రంధ్రాలు మరింత సాగకుండా ఉంటాయి.



- రాళ్లతో నిండిన బరువైన జుంకాలను ఎక్కువ సేపు ధరించవద్దు. నిద్రించేముందు, స్నానం చేసే ముందు చెవి ఆభరణాలను తీయాలి.
- చెవులకు కమ్మలు పెట్టుకునేముందు రంధ్రం మీద కొబ్బరి నూనె లేదంటే బాదం నూనె రాసి మెల్లగా మర్దన చేయాలి. దీనివల్ల కండరాలు బిగుతుగా మారి ఆభరణాలను జారనివ్వవు. ఇ-విటమిన్ నూనె రాసినా కూడా మంచి ఫలితం కనిపిస్తుంది.
- గుప్పెడు వేపాకులను తీసుకుని ముద్దగా నూరి దానిలో అరచెంచా పసుపు కలిపి ఈ మిశ్రమాన్ని చెవి రంధ్రం మీద రాయాలి. ఇలా తరచూ రాస్తే చర్మం పెరిగి రంధ్రం చిన్నగా మారుతుంది.
- చెవి రంధ్రం బాగా పెద్దదై సాగిపోతే వైద్యుని సలహా మేరకు కుట్లు వేయించుకోవాలి.

పిల్లలు బాగా చదవాలంటే..

పిల్లలు శ్రద్ధగా చదువుకుని ఉన్నతస్థానానికి ఎదగాలని తల్లిదండ్రులు కోరుకుంటారు. అందుకు పిల్లలను చదువులో ప్రోత్సహిస్తూ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సత్ఫలితాలు వస్తాయంటున్నారు నిపుణులు.

- పిల్లలు చదువుకునేటప్పుడు ఇంట్లో ప్రశాంతంగా, సౌకర్యవంతంగా ఉండేలా చూసుకోవాలి. చదువుపై నుంచి వారి దృష్టి మళ్లకుండా జాగ్రత్త వహించాలి.
- చదువుకునే సమయంలో టీవీ పెట్టకూడదు. ఫోన్ మోగినా వాళ్లకి వినిపించనంత దూరంలో ఉంచుకోవాలి. అప్పుడే ఏకాగ్రత పెరుగుతుంది.
- పిల్లలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, పెన్స్ పెన్సిల్స్, రబ్బర్, షార్ప్‌నర్, నోట్‌బుక్స్, వైట్ పేపర్స్, డిజిటల్ టూల్స్ వంటివి అందుబాటులో ఉంచాలి.



- పిల్లలకు ఓ టైమ్‌టేబుల్ ఇవ్వాలి. పాఠశాలలో ఇచ్చే హోమ్‌వర్క్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లను పరిగణనలోకి తీసుకుంటూ ఏవి ముందు పూర్తిచేయాలో చెప్పాలి.
- పాఠాలను పాయింట్ల వారీగా చదువుకుంటూ సులువుగా గుర్తుంచుకునే విధానాన్ని నేర్పించాలి.
- అదేపనిగా చదవమని చెప్పకుండా మధ్యలో కొద్దిగా విరామం ఇవ్వాలి. దీనివల్ల వారి మెదడుపై ఒత్తిడి తగ్గుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది.
- పరీక్షలో మార్కులు తక్కువగా వచ్చినా, ఉత్తీర్ణులు కాలేకపోయినా పిల్లలపై కోపం ప్రదర్శించకుండా మరోసారి ప్రయత్నించమని చెబుతూ ప్రోత్సహించాలి.
- మార్కులు ఎలా వచ్చినా వాటి గురించి కాకుండా పిల్లలు చేసిన కృషిని మెచ్చుకోవాలి.
- పిల్లలు క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు తెచ్చుకున్నపుడు... వారిని మనస్ఫూర్తిగా ప్రశంసించాలి.

ముగ్గురు పిల్లల ఆలనా పాలనా చూసుకొంటూ, గృహిణిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ... ఏ కార్పొరేట్ కొలువుకూ తీసిపోనంతగా సంపాదిస్తోంది కొమ్ముల సౌమ్యారెడ్డి ఉరఫ్ సౌమ్య. స్వతంత్రంగా ఎదగాలన్న పట్టుదల... తనకంటూ గుర్తింపు తెచ్చుకొని... గృహిణులకు స్ఫూర్తిమంత్రం కావాలన్న తపన... ఇవే ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టాయి. 'వి5 ఫ్యామిలీ షో' యూట్యూబ్ చానల్ నెలకొల్పి... రెండేళ్లలో కోటిమంది సబ్‌స్క్రైబర్స్‌ను సంపాదించుకున్న సౌమ్య కథ ఇది.



అభిరుచి

సకుటుంబ సమేతంగా

"ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీజీ చేశాను. ఇష్టపడి చదివి ఇంట్లో కూర్చోవడం... అదీ ఒక సాధారణ గృహిణిగా మిగిలిపోవడం... నాకు అస్సలు నచ్చలేదు. తలుచుకున్నప్పుడల్లా ఒకటే దిగులు. నాకంటూ ఒక గుర్తింపు లేదనే బాధ. ఏదో వెలితిగా ఉండేది. కుటుంబ బాధ్యతల నేపథ్యంలో బయటకు వెళ్లి ఉద్యోగం చేసే అవకాశం లేదు. మరి ఎలా? పిల్లల్ని చూసుకొంటూ, ఇంట్లో నుంచే ఏదైనా చెయ్యాలని అనుకున్నాను. అలా ఆలోచిస్తుంటే తట్టిందే యూట్యూబ్. అయితే చానల్ ఎలా ప్రారంభించాలనేది నాకు తెలియదు. ఇంటర్నెట్‌లో వెతికాను. చాలా విషయాలపై అవగాహన వచ్చింది. చివరకు 2018లో 'వి5 ఫ్యామిలీ షో- తెలుగు' పేరిట యూట్యూబ్ చానల్ ప్రారంభించాను. ఈ నేపథ్యంలో ఒక రోజు పేపర్‌లో వచ్చిన ఓ యూట్యూబర్ ఇంటర్వ్యూ నన్ను బాగా ఆకట్టుకుంది. ఒక తల్లి ఆడుకొంటున్న తన పిల్లల వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పెట్టిందని, తరువాత అదే ఆమెకు ఆదాయ వనరుగా మారిందనేది దాని సారాంశం. ఆ స్ఫూర్తితో నా ముగ్గురు పిల్లల ఆటపాటలను కంటెంట్‌గా తీసుకుందామని అనుకున్నా. కానీ వాళ్ల వీడియోలు పెడతానంటే... 'ఇబ్బందులు ఏవైనా ఎదురవుతాయేమో' అని మావారు సందేహం వ్యక్తం చేశారు. దాంతో మళ్లీ ఆలోచనలో పడ్డాను. తరువాత రకరకాల రూబిక్ క్యూబ్స్‌ను ఎలా పరిష్కరించాలో చెబుతూ చిన్న చిన్న చిట్కాలతో వీడియో ఒకటి అప్‌లోడ్ చేశాను. అందరికంటే నేను బాగా వివరించి చెబుతున్నానని, నా వీడియోల కోసం పిల్లలు వేచి చూస్తున్నారని... ఇలా చాలామంది కామెంట్లలో రాశారు. అవి నాకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చాయి.

పిల్లల్ని చూసుకొంటూనే...

నా వీడియోలకు మంచి కామెంట్స్ అయితే వచ్చాయి కానీ అనుకున్నంత ఆదరణ లభించలేదు. ఒకరోజు యూట్యూబ్‌లో సాయి రమేష్ గారి ఇంటర్వ్యూ ఒకటి చూశాను. ఆయన్ను కలిశాక ఎలాంటి కంటెంట్ పెట్టాలనే దానిపై అవగాహన వచ్చింది. అప్పుడు మా పిల్లలు చాలా చిన్నవారు. వాళ్లు బడికి వెళ్లడం మొదలయ్యాక చానల్‌పై పూర్తి శ్రద్ధ పెడదామని అనుకున్నా. అదే సమయంలో కరోనా వచ్చింది. రెండేళ్ల విరామం తరువాత 2023 ఫిబ్రవరిలో కొత్త చానల్ ప్రారంభించాను. పాత చానల్ పేరులో 'తెలుగు' తీసేసి 'వి5 ఫ్యామిలీ షో' అని పెట్టుకున్నా.



మా స్టార్ తనే...

మా చానల్ విజయవంతం కావడానికి ప్రధాన కారణం విభిన్నమైన కంటెంట్. అలాగే మా అమ్మాయి. తనకు అభిమానులు ఎక్కువ. మాలో స్టార్ తనే. ఇక మా షార్ట్ వీడియోల్లో మాటలు ఉండవు. నటనతోనే కథ చెబుతాను. అందుకే సబ్‌స్క్రైబర్స్‌లో తెలుగు వారే కాకుండా ఇతర దేశాలవారు కూడా ఉన్నారు. షూటింగ్, ఎడిటింగ్, టైటిలింగ్ తదితర పనులన్నీ నేనే చేసుకొంటాను. ఎక్కువ భాగం మొబైల్‌తోనే షూట్ చేస్తాం. ఇక్కడ మన ఆలోచనలు, సృజనాత్మకతే పెట్టుబడి. యూట్యూబ్ చానల్ పెట్టాలనుకున్న మహిళలకు నేను చెప్పేది ఏంటంటే... మన నైపుణ్యం ఏంటో మనం తెలుసుకోవాలి. దానికి పదును పెట్టి, విభిన్నంగా, వినూత్నంగా ఆలోచించాలి. అప్పుడే మంచి కంటెంట్ వస్తుంది.

ఇంట్లో జరిగే ఘటనలే...

నా కంటెంట్‌లో ఎక్కువగా ఇంట్లో అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల మధ్య జరిగే చిన్న చిన్న గొడవలు, కుటుంబంలో కనిపించే భావోద్వేగాలు, నీతి కథలతో పాటు పిల్లలకు వండిపెట్టే వంటలకు సంబంధించిన అంశాలు ఉంటాయి. అంటే ఇంట్లో నిత్యం జరిగే ఘటనలనే ఒక చిన్న వీడియోలో సరదాగా చూపించే ప్రయత్నం. తద్వారా చిన్నారులకు ఈ సమాజం గురించి, మానవ సంబంధాలు, విలువల గురించి తెలియజెప్పడం నా ఉద్దేశం. నాకు ముగ్గురు పిల్లలు. పెద్దవాడి పేరు కృష్ణప్రీతమ్. ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. చిన్నోడు సౌర్యనందన్ ఐదు, పాప... దియా 2వ తరగతిలో ఉన్నారు. మావారు వెంకట్‌రెడ్డి ట్యాక్స్ కన్సల్టెంట్. సొంత వ్యాపారం నిర్వహిస్తున్నారు. మా కంటెంట్‌లో మా పిల్లలు, నేను, మావారితో పాటు మా అత్తమ్మ, అమ్మ కూడా కనిపిస్తుంటారు.

కోటి దాటింది...

యూట్యూబ్‌లో మా కంటెంట్ సూపర్ హిట్ అయింది. చానల్ ప్రారంభించి ఇంకా రెండేళ్లు పూర్తి కాలేదు. కానీ సబ్‌స్క్రైబర్స్ సంఖ్య కోటి దాటింది. ప్రస్తుతం మా చానల్‌కు 10.4 మిలియన్లమంది సబ్‌స్క్రైబ్ చేశారు. రోజుకు దాదాపు ముప్పై వేల మంది కొత్తవారు వస్తున్నారు. వరుసగా ఐదారు రోజులు మంచి వీడియోలు పడితే సబ్‌స్క్రైబర్స్ కూడా పెరుగుతారు. ఇప్పటివరకు 800కు పైగా వీడియోలు అప్‌లోడ్ చేశాను. నేను పెట్టిన 'ఈజీ గణేష్ డ్రాయింగ్' వీడియోను అత్యధికంగా నాలుగు కోట్లమందికి పైగా చూశారు. గణేష్ డ్రాయింగ్‌ను సులువుగా ఎలా వేయాలో అందులో చూపించాను. డ్రాయింగ్, డ్యాన్సింగ్, పేరెంటింగ్, పిల్లల హ్యాండ్ రైటింగ్... ఇలా ఎన్నో విషయాలు యూట్యూబ్‌లో చెబుతుంటాను. ఇంకో విశేషమేమంటే... మా చానల్‌ను రోజుకు దాదాపు మూడు కోట్ల మంది వీక్షిస్తారు. భారత్‌లోని టాప్600 యూట్యూబ్ చానల్స్‌లో మాది ఒకటి.

అదే అతిపెద్ద సవాలు...

మా పిల్లలు చదువులోనూ, ఆటల్లోనూ ఫస్ట్. వీడియోల్లో నటించినంతమాత్రాన వాళ్ల చదువు పాడైపోతుందని కొందరు అనుకొంటారు. అలాంటిదేమీ లేదు. రోజుకు ఒక గంట వారు దీనికి కేటాయిస్తారు. ఆటలు, చదువులో వాళ్లు సాధించిన మెడల్స్, సర్టిఫికెట్లు అన్నీ మా చానల్‌లో చూపిస్తుంటాను. అన్నం తిన్నా తినకపోయినా... నిద్రపోయినా పోకపోయినా రోజూ ఒక వీడియో పెట్టాల్సిందే. మా చానల్ ఇంత వేగంగా అభివృద్ధి సాధించడానికి కారణం అదే. కానీ ఇది అంత సులువు కాదు. ప్రతి రోజూ కంటెంట్ తేవడమే ఒక సవాలైతే... అందులో కొత్తదనం ఉండేలా చూసుకోవడం, అదీ ఆకట్టుకొనేలా రూపొందించడం అతి పెద్ద సవాలు. వీటన్నిటినీ అధిగమించాను కనుకనే ఇవాళ నా పేరు ఇంతమందికి పరిచయమయింది.

నా సంకల్పం నెరవేరింది...

మాది ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబం. సిరిసిల్ల జిల్లా ముస్కానిపేట్ స్వస్థలం. మా అమ్మ లక్ష్మి, నాన్న నర్సింహారెడ్డి... వ్యవసాయం చేసేవారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూనే మా అన్నయ్యను ఎంబీబీఎస్ చదివించారు. అన్నయ్య కూడా అంతే కష్టపడి డాక్టర్ అయ్యాడు. ఇప్పుడు అపోలోలో ఒక టీమ్‌ను లీడ్ చేస్తాడు. తన గురించి ఎప్పుడూ గొప్పగా చెప్పుకొంటా. కానీ నేను ఏమీ సాధించలేదన్న వెలితి నాలో ఉండేది. పీజీ మొదటి సంవత్సరంలో ఉండగానే నాకు పెళ్లయింది. తరువాత చదువు కొనసాగించాను.2010లో పీజీ పూర్తయ్యాక హైదరాబాద్‌కు వచ్చేశాను. కానీ ఉద్యోగాలేవీ చేయలేదు. పదేళ్లు పిల్లలతోనే సరిపోయింది. వెనక్కి తిరిగి చూసుకొంటే నేనంటూ సాధించిందేమీ లేదు. 'గృహిణి అయినంతమాత్రాన ఏమీ చేయలేమా?' అనే ఆలోచన నాకు నిద్రపట్టనివ్వలేదు. అంకితభావంతో ప్రయత్నిస్తే అనుకున్నది సాధించవచ్చని చెప్పాలనుకున్నా. నాలాంటి గృహిణులు అందరికీ ఒక స్ఫూర్తిమంత్రం అవ్వాలని కోరుకున్నా. ఆ సంకల్పంతోనే నన్ను నేను నిరూపించుకున్నాను. ఇవాళ సొంత వ్యాపారం చేస్తున్న మావారితోనే కాదు... డాక్టర్ అయిన మా అన్నయ్యతో కూడా పోటీపడి సంపాదిస్తున్నా. మా పిల్లలకు నెల నెలా జీతం ఇస్తున్నా. ఇల్లు, భర్త, పిల్లలు... అన్నిటినీ చూసుకొంటూ నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నా. ఇంతకు మించిన సంతృప్తి, సంతోషం ఇంకేముంటుంది!"

• హనుమా

అనస్థీషియాలజిస్టుగా క్యాన్సర్ రోగుల బాధ, వారి బంధువుల వేదన గమనించి తీవ్రంగా కదిలిపోయారు డాక్టర్ మామి పరిజా. వారికి ఉపశమనం కలిగించడానికి ఆమె చేపట్టిన ప్రయత్నం... 800కు పైగా కుటుంబాలకు అండగా నిలిచింది. ఒడిశాకు చెందిన మామి పరిజా సేవా ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...



వారి వేదనకు ఉపశమనంగా..

"డాక్టర్! నా కణితిని తొలగిస్తే ప్రమాదం ఏదైనా ఉంటుందా? ఆపరేషన్ తరువాత అంతా బాగుంటుందా? ఇంకొన్నాళ్ళు బతుకుతానా? నా నొప్పి తగ్గిపోతుందా?... ఆపరేషన్ థియేటర్‌లో రోగులతో, వారి బంధువులతో జరిగే సంభాషణలో నాకు ఎదురయ్యే ప్రశ్నలివి. వాటికి నా దగ్గర సమాధానం ఉండేది కాదు. ఆ రోగుల పరిస్థితిని తలచుకొని నాకు రాత్రిళ్ళు నిద్రపట్టేది కాదు. వివిధ దశల్లో శస్త్రచికిత్సలు చేయించుకొనే ఆ రోగులు నా కళ్ళ ముందు కదులుతూ ఉండేవారు.

పదే పదే అదే ఆలోచన...

మాది ఒడిశాలోని భువనేశ్వర్. అక్కడే వివిధ ఆసుపత్రుల్లో అనస్థీషియాలజిస్ట్‌గా పని చేశాను. క్యాన్సర్ రోగులను చూస్తున్నప్పుడు 'వారి బాధను తగ్గించే మార్గం ఏదీ లేదా?' అనే ఆలోచన నా మనసులో పదే పదే తిరుగుతూ ఉండేది. ఆ దిశగా ఒక ఆచరణీయమైన మార్గం కోసం వెతుకుతున్న సమయంలో... నా బాల్య స్నేహితురాలు నమ్రత మా ఆసుపత్రికి వచ్చింది. రోగుల్ని చూసి ఆమె తీవ్రంగా చలించిపోయింది. అప్పుడే నా ఆలోచనలను ఆమెతో పంచుకున్నాను. "దీనికి పరిష్కారం ఏమిటి?" అని అడిగింది తను. "పేద, దిగువ మధ్య తరగతి కుటుంబాలకు చెందిన రోగులకు ఎక్కువకాలం ఆసుపత్రుల సంరక్షణలో ఉండే ఆర్థిక స్తోమత ఉండదు. వాళ్ళకు నిపుణుల పర్యవేక్షణలో పెయిన్ మేనేజిమెంట్, ఉపశమన సేవలు అవసరం. ఇళ్ళ దగ్గర అవి లభించడం కష్టం. ప్రత్యేకంగా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి... ఈ సేవలు అందిస్తే వారికి ఊరటగా ఉంటుంది. కానీ దానికి ఖర్చవుతుంది. మానవ వనరులు కూడా అవసరం అవుతాయి" అని చెప్పాను. "ఈ ఊర్లో నాకు ఒక ఇల్లుంది. సిబ్బంది సంగతి నువ్వు చూసుకుంటానంటే... ఆ ఇంట్లో మనం ఒక కేంద్రాన్ని ప్రారంభించవచ్చు" అంది నమ్రత. అలా 2012లో... కొద్దిమంది రోగులతో మా చిన్న ప్రయత్నం ప్రారంభమయింది. ఈ సంగతి తెలిసి మరికొందరు మిత్రులు మాతో కలిశారు.

ఆ సంఘటనలు ఆవేదన కలిగించాయి...

మొదట్లో మా 'పాలియేటివ్ కేర్ సెంటర్'... అవుట్‌పేషెంట్ విభాగంగా పని చేసేది. వచ్చిన రోగులకు కౌన్సెలింగ్ చేసేవాళ్ళం. వ్యాధి నియంత్రణకోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికీ, వారి కుటుంబ సభ్యులకు వివరించేవాళ్ళం. నొప్పి నివారణ మందులను పంపిణీ చేసేవాళ్ళం. క్యాన్సర్ తొలిదశలో ఉన్నవారిని నిపుణులు ఉన్న ఆసుపత్రులకు రిఫర్ చేసి, ఆయా యాజమాన్యాల సహకారంతో చికిత్సలకు సాయపడేవాళ్ళం. కానీ ఈ క్రమంలో మాకు కొన్ని చేదు అనుభవాలు ఎదురయ్యాయి. అవగాహన లోపం,



చికిత్సలు మధ్యలో మానెయ్యడం, శస్త్రచికిత్సల తరువాత తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల కొందరు రోగులు మరణించిన సంఘటనలు ఆవేదన కలిగించాయి. దీంతో క్యాన్సర్ బాగా ముదిరిన దశలో ఉన్నవారికి, శస్త్ర చికిత్సలు చేయించుకున్నవారికి పూర్తిస్థాయిలో ఉపశమన సేవలను అందించడం కోసం... 'అమృతధార ట్రస్ట్' పేరిట ఒక సంస్థను 2019లో ఏర్పాటు చేశాం.

ఉపశమనం, స్వస్థతే ధ్యేయం...

ప్రస్తుతం భువనేశ్వర్‌లో మాకు రెండు కేంద్రాలున్నాయి. రోగులు బస చేయడానికి వసతి ఉంది. డేకేర్ విభాగంలో తీవ్రమైన నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, క్యాన్సర్ గాయాలకు డ్రెస్సింగ్, ఇతర ప్రక్రియలు నిర్వహిస్తున్నాం. మాకు ప్రత్యేకంగా ఒక ఫార్మసీ కూడా ఉంది. మా నర్సులు రోగులకు రోజూ కాల్ చేసి... వారి పరిస్థితి గురించి వివరాలు తెలుసుకుంటారు. వాటిని ఎప్పటికప్పుడు నమోదు చేస్తారు. రోగులు రాలేని పక్షంలో... మా సిబ్బంది వారి ఇళ్ళకు వెళ్తారు. డేకేర్, హోమ్ విజిట్స్ ద్వారా నొప్పి నిర్వహణ, మందులు వేసుకోవడంలో సహాయం, పరిశుభ్రతను పాటించేలా చేయడం, క్యాన్సర్ విషయంలో ఉన్న అపోహలను, భయాన్ని తొలగించడం, కౌన్సెలింగ్ సేవలను మేము అందిస్తున్నాం. ఇప్పటివరకూ 800కు పైగా కుటుంబాలు మా సాయాన్ని అందుకున్నాయి. మృతి చెందిన రోగుల కుటుంబాలకు కూడా వివిధ మార్గాల్లో సాయం అందేలా చూస్తున్నాం. ట్రస్ట్‌కు అయ్యే ఖర్చు మొత్తాన్ని మా సభ్యుల కుటుంబాలు, స్నేహితులు, శ్రేయోభిలాషుల ద్వారా సమకూర్చుకుంటున్నాం. కిందటి ఏడాది ... ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ చేతుల మీదుగా 'దేవి' పురస్కారం అందుకున్నాను. పలు ఇతర సంస్థల నుంచి కూడా మా సంస్థకు గుర్తింపు లభించింది. రోగులకు ఉపశమనం, స్వస్థత కలిగించాలనే మా సంకల్పాన్ని ఇవన్నీ బలోపేతం చేస్తున్నాయి. ఒడిశా అంతటా, భవిష్యత్తులో ఇతర ప్రాంతాల్లో సమగ్రమైన ఉపశమన చికిత్సను అందించాలన్నది మా లక్ష్యం."

ఫ్యాషన్



శ్వేత సౌధంలో కాంచీపురం ధగధగలు

అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్ పదవీ ప్రమాణ స్వీకారానికి హాజరైన నీతా అంబానీ, ఎప్పటిలాగే భారతీయ సంప్రదాయం ఉట్టిపడే వస్త్రధారణలో మెరిసిపోయారు. ఈ వేడుక సందర్భంగా ఆమె ఎంచుకున్న కాంచీపురం పట్టుచీర, 18వ శతాబ్దం నాటి వారసత్వ ఆభరణాల సొగసుల విశేషాలు ఈ వారం ఫ్యాషన్ ప్రత్యేకం!

వారసత్వ సంపద ఉట్టిపడేలా...

కాంచీపురం ఆలయ వైభవాలకు అద్దం పట్టే, వందకు పైగా ప్రత్యేక మోటిఫ్స్‌తో రూపొందిన కాంచీపురం పట్టుచీర, 18వ శతాబ్దం నాటి వారసత్వ ఆభరణాలు ధరించి... భారతీయ సంప్రదాయ వైభవాన్ని అంతర్జాతీయ వేదికపై ఘనంగా ఆవిష్కరించారు రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ సతీమణి నీతా అంబానీ. జాతీయ అవార్డు విజేత, చేనేత కళాకారుడు బి.కృష్ణమూర్తి రూపొందించిన ఈ చీరలో ఇరుతలైపాక్షి (విష్ణువును సూచించే రెండు తలల గద్ద), మయిల్ (అమరత్వం, దైవత్వానికి సూచన), భారతీయ జానపద కథల విశిష్టత) పౌరాణిక సొర్గవాసల్ జంతు బాటలతో కూడిన సూక్ష్మమైన, క్లిష్టమైన మోటిఫ్స్ ఉన్నాయి. ఈ అద్భుతమైన చీరకు తనదైన శైలిలో రూపొందించిన వెల్వెట్ బ్లౌజ్‌తో ప్రముఖ డిజైనర్ సమకాలీన హంగును జోడించడం మరొక విశేషం.



విలువైన జాతి రాళ్లతో...

కాంచీపురం చీరలు విలాసవంతమైన, అత్యంత అద్భుతమైన కళాకృతులు. వీటికి సరిజోడుగా ఎంచుకునే ఆభరణాలు కూడా అంతే హుందాతనాన్ని ప్రతిబింబించేలా ఉండాలి. కాబట్టే 200 ఏళ్లనాటి అరుదైన భారతీయ శైలితో రూపొందిన ఆభరణాలను ఎంచుకున్నారు నీతా అంబానీ. పచ్చలు, గోమేధికాలు, వజ్రాలు, ముత్యాలు పొదిగిన చిలుక ఆకారంలో కుందన్ శైలిలో రూపొందిన పెండెంట్‌ను ఆమె ధరించారు. నలుపు రంగు కాంచీపురం చీర, పాతకాలపు నగలతో, నీతా అంబానీ వేడుకలో మెరిసిపోయారు. కాంచీపురం చీరలు ప్రత్యేకించి సంప్రదాయ వేడుకలకు ఎంతో బాగా నప్పుతాయి. ప్రస్తుతం మార్కెట్లో కాంచీపురం చీరలు వినూత్నమైన డిజైన్లలో రూపొందుతున్నాయి. కలకాలం వన్నె తరగని ఈ పట్టుచీరల మిలమిలల ముందు ఎంతటి ఆధునిక వస్త్రధారణ అయినా దిగదుడుపే!



ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
వరంగల్ ● బుధవారం 22 జనవరి 2025



కొత్త ప్రయాణం మొదలైంది

బాలీవుడ్ నటి ప్రియాంకాచోప్రా మంగళవారం సాయంత్రం చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆమెకు ప్రధానార్చకులు రంగరాజన్ స్వామి వారి దర్శనం కల్పించి ఆలయ విశిష్టతను వివరించారు. ఆలయ చరిత్రను తెలిపే వాక్ పుస్తకాన్ని అందించారు. బాలాజీ ఆశీస్సులతో తన కెరీర్‌లో కొత్త ప్రయాణం మొదలైందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ సతీమణి ఉపాసనకు ప్రియాంక సోషల్ మీడియా వేదికగా దన్యవాదాలు తెలిపారు. మీ కొత్త సినిమా మంచి విజయం సాధించాలి, ఆ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు మీకు ఉంటాయి అని ఉపాసన బదులిచ్చారు. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం షూటింగ్ కోసం ప్రియాంక చోప్రా హైదరాబాద్‌కు వచ్చినట్లు సమాచారం.

మొయినాబాద్ రూరల్ (ఆంధ్రజ్యోతి)

కాళేశ్వరాలయ గర్భగుడిలో
ప్రైవేటు ఆల్బమ్ చిత్రీకరణ

● గాయని మధుప్రియపై దేవాదాయ శాఖ ఆగ్రహం



దక్షిణ కాశీగా పేరుగాంచిన పుణ్యక్షేత్రం కాళేశ్వరం గర్భగుడిలో గాయని మధుప్రియ ప్రైవేటు ఆల్బమ్ చిత్రీకరించడం వివాదాస్పదమైంది. ఆలయంలో ఉన్న భక్తులను బయటకు పంపేసి, గర్భగుడి తలుపులు మూసి వీడియోను చిత్రీకరించారు. ఆదివారం జరిగిన ఈ షూటింగ్‌కు సంబంధించిన వీడియో సోమవారం బయటకు రావడంతో ఈ వ్యవహారం బహిర్గతమైంది. ఆలయ సంప్రదాయాలను తుంగలో తొక్కి గర్భగుడిలో శాస్త్ర విరుద్ధంగా షూటింగ్‌లు చేయడం ఏమిటనే ఆరోపణలు వెల్లువెత్తాయి. షూటింగ్ చేయడానికి ఆలయ అధికారులు ఎలా అనుమతించారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఆలయ ఈవో మారుతిని వివరణ కోరగా దర్శనానికి మాత్రమే వారికి అనుమతి ఇచ్చామని, షూటింగ్‌లకు అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. గర్భ గుడిలో జరిగిన ఈ వ్యవహారాన్ని దేవాదాయ శాఖ సీరియస్‌గా తీసుకుంది. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆలయ ఈవోకు దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.





జూనియర్ ఎన్టీఆర్‌తో సినిమా చేయాలనుంది

● హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ గన్

జూనియర్ ఎన్టీఆర్‌తో సినిమా చేయాలనుంది అని తన మనసులో మాట చెప్పారు ప్రముఖ హాలీవుడ్ డైరెక్టర్ జేమ్స్ గన్. రాజమౌళి నిర్మించిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రాన్ని చూశానని, అందులో జూనియర్ ఎన్టీఆర్ నటనకు ముగ్ధుడనయ్యానని, అప్పుడే ఆయనతో ఓ సినిమా చేయాలనే ఆలోచనకు వచ్చినట్లు జేమ్స్ చెప్పారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'ఆర్‌ఆర్‌ఆర్‌లో నటించిన ఆ కుర్రాడు ఎవరు? అనే అంశం ఏడాదిగా నా మదిని తొలిచేస్తోంది. అతను చాలా బాగున్నాడు. పులులతో వీరోచిత పోరాటం, ఆయన నటించిన ప్రతీ సన్నివేశం ఎంతో అద్భుతంగా ఉంది. ఆయనతో కలసి పనిచేయడానికి ఇష్టపడుతున్నాను' అని అన్నారు. జూనియర్ ఎన్టీఆర్ కోసం మీ వద్ద ప్రత్యేక పాత్ర ఏమైనా సిద్ధంగా ఉందా అన్న ప్రశ్నకు 'ప్రస్తుతానికైతే లేదు. అందుకు కొంత సమయం పడుతుంది' అని జేమ్స్ బదులిచ్చారు. కాగా, ఇదే ఇంటర్వ్యూలో పాల్గొన్న మరో ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు ఆండ్రూ గార్‌ఫీల్డ్ కూడా ఆర్‌ఆర్‌ఆర్‌లో రామ్‌చరణ్, జూనియర్ ఎన్టీఆర్ నటనను ప్రశంసలతో ముంచెత్తారు.

ఈ ఏడాది నాకు చాలా ముఖ్యం



'ఈ ఏడాది నాకు చాలా ముఖ్యం. చాలా సినిమాలు వస్తున్నాయ్' అని హీరోయిన్ సంయుక్తా మీనన్ అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆమె మీడియాతో మాట్లాడుతూ, శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే జీవితం చాలా సాఫీగా సాగుతుందని నా నమ్మకం' అన్నారు. ప్రస్తుతం నాలుగైదు సినిమాల్లో నటిస్తున్నానని తెలిపారు.

తిరుమల (ఆంధ్రజ్యోతి)

సైఫ్.. సేఫ్‌గా ఇంటికి!



బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ఈనెల 16న ఓ దుండగుడు ముంబైలోని సైఫ్ ఇంట్లోకి చొరబడి ఆయనపై దాడి చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి లీలావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం సాయంత్రం డిశ్చార్జి అయ్యి సేఫ్‌గా ఇంటికి వెళ్లారు. కాగా, సైఫ్‌పై దాడి చేశాడన్న ఆరోపణలతో షరీఫుల్ ఇస్లామ్ షెహజాద్(30)అనే బంగ్లాదేశ్ పౌరుడిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఇదిలా ఉంటే ఇటీవల జరిగిన పరిణామాల వల్ల కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సైఫ్ కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు. సైఫ్ కుటుంబం రక్షణ బాధ్యతలు బాలీవుడ్ నటుడు రోనిత్ రాయ్ స్వీకరించారు. ముంబయిలో ఓ సెక్యూరిటీ ఏజెన్సీని ఆయన నిర్వహిస్తున్నారు. సైఫ్ కుటుంబంతో తాము ఉన్నట్లు ఓ ఇంటర్వ్యూలో రోనిత్ చెప్పారు.

నా కెరీర్‌కి ఊపిరి పోసే చిత్రం



సాయిరామ్ శంకర్ హీరోగా వినోద్ విజయన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఒక పథకం ప్రకారం'. ఆషిమా నర్వాల్ హీరోయిన్. సముద్రఖని కీలక పాత్రలో నటించారు. వినోద్‌కుమార్ విజయన్, గార్లపాటి రమేశ్ నిర్మించారు. చిత్రం ఫిబ్రవరి 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో సాయిరామ్ శంకర్ మాట్లాడుతూ 'ఇది నా కెరీర్‌కి ఊపిరి పోసే సినిమా. కచ్చితంగా నాకు కమ్‌బ్యాక్ ఫిల్మ్ అవుతుంది. ఇందులో సిద్ధార్థ నీలకంఠ అనే పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నటించాను. నటనలో చిన్నపాటి కృత్రిమత్వం కూడా ఉండకూడదని నెలరోజుల పాటు నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో శిక్షణ తీసుకున్నా. ఈ చిత్రం ఎవరినీ నిరాశపర్చదు' అని అన్నారు.

కృష్ణభక్తుని ప్రేమగాథ



అక్షయ్, మమితా బైజు, ఐశ్వర్య హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'డియర్ కృష్ణ'. దినేశ్ బాబు దర్శకత్వంలో పీఎన్ బలరామ్ నిర్మించారు. విడుదలకు సిద్ధమైన సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ 'యదార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. ఒక కృష్ణభక్తుని జీవితంలో జరిగిన అద్భుత సంఘటన ఆధారంగా రూపుదిద్దాం. ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం' అని చెప్పారు. 'డియర్ కృష్ణ' చిత్రాన్ని ప్రేమకథకు వినోదాన్ని జోడించి ఆసక్తికరంగా రూపొందించాం, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది అని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: హరిప్రసాద్, ఎడిటర్: రాజీవ్ రామచంద్రన్.



రష్మిక రాచఠీవి!

విక్కీ కౌశల్, రష్మిక మందన్న జంటగా రూపొందుతున్న బాలీవుడ్ చిత్రం 'ఛావా'. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో దినేశ్ విజన్ నిర్మిస్తున్నారు. ఛత్రపతి శివాజీ తనయుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవిత గాథ ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రమిది. ఇందులో శంభాజీ భార్య మహారాణి యేసుబాయి భోంస్లే పాత్రలో రష్మిక కనిపించనున్నారు. ఫిబ్రవరి 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం స్పెషల్ టీజర్‌తో పాటు రష్మికమందన్న ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. మహారాణి పాత్రలో రష్మిక ఆకట్టుకున్నారు. ఈ పోస్టర్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన రష్మిక 'ప్రతి గొప్ప పాలకుడి వెనుక యోధురాలైన భార్య ఉంటుంది' అనే వ్యాఖ్యను జోడించారు. మహారాణి దుస్తుల్లో రష్మిక రాచఠీవితో కనిపించారు. అక్షయ్ ఖన్నా, అశుతోష్ రాణా, దివ్య దత్తా కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ట్రైలర్‌ను నేడు విడుదల చేయనున్నారు.



నన్ను అడిగి తీసుకుంటే బావుంటుందండీ

'బయటకు వెళ్లినప్పుడు కొందరు అకస్మాత్తుగా వాళ్ల సెల్‌ఫోన్లలో నా ఫొటోలు తీస్తున్నారు. మిమ్మల్ని ఒక్క ఫొటో తీసుకోవచ్చా? అని అడిగితే ఎంత బావుంటుంది' అంటూ అభిమానులతో తనకు ఎదురవుతున్న అనుభవాన్ని పంచుకున్నారు నటి సాయి పల్లవి. 'ప్రతి మనిషికీ కొన్ని నచ్చని విషయాలు ఉండటం సహజం. కొన్ని భయాలు కూడా మనల్ని వెంటాడుతూ ఉంటాయి. నన్ను ఫొటోలు తీయడం అసలు నచ్చదు. నేను అందమైన చెట్టునో, ఇల్లునో కాదు కదా, జీవం ఉన్న మనిషిని నా అనుమతి లేకుండా వీరంతా ఎందుకు ఇలా చేస్తున్నారు' అనిపిస్తుంది అని ఆమె చెప్పారు. సాయి పల్లవి నటించిన చిత్రం 'అమరన్' ఇటీవలె విడుదలై ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ చిత్రంలో నటనకుగాను ఆమెకు సర్వత్రా ప్రశంసలు లభించాయి. ఆమె 'రామాయణం' చిత్రం ద్వారా బాలీవుడ్‌లోనూ ఎంట్రీ ఇస్తున్నారు. ఇక తెలుగులో ఆమె నాగచైతన్య సరసన 'తండేల్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదల కానుంది.

సరికొత్త కథాంశంతో...



దర్శకుడు మారుతి సమర్పణలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. సత్యరాజ్, వశిష్ఠ, ఎన్.సింహా, సాంచి రాయ్, ఉదయభాను, సత్యం రాజేశ్, క్రాంతి కిరణ్ ముఖ్య పాత్రలు పోషించిన ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. సరికొత్త పాయింట్‌తో రూపుదిద్దుకుంటున్న చిత్రమిదని దర్శకుడు మోహన్ శ్రీవత్స చెప్పారు. చిత్రంలోని ప్రతి పాత్ర విభిన్నంగా ఉంటుందని, ముఖ్యంగా సత్యరాజ్ పాత్ర అందరినీ అలరిస్తుందని ఆయన చెప్పారు. త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని నిర్మాత విజయ్‌పాల్ రెడ్డి అడిదెల చెప్పారు.

సినీరంగంపై ఐటీ దాడులు

● ఏకకాలంలో 55 చోట్ల సోదాలు
● కొత్త సినిమాల హై కలెక్షన్ల లెక్కలపై ఆరా
● దిల్‌రాజు సహ పలువురు నిర్మాతల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు

సినీ రంగానికి చెందిన ప్రముఖులు టార్గెట్‌గా ఇన్‌కంటాక్స్ అధికారులు మంగళవారం వరుస సోదాలతో హడలెత్తించారు. ఒకటీ, రెండు కాదు ఏకంగా 55 ఐటీ బృందాలు హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహించాయి. సినీ రంగానికి చెందిన నిర్మాతలు, ఫిలిం ప్రొడక్షన్ సంస్థల కార్యాలయాల్లో సోదాలు జరిగాయి. ఇటీవల సంక్రాంతికి విడుదలైన గేమ్ ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలకు సంబంధించి తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్‌రాజు ఇల్లు, కార్యాలయాల్లో, ఆయన కుమార్తె హన్షిత రెడ్డి, సోదరుడు శిరీష్ ఇళ్లల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. అలాగే మైత్రి మూవీ మేకర్స్ సంస్థకు సంబంధించి మైత్రి నవీన్, సీఈఓ చెర్రీ ఇళ్లు, కార్యాలయాలు, వారి భాగస్వాముల ఇళ్లలోనూ ఐటీ అధికారులు సోదాలు నిర్వహించి పలు అవకతవకలను గుర్తించినట్లు తెలుస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన 'పుష్ప 2' భారీ కలెక్షన్లు సాధించిన విషయాన్ని బహిరంగంగా లెక్కలతో సహ నిర్మాతలు చెప్పడంతో ఆ మొత్తానికి సంబంధించి అసలు వాస్తవాలు జీఎస్టీ లెక్కలు, ఆదాయంలో ఈ కలెక్షన్ చూపించారా? లేదా అనే విషయాలను ఐటీ అధికారులు పరిశీలించారని సమాచారం. సింగర్ సునీత భర్త రాముకు సంబంధించిన మ్యాంగో మీడియా సంస్థలోనూ ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. దిల్ రాజు ఇంట్లో సోదాలు నిర్వహించిన ఐటీ అధికారులు ఒక బ్యాంకు లాకర్‌ను గుర్తించి ఆ లాకర్ దిల్‌రాజు భార్య తేజస్విని పేరిట ఉండటంతో ఆమెను బ్యాంకుకు తీసుకుని వెళ్లి లాకర్ తెరిపించారు. ఐటీ వాళ్లు లాకర్ తెరిచి చూపించాలని అడిగారు అలాగే చేశామని తేజస్విని మీడియాతో అన్నారు. 'పుష్ప2, గేమ్ చేంజర్, సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలకు సంబంధించిన కలెక్షన్లు వందలకోట్ల రూపాయలుగా ప్రచారం జరిగిన నేపథ్యంలో ఐటీ విభాగం ఈ సోదాలను చేపట్టినట్లు సమాచారం.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)


క్రిమినల్ నేపథ్యం ఉన్నా భయపడను



తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలకు చాలా వేదనకు గురయ్యానని సినీ నటి మాధవీలత వాపోయారు. మంగళవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జేసీ ప్రభాకర్ రెడ్డిపై ఆమె ఫిర్యాదు దేశారు. వారి బెదరింపులతో తన కుటుంబ సభ్యులు భయాందోళనలకు గురవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా హీరోయిన్లు, మహిళల గురించి అసభ్యకరంగా మాట్లాడి, ఆ తర్వాత క్షమాపణ చెబితే సరిపోతుందా? అని ఆమె ప్రశ్నించారు. ఇలాంటి వ్యక్తుల వల్ల ఆడపిల్లలు రాజకీయాల్లోకి రావడానికే వెనకడుగు వేస్తారు? నేను ఊరుకునే ప్రసక్తే లేదు. వారికి ఎంత పెద్ద క్రిమినల్ నేపథ్యం ఉన్నా, నేను భయపడను. అందుకే దీన్నొక సవాల్‌గా తీసుకొని కమిషనర్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

అంచనాలకు మించి అవతార్ 3




ఇంతవరకూ వచ్చిన మొదటి, రెండు భాగాలకంటే 'అవతార్ 3.. ఫైర్ అండ్ యాష్' చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగిస్తుందని దర్శకుడు జేమ్స్ కామెరూన్ చెప్పారు. ఆ రెండు భాగాల కంటే 'అవతార్ 3' నిడివి కూడా ఎక్కువే అని ఆయన తెలిపారు. 2022లో వచ్చిన 'అవతార్ 2.. ద వే ఆఫ్ వాటర్' ఆశించిన స్థాయిలో లేకపోయినప్పటికీ భారీ అంచనాల వల్ల 2.3 బిలియన్ డాలర్లు వసూలు చేసింది. కానీ ఆ సినిమాలో కంటెంట్ విషయంలో చాలా మంది పెదవి విరిచారు. సినిమా గొప్పగా లేదనీ, చూసిన సన్నివేశాలే రిపీట్ అయ్యాయని విమర్శలు వినిపించాయి. అవి దృష్టిలో పెట్టుకుని కంటెంట్ మీద ఎక్కువ దృష్టి పెట్టారు కామెరూన్. ఇప్పటికే షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న 'అవతార్ 3' ఇప్పుడు పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. విజువల్ వండర్‌గా ఈ సినిమా ఉంటుందనీ, ఇంతకుముందు వచ్చిన రెండు భాగాల్లోని సన్నివేశాలు రిపీట్ కావవి కామెరూన్ చెప్పారు. డిసెంబర్ 19న 'అవతార్ 3' విడుదలవుతుంది. ఆ తర్వాత 'అవతార్ 4' 2029 డిసెంబర్ 21న, అవతార్ 5 2031 డిసెంబర్ 19న విడుదలవుతాయి.

జూన్‌లో ఆరంభం



రూ. 3 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి రూ. 136 కోట్లకు పైబడి వసూళ్లను సాధించిన మలయాళ ప్రేమకథా చిత్రం 'ప్రేమలు'. మలయాళ హీరో ఫహద్ ఫాజిల్ నిర్మించిన ఈ చిత్రం చిన్న సినిమాగా విడుదలై సంచలన విజయాన్ని అందుకొంది. ఈ సినిమాకు గతంలోనే సీక్వెల్ ప్రకటించారు. మంగళవారం చిత్రబృందం ఓ అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ ఏడాది జూన్‌లో షూటింగ్ ప్రారంభించి, డిసెంబర్‌లో 'ప్రేమలు 2'ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపింది.






ట్రంప్ టారిఫ్ షాక్



స్టాక్ మార్కెట్ భారీ పతనం

సెన్సెక్స్ 1,235 పాయింట్లు డౌన్

ఏడు నెలల కనిష్ఠానికి సూచీ.. 23,000 స్థాయికి జారిన నిఫ్టీ.. రూ.7.52 లక్షల కోట్లు ఆవిరి



ముంబై: భారత స్టాక్ మార్కెట్ మంగళవారం భారీగా నష్టపోయింది. సెన్సెక్స్ ఒక దశలో 1,431.57 పాయింట్లు క్షీణించి 75,641.87 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 1,235.08 పాయింట్ల (1.60 శాతం) నష్టంతో 75,838.36 వద్ద స్థిరపడింది. సూచీకిది ఏడు నెలలకు పైగా కనిష్ఠ ముగింపు స్థాయి. నిఫ్టీ 320.10 పాయింట్లు (1.37 శాతం) కోల్పోయి 23,024.65 వద్దకు జారుకుంది. 2024 జూన్ 6 తర్వాత సూచీకిదే కనిష్ఠ ముగింపు స్థాయి. అమెరికా కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ సుంకాల వడ్డింపు హెచ్చరికలు అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధానికి దారితీయవచ్చన్న భయాలతో పాటు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోతున్న నేపథ్యంలో ట్రేడర్లు అప్రమత్తమై పెద్దఎత్తున అమ్మకాలకు పాల్పడ్డారు. డిసెంబరు త్రైమాసికానికి చాలా కంపెనీల ఆదాయ వృద్ధి అంచనాలకు అనుగుణంగా పెరగకపోవడం, బలహీన రూపాయి ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత కుంగదీశాయని విశ్లేషకులు పేర్కొన్నారు. అమ్మకాల హోరులో మార్కెట్ వర్గాల సంపద (బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్) రూ.7.52 లక్షల కోట్లు గల్లంతైంది. దాంతో బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ.424.07 లక్షల కోట్లకు (4.90 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

సెన్సెక్స్ 30లో 28 కంపెనీలకు నష్టాలే..

సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌సీఎల్ టెక్ మినహా అన్నీ నష్టపోయాయి. జొమాటో షేరు ఏకంగా 10.92 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. అదానీ పోర్ట్స్, ఎన్‌టీపీసీ 3 శాతానికి పైగా పతనమమయ్యాయి. ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎం అండ్ ఎం, బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా షేర్లు 2 శాతానికి పైగా మార్కెట్ విలువను కోల్పోయాయి. కాగా, బీఎస్ఈలోని చిన్న, మధ్య స్థాయి కంపెనీల ప్రాతినిధ్య సూచీలైన మిడ్‌క్యాప్ 2 శాతం, స్మాల్‌క్యాప్ 1.94 శాతం తగ్గాయి. రంగాల వారీ సూచీల్లో రియల్టీ ఏకంగా 4.22 శాతం నష్టపోయింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్ 3.99 శాతం క్షీణించగా.. కన్స్యూమర్ డిస్‌క్రెషనరీ, సర్వీసెస్, పవర్, టెలికాం, యుటిలిటీ ఇండెక్స్‌లు 2 శాతానికి పైగా నష్టపోయాయి. బీఎస్ఈలో మొత్తం 4,088 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 2,881 నెగిటివ్‌గా ముగిశాయి. 1,106 కంపెనీల షేర్లు లాభపడగా.. 101 యథాతథంగా ముగిశాయి. 67 కంపెనీల షేర్లు ఏడాది కనిష్ఠానికి జారుకున్నాయి. కాగా, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు సోమవారం మన మార్కెట్ నుంచి నికరంగా రూ.4,336.54 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు.

- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 13 పైసలు క్షీణించి రూ.86.58 వద్ద ముగిసింది. డాలర్ ఇండెక్స్ బలపడటంతో పాటు ఈక్విటీ మార్కెట్లో భారీ నష్టాలు ఇందుకు కారణమయ్యాయి.
- అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 1.68 శాతం తగ్గి 78.80 డాలర్లకు పడిపోయింది. దేశీయంగా చమురు ఉత్పత్తిని పెంచుతామని ట్రంప్ ప్రకటించడం ఇందుకు ప్రధాన కారణమైంది.
- ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.100 పెరిగి రూ.82,100కు చేరుకోగా.. కిలో వెండి రేటు ఏ మార్పు లేకుండా రూ.93,000 పలికింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒకదశలో 2,730 డాలర్లు, సిల్వర్ 31.10 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

ఐపీఓల సొమ్ము దుర్వినియోగమవుతోంది..

- ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లూ జర జాగ్రత్త
- లిస్టింగ్‌కు ముందే ఐపీఓ షేర్లలో ట్రేడింగ్
- సెబీ చీఫ్ మాధవి పురి బుచ్



ముంబై: పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మార్కెట్‌పై క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ మరోసారి ఆందోళన వ్యక్తం చేశారు. ఐపీఓల ద్వారా సేకరించిన నిధులను కొన్ని కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయన్నారు. ఇలాంటి కంపెనీలు అసలు ఐపీఓ మార్కెట్‌కే రాకుండా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు కట్టడి చేయాలని కోరారు. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐబీఏఐ) నిర్వహించిన ఒక సదస్సులో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. గత ఏడాది కాలంలో ఐపీఓలు జారీ చేసిన కొన్ని కంపెనీల షేర్లు వందల రెట్లు సబ్‌స్క్రైబ్ కావడం, భారీ లాభాలతో లిస్టింగ్ కావడం, తర్వాత నీరుగారి పోవడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సెబీ చీఫ్ బుచ్ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. ఇలాంటి కంపెనీలను ఆమె 'పంప్ అండ్ డంప్' కంపెనీలుగా వర్ణించారు. దీనికి చెక్ పెట్టేందుకు లిస్టింగ్‌కు ముందే ఐపీఓ షేర్లలో ట్రేడింగ్‌ను అనుమతించే విషయాన్ని పరిశీలిస్తున్నట్టు తెలిపారు.

అసాధారణ దుర్వినియోగం: భారీ లాభాలతో లిస్టయిన వెంటనే పంప్ అండ్ డంప్ కంపెనీల ప్రమోటర్లు తమ వాటా షేర్లనూ భారీ లాభాలకు విక్రయించడాన్ని గుర్తు చేశారు. ఈ భారీ లాభాలను వారు తమకు సంబంధించిన వ్యక్తుల బ్యాంకు ఖాతాల ద్వారా విదేశాలకు తరలించుకు పోతున్నారన్నారు లేదా వ్యాపార అభివృద్ధి కోసం విదేశాల్లో ఏదో ఒక అల్లాటప్పా కంపెనీని లేదా యాప్‌ను కొనుగోలుకు వినియోగించినట్టు నాటకాలు వేస్తున్నట్టు తెలిపారు. వచ్చే రెండేళ్లలో దాదాపు వెయ్యికిపైగా కంపెనీలు నిధుల సేకరణ కోసం ఐపీఓలు జారీ చేయనున్నాయన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

యూకో బ్యాంక్ లాభం రూ.639 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని యూకో బ్యాంక్.. డిసెంబరు త్రైమాసికంలో రూ.7,406 కోట్ల ఆదాయంపై రూ.639 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.503 కోట్లతో పోల్చితే లాభం 27% పెరిగింది. వడ్డీ, వడ్డీయేతర ఆదాయాల్లో వృద్ధి ఇందుకు దోహదపడింది. ఇదే త్రైమాసికంలో నిర్వహణాపరమైన లాభం రూ.1,119 కోట్ల నుంచి రూ.1,586 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం రూ.6,220 కోట్లు కాగా నికర వడ్డీ ఆదాయం 20% పెరిగి రూ.2,378 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 3.17% ఉంది. ఆర్థిక సంవత్సరం మొత్తం మీద ఎన్ఐఎం 3-3.10% ఉండవచ్చని భావిస్తున్నట్టు బ్యాంక్ సీఈఓ, ఎండీ అశ్వనీ కుమార్ తెలిపారు.

హైదరాబాద్‌లో హెచ్‌సీఎల్ టెక్ విస్తరణ

5,000 సీట్ల సామర్థ్యంతో కొత్త సెంటర్ ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశీయ ఐటీ సేవల కంపెనీ హెచ్‌సీఎల్ టెక్.. హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరించింది. నగరంలోని హైటెక్ సిటీలో 5,000 మంది పనిచేయగలిగే సామర్థ్యంతో, 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో కూడిన కొత్త సెంటర్‌ను ప్రారంభించింది. ఈ కార్యాలయం ద్వారా హైటెక్, లైఫ్ సైన్సెస్, ఆర్థిక సేవలు సహా పలు రంగాలకు చెందిన అంతర్జాతీయ క్లయింట్లకు కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్, డిజిటల్ పరివర్తన పరిష్కారాలను అందించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. హెచ్‌సీఎల్ టెక్ 2007 నుంచి హైదరాబాద్‌లో కార్యకలాపాలు సాగిస్తోంది. కొత్త సెంటర్‌తో కలిపి నగరంలోని కంపెనీ కార్యాలయాలు ఐదుకు చేరుకోగా.. సీటింగ్ సామర్థ్యం 8,500కు పెరిగింది.

భాగ్యనగరిలో మెల్ట్‌వాటర్ ఏఐ హబ్

అంతర్జాతీయ మీడియా, సోషల్ అండ్ కన్స్యూమర్ ఇంటెలిజెన్స్ సంస్థ మెల్ట్‌వాటర్.. హైటెక్ సిటీలో ఎమర్జింగ్ ఏఐ హబ్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. భారత్‌లో కంపెనీకిది నాలుగో కార్యాలయం కానుంది. ఏఐలో రెండు దశాబ్దాల అనుభవం కలిగిన ఈ కంపెనీ.. రోజుకు 150 కోట్ల డిజిటల్ కంటెంట్‌ను విశ్లేషించి, ప్రపంచవ్యాప్తంగా తనకున్న 27,000 మంది కస్టమర్ల వ్యాపార వృద్ధికి అవసరమైన సమాచారంగా మలుస్తుంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	127	విజయవాడ	141
వరంగల్	127	గుంటూరు	137
కరీంనగర్	127	ఒంగోలు	137
మహబూబ్‌నగర్	127	చిత్తూరు	109
కర్నూలు	127	నెల్లూరు	114
విశాఖపట్నం	132		
గోదావరి	141	అనంతపురం	114

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	510
వరంగల్	482	గోదావరి	505
చిత్తూరు	503	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	81,250 ▲	74,520 ▲	1,04,000 ▲
విజయవాడ	82,000 ▲	77,500 ▲	93,000 ▼
విశాఖపట్నం	79,320 ▲	72,710 ▲	92,060 ▲
రాజమండ్రి	81,270 ▼	74,500 ▲	94,200 ▲
ప్రొద్దుటూరు	80,150 ▼	74,220 ▼	93,000 ▼
ముంబై	79,453 ▲	72,779 ▲	90,533 ▲

92% లోకలైజేషన్ సాధించాం



న్యూఢిల్లీ: కార్ల తయారీలో 92 శాతం లోకలైజేషన్ సాధించామని, 1,200 కీలక విడిభాగాలు దేశీయం గానే తయారుచేస్తున్నామని హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) ప్రకటించింది. విద్యుత్ వాహనాల బ్యాటరీ ప్యాక్‌లను కూడా దేశంలోనే తయారుచేస్తున్నట్టు వెల్లడించింది. మొబిస్ ఇండియా భాగస్వామ్యంతో తాము చెన్నై ప్లాంట్‌లో బ్యాటరీ ప్యాక్‌ల స్థానిక అసెంబ్లింగ్ చేపట్టినట్టు తెలిపింది. ఈ ప్లాంట్‌లో తయారైన బ్యాటరీ ప్యాక్‌తో మార్కెట్లోకి తెచ్చిన తొలి ఈవీ క్రెటా ఎలక్ట్రిక్ అని పేర్కొంది. ఈ స్థానికీకరణ చర్యల వల్ల 2019 నుంచి 67.2 కోట్ల డాలర్ల (రూ.5,678 కోట్లు) విదేశీ మారక ద్రవ్యం ఆదా అయినట్టు కంపెనీ తెలిపింది.

క్రెటా ఈవీ ధర రూ.17.99 లక్షలు: హెచ్ఎంఐఎల్ క్రెటా ఎలక్ట్రిక్ కారును మార్కెట్లోకి తెచ్చింది. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో విడుదల చేసిన ఈ కారు ధర రూ.17.99 లక్షలు. రెండు బ్యాటరీ ఆప్షన్లలో ఇది అందుబాటులో ఉంటుంది. ఒకసారి చార్జింగ్‌తో 51.3 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ కారు 473 కిలోమీటర్లు, 42 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ కారు 390 కిలోమీటర్లు ప్రయాణిస్తాయి.

లైటింగ్ వ్యాపారంలో ఏటా 20% వృద్ధి

విప్రో కన్స్యూమర్‌కేర్ అండ్ లైటింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్.. హైదరాబాద్‌లో మైవిప్రోవెర్స్ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌ను ఏర్పాటు చేసింది. ఈ షోరూమ్‌ను కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అనుజ్ ధిర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్క్ ప్లేసెస్, ఇతర పారిశ్రామిక విభాగాలకు అవసరమైన సరికొత్త స్మార్ట్ లైటింగ్, సీటింగ్ ఉత్పత్తులను ఇక్కడ అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. దేశంలో ఈ తరహా షోరూమ్‌ను ఏర్పాటు చేయటం ఇదే తొలిసారన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దేశంలో కొత్తగా 6-7 షోరూమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కంపెనీ లైటింగ్ వ్యాపారం రూ.1,000 కోట్లుగా ఉందని, ఇది ఏటా 15-20 శాతం వృద్ధి చెందుతూ వస్తోందని అనుజ్ తెలిపారు. కాగా మొత్తం వ్యాపారంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వాటా 15 శాతంగా ఉందన్నారు.

'బ్రాండ్ ఫైనాన్స్'లో భారత ఐటీ దిగ్గజాలు

ఎగుమతుల్లోనే కాదు.. బ్రాండ్ ఫైనాన్సింగ్‌లోనూ భారత ఐటీ కంపెనీలు దూసుకుపోతున్నాయి. బ్రాండ్ ఫైనాన్స్ రూపొందించిన అత్యంత విలువైన ఐటీ బ్రాండ్లలో ఆరు భారత ఐటీ కంపెనీలు టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, హెక్సావేర్ టెక్నాలజీలకు చోటు దక్కింది. ఈ జాబితాలో 40% బ్రాండ్ వాల్యూతో అమెరికా ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. భారత్ 36% బ్రాండ్ వాల్యూతో రెండో స్థానంలో నిలిచింది.

స్పోర్ట్స్

5 పరుగులకే 5 వికెట్లు

స్పిన్నర్ వైష్ణవి సూపర్ ఫీట్

- యువ భారత్‌కు రెండో విజయం
- 10 వికెట్లతో మలేసియా చిత్తు



అండర్-19 మహిళల టీ20 వరల్డ్‌కప్

కౌలాలంపూర్: అరంగేట్రం లెఫ్టామ్ స్పిన్నర్ వైష్ణవి శర్మ (5/5) హ్యాట్రిక్ సహా ఐదు వికెట్లతో విజృంభించడంతో.. అండర్-19 మహిళల టీ20 వరల్డ్ కప్‌లో భారత్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో భారత్ 10 వికెట్లతో ఆతిథ్య మలేసియాను చిత్తు చేసింది. మొదట మలేసియా 14.3 ఓవర్లలో 31 పరుగులకే కుప్పకూలింది. వైష్ణవితోపాటు ఆయుషి శుక్లా (3/8) వికెట్ల వేటను కొనసాగించడంతో.. మలేసియా బ్యాటర్ ఒక్కరు కూడా రెండంకెల స్కోరును అందుకోలేక పోయారు. మన బౌలర్లు వేసిన 10 వైడ్‌లతో కలిపి ఎక్స్‌ట్రాలే టాప్ స్కోర్ అంటే ఆధిపత్యం ఏవిధంగా సాగిందో అర్థం చేసుకోవాలి. పిచ్ నుంచి లభిస్తున్న టర్న్, బౌన్స్‌ను సద్వినియోగం చేసుకొన్న శర్మ.. కేవలం 5 పరుగులే ఇచ్చి 5 వికెట్లతో మలేసియా బ్యాటింగ్ వెన్నువిరిచింది. 14వ ఓవర్‌లో నూర్ అయిన్ బింటీ రోస్లాన్ (3), నూర్ ఇస్మా డానియా (0), సీటి నజ్వా (0)ను వరుసగా అవుట్ చేసిన వైష్ణవి ఆడిన తొలి మ్యాచ్‌లోనే హ్యాట్రిక్ నమోదు చేసింది. ఛేదనలో భారత్ 2.5 ఓవర్లలో 32/0 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్లు గొంగడి త్రిష (12 బంతుల్లో 5 ఫోర్లతో 27 నాటౌట్), కమలిని (4 నాటౌట్) 103 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించారు. మొత్తంగా మ్యాచ్ కేవలం 18 ఓవర్ల లోపలే ముగియడం విశేషం.

విండీస్‌పై లంక గెలుపు

వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 81 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత లంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 116 పరుగులు చేసింది. మాపేడి నను ఎక్కార (41), సంజన కవింది (39) రాణించారు. ఛేదనలో విండీస్ 19.4 ఓవర్లలో 85 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ సమార రామ్‌నాథ్ (24) టాప్ స్కోరర్. ఆడిన రెండు మ్యాచ్‌లూ నెగ్గిన భారత్, లంక చెరో 4 పాయింట్లతో సమంగా నిలిచినా.. మెరుగైన రన్‌రేట్‌తో భారత్ టాప్‌లో ఉంది. గురువారం జరిగే లీగ్ ఆఖరి మ్యాచ్‌లో లంకతో భారత్ తలపడనుంది.

'చాంపియన్స్' ముందు ధనాధన్ విందు

జోష్‌లో టీమిండియా
ఇంగ్లండ్‌తో తొలి టీ20 నేడు

రాత్రి 7 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో..



ప్రాక్టీస్‌లో తిలక్, సూర్య, కోచ్ గంభీర్

కోల్‌కతా: ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీ కోసం అందరూ ఎదురు చూస్తుండగా.. అంతకంటే ముందే భారత్-ఇంగ్లండ్ జట్లు ధనాధన్ పోరుతో అలరించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇరు జట్లలోనూ హిట్టర్లకు కొదువ లేకపోవడంతో ఈ ఐదు టీ20ల సిరీస్ ఫ్యాన్స్‌ను మురిపించడం ఖాయమే. ఈడెన్ గార్డెన్స్‌లో బుధవారం తొలి మ్యాచ్ జరుగనుంది. కోహ్లీ, రోహిత్‌లేకున్నా సూర్యకుమార్ నేతృత్వంలోని యువ భారత్ టీ20ల్లో అదరగొడుతోంది. అటు పర్యాటక ఇంగ్లండ్ కూడా యువకులతో నిండి ఉంది. ప్రస్తుత జట్టులోని 8 మంది ఆటగాళ్లకు భారత్‌లో టీ20 మ్యాచ్ ఆడిన అనుభవం లేదు.

అంచనాలను అందుకునేందుకు..: అభిమానులతో పాటు టీమ్ మేనేజ్‌మెంట్ దృష్టంతా ఇప్పుడు పేసర్ మహ్మద్ షమిపైనే ఉంది. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో విశేషంగా రాణించిన తను ఆ తర్వాత గాయంతో జట్టుకు దూరమయ్యాడు. సుదీర్ఘ విరామం తర్వాత కోలుకుని దేశవాళీల్లో మెరుగ్గా రాణించి సెలెక్టర్లను ఆకర్షించాడు. దీంతో ఇంగ్లండ్‌తో సిరీస్‌లతో పాటు చాంపియన్స్ ట్రోఫీకి కూడా ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో తాజా సిరీస్ అతడికి అత్యంత కీలకం కానుంది. ఏడాది తర్వాత తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతుండడంతో షమి మైదానంలో ఎలా రాణిస్తాడనేది తేలాల్సి ఉంది. బుమ్రా గాయంతో బాధపడుతున్న వేళ షమి అంచనాలకు తగ్గట్టు రాణించాల్సి ఉంది. అలాగే తను ఈ ఫార్మాట్‌లో 2022 టీ20 వరల్డ్‌కప్ సెమీస్‌లో చివరిసారి ఆడడం గమనార్హం. ఇక వైస్‌కెప్టెన్ హోదాలోనూ అక్షర్‌కిది తొలి మ్యాచ్ కానుంది. గతేడాది టీ20 మెగా టోర్నీలో తను ఆల్‌రౌండర్‌గా ఆకట్టుకున్నాడు. దక్షిణాఫ్రికాపై వరుసగా రెండు టీ20 సెంచరీలు బాదిన కీపర్ శాంసన్‌తో పాటు తిలక్ వర్మ కూడా భీకర ఫామ్‌లో ఉన్నాడు. ఆసీస్ గడ్డపై టెస్టు సెంచరీ బాదిన నితీశ్ కుమార్ తుది జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్నాడు. కెప్టెన్ సూర్య, రింకూ, హార్దిక్‌లతో కలిపి ఓవరాల్‌గా భారత బ్యాటింగ్ పటిష్ఠంగా కనిపిస్తోంది. అలాగే స్పిన్ త్రయం అక్షర్, వరుణ్, బిష్ణోయ్ ఇంగ్లండ్‌ను కట్టడి చేస్తే ఇక తిరుగే ఉండదు.

తొలిసారి మెకల్లమ్ శిక్షణలో..: పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో కోచ్ బ్రెండన్ మెకల్లమ్ ఆధ్వర్యంలో మొదటిసారి ఇంగ్లండ్ బరిలోకి దిగబోతోంది. టెస్టుల్లోనే బజ్‌బాల్ గేమ్‌తో ఆట స్వరూపాన్ని మార్చిన మెకల్లమ్ భారత్‌తో పొట్టి పోరుకు ఎలాంటి వ్యూహాలు రచిస్తాడనేది ఆసక్తికరంగా మారింది. ఇంగ్లండ్ తుది జట్టును ప్రకటించడంతో బెన్ డకెట్, ఫిల్ సాల్ట్ ఓపెనర్లుగా రానున్నారు. కేకేఆర్ మాజీ ఆటగాడైన సాల్ట్‌కు ఈడెన్ గ్రౌండ్‌పై చక్కటి అవగాహన ఉంది. టోప్లే, కర్రాన్, విల్ జాక్స్ జట్టులో లేకపోయినా 21 ఏళ్ల జాకబ్ బేథెల్‌పై జట్టు నమ్మకం పెట్టుకుంది. తను ఆడిన ఏడు టీ20ల్లో 57.66 సగటుతో ఉన్నాడు. ఇక షమి మాదిరిగానే గాయం నుంచి కోలుకున్న పేసర్ జోఫ్రా ఆర్చర్ రాణింపుపై పర్యాటక జట్టు దృష్టి సారించింది. మిడిలార్డర్‌లో కెప్టెన్ బట్లర్, బ్రూక్, లివింగ్‌స్టోన్ కీలకం కానున్నారు.



బట్లర్



ఏడాది విరామం తర్వాత బరిలోకి షమి

తుది జట్లు (అంచనా)

భారత్: శాంసన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్, రింకూ సింగ్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, మహ్మద్ షమి.

ఇంగ్లండ్: డకెట్, సాల్ట్, బట్లర్ (కెప్టెన్), బ్రూక్, లివింగ్‌స్టోన్, బేథెల్, ఒవర్టన్, అట్కిన్సన్, ఆర్చర్, ఆదిల్ రషీద్, మార్క్ ఉడ్.

పిచ్, వాతావరణం

గతేడాది ఈడెన్‌లో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌ల సగటు స్కోరు 198. ఎనిమిది సార్లు ఇక్కడ 200+ స్కోర్లు నమోదు కావడం విశేషం. నేటి మ్యాచ్‌లోనూ పరుగుల వరద పారడం ఖాయమే. మంచు ప్రభావం అధికం కావడంతో టాస్ నెగ్గిన జట్టు బౌలింగ్ తీసుకునే చాన్సుంది.

కుటుంబ సభ్యులు ఉండాల్సిందే..

ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్

కోల్‌కతా: విదేశీ పర్యటనల్లో క్రికెటర్ల వెంట కుటుంబ సభ్యులు ప్రయాణిస్తే వచ్చే నష్టమేమీ ఉండదని ఇంగ్లండ్ కెప్టెన్ జోస్ బట్లర్ అభిప్రాయపడ్డాడు. ఇటీవల బీసీసీఐ తమ ఆటగాళ్ల వెంట కుటుంబాలను తీసుకెళ్లడంపై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. తీరిక లేని షెడ్యూల్‌తో ఆటగాళ్లు తమ కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తోందని, ఈ నేపథ్యంలో వారి చెంత ఫ్యామిలీ ఉంటే మానసికంగా బలంగానూ ఉంటారని తెలిపాడు. కుటుంబ సభ్యులు ఆటపై ప్రభావం చూపుతారని తానైతే అనుకోవడం లేదని బట్లర్ స్పష్టం చేశాడు.

రెండో ర్యాంక్‌కు మంధాన

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్

దుబాయ్: ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన ఒక స్థానం మెరుగుపర్చుకొని రెండో ర్యాంక్‌కు చేరుకుంది. మంగళవారం ఐసీసీ విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి టాప్-10లో మంధానకు మాత్రమే చోటు దక్కింది. వోల్వార్ట్ (దక్షిణాఫ్రికా) టాప్‌లో ఉండగా, చమరి ఆటపట్టు (శ్రీలంక) తృతీయ స్థానం దక్కించుకుంది. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో దీప్తి శర్మ నాలుగో స్థానానికి చేరగా, 1, 2 స్థానాల్లో ఎకెల్‌స్టోన్ (ఇంగ్లండ్), గార్డ్‌నర్ (ఆస్ట్రేలియా) ఉన్నారు.

హరి గెలుపు.. అర్జున్ ఓటమి

విక్‌ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ మాస్టర్స్ విభాగంలో తెలుగు గ్రాండ్ మాస్టర్లు అర్జున్ ఇరిగేసి, పెంటేల హరికృష్ణకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. అర్జున్ ఓడగా.. హరికృష్ణ రెండో విజయాన్ని నమోదు చేశాడు. మంగళవారం జరిగిన నాలుగో రౌండ్‌లో అర్జున్‌పై వ్లాదిమిర్ ఫెడోసా (స్లొవేనియా) గెలిచాడు. వార్‌మెర్డమ్ (నెదర్లాండ్స్)తో గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన హరి.. 23 ఎత్తుల్లోనే ప్రత్యర్థి ఆటకట్టించాడు. సహచరుడు లియాన్ మెండోన్కాపై ప్రజ్ఞానంద గెలిచాడు. చాలెంజర్స్ విభాగంలో నోడెర్‌బెర్ యాకుబ్‌బొయేవ్ (ఉజ్బెకిస్థాన్)పై వైశాలి నెగ్గింది.

జొకో జోరు

- అల్కారజ్‌పై గెలుపుతో సెమీస్‌కు
- జ్వెరెవ్, సబలెంక, బడోసా కూడా..
- ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి గాఫ్ అవుట్



మెల్‌బోర్న్: కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ రికార్డు వేటలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్ ఆ దిశగా మరో అడుగేశాడు. కాలి నొప్పితో ఇబ్బంది పడుతున్నా, అద్భుతంగా పోరాడిన జొకో.. టైటిల్ ఫేవరెట్, మూడో సీడ్ కార్లోస్ అల్కారజ్‌ను ఓడించి ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌కు దూసుకెళ్లాడు. మెల్‌బోర్న్‌లో 11వ టైటిల్‌కు రెండడుగుల దూరంలో నిలిచాడు. మహిళల డిఫెండింగ్ చాంప్ అర్యానా సబలెంక, రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ కూడా ఫైనల్-4లోకి అడుగుపెట్టారు. మంగళవారం మూడున్నర గంటలకుపైగా జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఏడో సీడ్ జొకో 4-6, 6-4, 6-3, 6-4తో అల్కారజ్‌పై గెలిచి, 12వ సారి ఈ టోర్నీ సెమీస్‌లోకి అడుగుపెట్టాడు. మరో క్వార్టర్స్‌లో జ్వెరెవ్ 7-6(1), 7-6(0), 2-6, 6-1తో 12వ సీడ్ టామీ పాల్‌పై చెమటోడ్చి నెగ్గాడు. శుక్రవారం జరిగే సెమీస్‌లో జొకోతో టామీ పాల్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

సబలెంక కష్టంగా..: మహిళల టాప్ సీడ్ సబలెంక 6-2, 2-6, 6-3తో అనస్టాసియా పవ్లుచెన్‌కొవా (రష్యా)పై పోరాడి గెలిచింది. మరో మ్యాచ్‌లో మూడో సీడ్ కొకొ గాఫ్ (అమెరికా) 5-7, 4-6తో పౌలా బడోసా (స్పెయిన్) చేతిలో ఓడింది. గురువారం జరిగే సెమీస్‌లో సబలెంకతో బడోసా తలపడనుంది. కాగా మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బోపన్న జంట పోరాటం ముగిసింది. క్వార్టర్స్‌లో బోపన్న-జాంగ్ షువై (చైనా) జోడీ 6-2, 4-6, 9-11తో జాన్ పీర్స్-ఒలీవియా గడెకీ జంట చేతిలో పరాజయం పాలైంది.

సాత్విక్ జోడీ శుభారంభం

'ఇండోనేసియా మాస్టర్స్'లో శ్రీకాంత్‌కు నిరాశ

జకార్తా: సొంతగడ్డపై ఇండియా ఓపెన్‌లో నిరాశ పరిచిన భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి ఇండోనేసియా మాస్టర్స్‌లో శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన డబుల్స్ మ్యాచ్‌లో సాత్విక్/చిరాగ్ జంట 21-16, 21-15తో చైనీస్ తైపీ జోడీ చెన్ జీ/లిన్ యుపై గెలిచి రెండోరౌండ్ చేరింది. మహిళల డబుల్స్‌లో భారత ద్వయం అశ్వినీ పొన్నప్ప/తనీషా క్యాస్ట్రో 21-6, 21-14తో థాయ్‌లాండ్ జోడీ ఒర్నిచా/సుకితాపై నెగ్గి రెండో రౌండ్లో ప్రవేశించింది. పురుషుల సింగిల్స్‌లో మాజీ ప్రపంచ నెంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ క్వాలిఫయింగ్ రౌండ్లోనే వెనుదిరిగాడు. భారత్‌కే చెందిన ఆయుష్ శెట్టి 21-7, 21-15తో శ్రీకాంత్‌ను చిత్తుచేసి మెయిన్ డ్రాకు చేరాడు. మహిళల సింగిల్స్‌లో తాన్యా హేమంత్ మెయిన్ డ్రాకు అర్హత సాధించింది.

మా జెర్సీలపై పాక్ పేరు వద్దు

బీసీసీఐ



న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీ లో మరో వివాదం చోటు చేసుకుంది. ఈ మెగా టోర్నీకి ఆతిథ్యమిస్తున్న పాకిస్థాన్ పేరును తమ జెర్సీలపై ముద్రించడంపై భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈమేరకు ఐసీసీకి విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. సాధారణంగా ఐసీసీ టోర్నీలు జరిగే సమయంలో ఆ టోర్నీ పేరుతోపాటు, నిర్వహించే దేశం పేరు కూడా ఆయా జట్ల జెర్సీలపై ముద్రించడం పరిపాటి. అయితే క్రికెట్‌లో రాజకీయాల్ని చొప్పించేందుకు బీసీసీఐ ప్రయత్నిస్తోందని పాక్ క్రికెట్ బోర్డు ఆగ్రహం వ్యక్తం చేసింది.

జేఎన్‌టీయూ స్నాతకోత్సవ నోటిఫికేషన్!

» మార్చిలో నిర్వహించాలని నిర్ణయం

హైదరాబాద్ సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ 13వ స్నాతకోత్సవానికి వర్సిటీ ఉన్నతాధికారులు ఎట్టకేలకు నోటిఫికేషన్ జారీ చేశారు. మార్చి మొదటి లేదా రెండో వారంలో ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఏర్పాట్లను ప్రారంభించారు. 2023-24 విద్యా సంవత్సరంలో జేఎన్‌టీయూ అనుబంధ, అఫిలియేటెడ్ కళాశాలల్లో యూజీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన సుమారు 83 వేల మంది విద్యార్థులతో పాటు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ) పూర్తి చేసిన సుమారు 120 మంది డిగ్రీ పట్టాల కోసం గత నవంబరు నుంచి ఎదురు చూస్తున్నారు. స్నాతకోత్సవంలో వర్సిటీ చాన్సలర్ అయిన రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా పట్టాలను ప్రదానం చేయనున్నారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన అభ్యర్థులు ఒరిజినల్ డిగ్రీ(ఒడీ)ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఇందుకోసం రూ.1000 రుసుం చెల్లించాలని వర్సిటీ అధికారులు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌లో స్టూడెంట్ సర్వీసెస్ పోర్టల్‌ను లేదా క్యాంపస్‌లోని పరీక్షల విభాగాన్ని(స్టూడెంట్ సెక్షన్) సంప్రదించవచ్చన్నారు. కాగా, గౌరవ డాక్టరేట్‌కు గతంలో ఎక్కువగా విద్యావేత్తలు, శాస్త్రవేత్తలనే ఎంపిక చేయగా, ఈ దఫా దేశానికి వన్నె తెచ్చిన క్రీడాకారులు, కళాకారులను ఎంపిక చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

బ్యాంకింగ్ ఉద్యోగాల కోర్సులకు ఉచిత కోచింగ్

హైదరాబాద్ సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ వంటి బ్యాంకింగ్ ఉద్యోగాల భర్తీ పరీక్షల ఫౌండేషన్ కోర్సులకు ఉచిత కోచింగ్ అందించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జీ.ఆశన్న వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు వచ్చేనెల 9వ తేదీలోపు www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో రూ.1.50లక్షల లోపు, పట్టణ ప్రాంతాలలో రూ.2లక్షల్లోపు ఉన్నవారే ఉచిత కోచింగ్‌కు అర్హులు. రిజర్వేషన్ విధానం, ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక విధానం ఉంటుందని, ఫిబ్రవరి 12 నుంచి 14వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన చేపడతామని చెప్పారు. మరిన్ని వివరాలకు 040-24071178 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ, జనవరి21 (ఆంధ్రజ్యోతి): మైనారిటీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా అల్ప సంఖ్యాక సంక్షేమ అధికారి మొహమ్మద్ ఇలియాస్ తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి గానూ హైదరాబాద్ జిల్లాలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ 40 పాఠశాలలు, 40 జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం జనరల్ కోర్సులు, ఒకేషనల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను కోరుతున్నట్లు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 6, 7, 8 తరగతులలో బ్యాక్ లాగ్ ఖాళీల భర్తీకి మైనారిటీల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు tmreistelangana.cgg.gov.in వెబ్‌సైట్‌లో వచ్చేనెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఇన్‌సర్వీస్ వైద్యులకు పీజీలో స్పాట్ రిజిస్ట్రేషన్

» రేపు మధ్యాహ్నం 2 గం.ల వరకే చాన్స్: హెల్త్ వర్సిటీ

హైదరాబాద్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పీజీ వైద్య విద్యలో ఇన్‌సర్వీస్ కోటాలో మిగిలిపోయిన కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హులైన అభ్యర్థులు గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల మధ్య స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించింది. అదే సమయంలో అభ్యర్థులు ధ్రువపత్రాలనూ పరిశీలిస్తామని వెల్లడించింది. తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఇన్ సర్వీస్ కోటా కింద సుమారు 330 పీజీ సీట్లున్నాయి. అయితే ఈ కోటాలో ఈ ఏడాది 17 మందికే అర్హత లభించింది. ఎంబీబీఎస్ పూర్తి చేసి ప్రభుత్వ వైద్యులుగా చేరి, గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే డాకర్లకు పీజీ వైద్యవిద్యలో సీట్లు కల్పించేందుకు పెట్టిందే ఇన్ సర్వీస్ కోటా. గిరిజన ప్రాంతాల్లో వరుసగా మూడేళ్లు, గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లు పనిచేసిన వారికి ఈ కోటాలో ప్రాధాన్యమిస్తారు.

వర్సిటీల అవసరాలపై ప్రభుత్వానికి నివేదిక!

హైదరాబాద్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కానికి తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా.. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి.. ఆయా వర్సిటీల వీసీలు, అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వారు చర్చించారు. వర్సిటీల్లో ఖాళీగా ఉన్న సుమారు 2,060 ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అలాగే వర్సిటీలకు నిధుల విడుదలలో సమస్యలు ఉండడంతో నిధులను అందుబాటులోకి తేవాలని ప్రతిపాదించారు. ఈ మేరకు నివేదిక రూపొందించాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రిని కలిసి ఆ నివేదిక అందించాలని భావిస్తున్నారు.

కానిస్టేబుళ్ల నియామకాల కేసు మళ్లీ వాయిదా

న్యూఢిల్లీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీసు కానిస్టేబుళ్ల నియామకాలకు సంబంధించిన కేసు సుప్రీంకోర్టులో మరోసారి వాయిదా పడింది. ఆ కేసును మూడు వారాల తర్వాత విచారిస్తామని మంగళవారం సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దీనికి సంబంధించిన పిటిషన్ జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ ఎస్.వి.ఎన్. భట్టిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. దీనిపై మూడు వారాల తర్వాత వాదనలు వింటామని తెలిపింది. ఫిబ్రవరి 18న కేసు మరోసారి విచారణకు వచ్చే అవకాశముంది.

డిస్కమ్‌లకు రూ.2 వేల కోట్ల సాయం

హైదరాబాద్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): డిస్కమ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా సాయాన్ని అందించింది. రాష్ట్రంలో వ్యవసాయ వినియోగం గణనీయంగా పెరుగుతుండటంతో విద్యుత్ కొనుగోళ్ల కోసం, రానున్న వేసవి కార్యాచరణ కోసం రూ.2 వేల కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మంగళవారం జీవో జారీ చేశారు.

కాంగ్రెస్ హయాంలో క్రైమ్ సిటీగా హైదరాబాద్

» సమస్యల సుడిగుండంలో మహానగరం

» రేవంత్‌కు పాలన చేతకాదని ప్రజలకు అర్థమైంది

» నగర అభివృద్ధిని గాలికి వదిలేశారు: కేటీఆర్



హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నిర్లక్ష్యపు పాలనతో హైదరాబాద్ సుడిగుండంలో చిక్కుకుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సేఫ్ సిటీ.. కాస్తా క్రైమ్ సిటీగా మారిందని ఆరోపించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో తలసాని నివాసంలో కేటీఆర్ మంగళవారం సమావేశమయ్యారు. నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో కంచెలు వేసి కాపాడిన ప్రభుత్వ పార్కులకు కాంగ్రెస్ పాలనలో రక్షణ లేకుండా పోయిందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి పాలన చేతకాదనే నిజాన్ని హైదరాబాద్ వాసులు అర్థం చేసుకున్నారని చెప్పారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కట్టడాలు, నిర్మాణాల నిర్వహణ కూడా కాంగ్రెస్ సర్కారుకు చేతకావడం లేదన్నారు. ప్రభుత్వానికి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కాపాడాలన్న సోయి లేకపోవడం దురదృష్టకరమని వాపోయారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీ కూడా హైదరాబాద్‌లో అమలుకావడం లేదని ఆరోపించారు. గ్రామసభలు, వార్డుసభల పేరిట సర్కారు ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. హైదరాబాద్ అభివృద్ధిని గాలికొదిలేసిన సర్కారుకు నగర ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

అదనపు అప్పులకు కేంద్రం ససేమిరా

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలనుకుంటున్న రూ.2,500కోట్ల అప్పునకు కేంద్రం అనుమతి ఇస్తుందా అన్నది సందేహంగా మారింది. దీనికీ అనుమతి రాకపోతే.. ఈ నెలలో రూ.7000కోట్ల అప్పునకు కోత పడినట్లే. అనుమతి లేకపోయినా.. రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్సాహంతో ఎక్కువ మొత్తం అప్పు కోసం ఇండెంట్లు పెట్టినట్లు తెలుస్తోంది. కేంద్ర, ఆర్‌బీఐ అనుమతించబోవని తెలిసినా.. చివరి త్రైమాసికంలో రూ.30 వేల కోట్ల అప్పు కోసం ఆర్‌బీఐకి ప్రతిపాదనలు పంపించింది.

రూ.49,255 కోట్లకే కేంద్రం అనుమతి

ప్రస్తుత 2024-25ఆర్థిక సంవత్సరంలో రూ.62,012 కోట్ల అప్పు తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదించింది. ఆర్‌బీఐ వేలం ద్వారా బహిరంగ మార్కెట్ రుణాల(ఓఎంబీ) కింద రూ.57,112 కోట్లు, కేంద్రం నుంచి రూ.3,900 కోట్లు, ఇతర రుణాల కింద రూ.1000 కోట్లు సేకరించాలని బడ్జెట్‌లో పొందుపర్చింది. కాగా, కేంద్రం రూ.49,255.41 కోట్ల మేర బహిరంగ మార్కెట్ రుణాలు తీసుకోవడానికి మాత్రమే అనుమతించింది. ఇందులో నవంబరు నాటికి రాష్ట్రప్రభుత్వం రూ.37,850 కోట్ల(76.84%) అప్పు తీసుకుంది. డిసెంబరులో తీసుకున్న రూ.3,909 కోటను కూడా కలుపుకొంటే.. ఇప్పటివరకు తీసుకున్న రుణం రూ.41,759 కోట్లకు చేరింది. అంటే.. కేంద్రం అనుమతించిన అప్పులో ఇంకా రూ.7,500 కోట్ల వరకు రుణాలు ప్రస్తుత చివరి త్రైమాసికంలో (జనవరి, ఫిబ్రవరి, మార్చిల్లో) తీసుకునే అవకాశం ఉంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం ఈ చివరి త్రైమాసికంలో ఏకంగా రూ.30 వేల కోట్ల అప్పు (నెలకు రూ.10వేల కోట్ల చొప్పున) తీసుకుంటామంటూ ఆర్‌బీఐకి ఇండెంట్లు పెట్టింది. వీటి కోసం అటు కేంద్రం నుంచిగానీ, ఇటు ఆర్‌బీఐ నుంచిగానీ ముందస్తు అనుమతి తీసుకోలేదు. జనవరి 7న రూ.3000 కోట్లు, 14న రూ.2000 కోట్లు, 21న రూ.2,500 కోట్లు, 28న రూ.2,500 కోట్ల చొప్పున రుణాలు తీసుకుంటామంటూ ఇండెంట్లను ప్రతిపాదించింది. అయితే, జనవరి 7న రూ.3000 కోట్ల అప్పును మాత్రం తీసుకోగలిగింది. సాధారణంగా ఆర్‌బీఐ వేలంలో పాల్గొనే తేదీ కంటే ఐదు రోజులు ముందుగానే ఇండెంటు పెట్టాలి. దీనికి ఆర్‌బీఐ, కేంద్రం అనుమతించాల్సి ఉంటుంది. అలాగైతేనే అప్పుల వేలంపాటలో పాల్గొనే అవకాశం లభిస్తుంది. అయితే.. కేంద్రం, ఆర్‌బీఐ నుంచి అనుమతులు రాకపోవడంతో ఈనెల 14న తీసుకోవాలనుకున్న రూ.2000 కోట్లు, 21న తీసుకోవాలనుకున్న రూ.2,500 కోట్ల అప్పులకు ఇండెంట్లు పెట్టలేకపోయింది. దీంతో వేలం పాటలో పాల్గొనే అవకాశం దొరకలేదు. ఫలితంగా రూ.4,500 కోట్ల అప్పునకు కోత పడినట్లే. ఇక, ఈ నెల 28న తీసుకోవాలనుకుంటున్న రూ.2,500 కోట్ల అప్పునకు కేంద్రం, ఆర్‌బీఐ అనుమతిస్తుందా అన్నదీ అనుమానమే. దీనికి కూడా అనుమతించకపోతే.. ఈ నెలలో తీసుకోవాలనుకున్న రూ.10 వేల కోట్ల అప్పులో రూ.7000 కోట్ల అప్పునకు కోత పడినట్లవుతుంది. చేతికందితే మాత్రం రూ.5,500 కోట్ల అప్పు లభించినట్లవుతుంది.

కృష్ణా జలాలను తరలించొద్దు

ప్రతీ చుక్కనూ టెలీమెట్రీ కేంద్రాలతో లెక్కించాలి.. వాటి ఏర్పాటుకు అయ్యే వ్యయం భరిస్తాం

» కేఆర్ఎంబీని కోరిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలను ఇతర బేసిన్లకు తరలించడాన్ని అడ్డుకోవాలని, ప్రతి చుక్కను పక్కాగా లెక్కించడానికి టెలిమెట్రీలు ఏర్పాటు చేయాలని కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)ను రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేసింది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీతోపాటు బనకచర్ల తదితర ప్రాంతాల్లో 11 టెలిమెట్రీలు పెట్టాలని, దానికి అయ్యే వ్యయాన్ని భరించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపింది. మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో కేఆర్ఎంబీ బోర్డు ఛైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన బోర్డు సమావేశం జరిగింది. తెలంగాణ నుంచి నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జా, ఈఎన్‌సీ (జనరల్) జీ అనిల్‌కుమార్, అంతరాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ (సీఈ) మోహన్‌కుమార్ హాజరుకాగా.. ఏపీ నుంచి ఈఎన్‌సీ (ఇరిగేషన్) ఎం. వెంకటేశ్వరరావు తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రం తరఫున రాహుల్ బొజ్జా వాదనలు వినిపిస్తూ.. చెన్నైకి తాగునీటి సరఫరా కోసం తెలుగుగంగ పథకంలో భాగంగా శ్రీశైలం నుంచి నీటి తరలింపునకు అప్పట్లో అనుమతించారని గుర్తు చేశారు. సాగునీటి అవసరాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నీటిని వినియోగించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ, శ్రీశైలం నుంచి ప్రస్తుతం 200కుపైగా టీఎంసీల కృష్ణా జలాలను ఇతర బేసిన్లకు తరలిస్తున్నారని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం కృష్ణా జలాలను 66%ఏపీ, 34% తెలంగాణ పంచుకోవడానికి తాత్కాలిక ఒప్పందం కుదిరిందని, అది ఒక్క ఏడాదికోసమే జరిగిందని రాహుల్ బొజ్జా పేర్కొన్నారు. కృష్ణాలో 71% నీటి కేటాయింపులు తెలంగాణకు చేయాలని జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ వద్ద వాదనలు వినిపిస్తున్నామని, అది తేలేదాకా, 50:50 శాతం నిష్పత్తితో తెలంగాణ, ఏపీలకు నీటి కేటాయింపులు జరపాలని కోరారు. దీనికి బోర్డు ఛైర్మన్ అతుల్ జైన్ స్పందిస్తూ.. నీటి పంపకాల బాధ్యత అపెక్స్ కౌన్సిల్‌ది కాదంటూ కేంద్ర జలశక్తి శాఖ సమాచారం ఇచ్చిందని తెలిపారు. ట్రైబ్యునల్ తేల్చేదాకా నీళ్లను పరస్పర అంగీకారంతో పంచుకోవాల్సి ఉంటుందన్నారు. దీనిపై త్రిసభ్య కమిటీలో (బోర్డు మెంబర్ కన్వీనర్, తెలంగాణ, ఏపీ ఈఎన్‌సీలు సభ్యులు) చర్చించి నిర్ణయం తీసుకుందామని అతుల్ జైన్ ప్రతిపాదించగా తెలంగాణ, ఏపీ అధికారులు అంగీకరించారు.



జలసౌధలో కృష్ణానది యాజమాన్య బోర్డు సమావేశం, హాజరైన తెలుగు రాష్ట్రాల అధికారులు

సాగర్‌ను పూర్తిగా అప్పగించండి

శ్రీశైలం, సాగర్‌లలోని మొత్తం 11 కాంపోనెంట్ల వద్ద టెలిమెట్రీ కేంద్రాలు పెట్టాలని, దీనికి అవసరమయ్యే నిధులు ఇవ్వడానికి సిద్ధమని రాహుల్ బొజ్జా పేర్కొన్నారు. గోదావరి-బనకచర్ల అనుసంధానం వివరాలు అందించాలని బోర్డును కోరారు. నాగార్జునసాగర్‌పై 2024 నవంబరు 29వ తేదీకి ముందున్న పరిస్థితిని పునరుద్ధరించి, ప్రాజెక్టును పూర్తిగా తెలంగాణకు అప్పగించాలని డిమాండ్ చేశారు. నీటి వాటాలు తేలేదాకా సాగర్, శ్రీశైలంసహా ఏ కాంపోనెంట్‌ను అప్పగించే ప్రసక్తే లేదని బోర్డు సమావేశంలో స్పష్టం చేశారు.

శ్రీశైలం ప్లంజ్‌పూల్ మరమ్మతులు చేపట్టండి

బోర్డు సమావేశం అనంతరం రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) జి. అనిల్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. 2009 వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న శ్రీశైలం ప్లంజ్‌పూల్‌నకు (స్పిల్ వే గేట్ల నుంచి నీరు కిందికి పడే ప్రదేశం) తక్షణమే మరమ్మతులు చేయాలని ఏపీని కోరామని తెలిపారు. నాగార్జునసాగర్ నిర్వహణను పూర్తిగా తమకే అప్పగించాలని కోరగా.. రెండు నెలల పరిశీలన అనంతరం ఏ వివాదాలు ఉత్పన్నం కాకుంటే అప్పగించడానికి సిద్ధమేనని ఏపీ సుముఖత వ్యక్తం చేసిందన్నారు. కాగా, ఏపీ ఈఎన్‌సీ (ఇరిగేషన్) ఎం. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కృష్ణా బేసిన్‌లో నీటి వినియోగానికి బచావత్ ట్రైబ్యునల్ రక్షణ కల్పించిందని, ఆ మేరకు కృష్ణా జలాల్లో 66% ఏపీకి, 34%తెలంగాణకు పంచాలన్నారు.



దేశీయంగా బొగ్గు ఉత్పత్తి పెరగాలి

» కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

» ముగిసిన బొగ్గు, గనుల శాఖ మంత్రుల జాతీయ సదస్సు

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఉత్పత్తితోపాటు ఇతర రంగాల్లో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా దేశీయంగా బొగ్గు ఉత్పత్తిని పెంచాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచించారు. ఒడిశాలోని కోణార్క్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన 3వ బొగ్గు, గనుల శాఖ మంత్రుల జాతీయ సమావేశం మంగళవారం ముగిసింది. ఈ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పలు కీలక అంశాలపై మాట్లాడారు. గనుల్లో కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. బొగ్గు ఉత్పత్తి పెంచడం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు తదితర అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వాల సహకారం కోరారు. అంతర్జాతీయంగా వినియోగిస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకోవడంపైనా రాష్ట్రాలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల మంత్రులు.. తమ ప్రాంతాల్లో అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను వివరించారు. అనంతరం డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ప్రదర్శనను కేంద్ర మంత్రి సందర్శించారు. స్వయం సహాయక బృందాల ద్వారా తయారైన ఉత్పత్తులను పరిశీలించారు. భువనేశ్వర్‌లో మహానది కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ పనితీరును కిషన్ రెడ్డి సమీక్షించారు.

కాంగ్రెస్ ప్రభుత్వానిది ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాలనే

ఏడాది పాలన పెద్ద ఫెయిల్యూర్

ప్రజలు ఉద్యమించక ముందే కళ్లు తెరవండి

మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు



హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలన కాదని, ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాలన అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. 'మంగళవారం నుంచి పలు పథకాలపై నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సభల్లో ప్రజల నుంచి వ్యతిరేకత వస్తున్నది. మీ సోకాల్డ్ ప్రజాపాలనపై ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో ఇప్పటికైనా అర్థమైందా?' అని ఆయన ఎక్స్ (ట్విటర్)లో ప్రశ్నించారు. ఊరూరా తిరగబడుతున్న జనం, ఎక్కడికక్కడ నిలదీస్తున్న ప్రజానీకాన్ని చూస్తే మీ ఏడాది పాలన పెద్ద ఫెయిల్యూర్ అని అర్థమవుతున్నదని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహారా నడుమ గ్రామసభలు నిర్వహించాల్సిన దుస్థితి రావడం దారుణమని, లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఒకవైపు గ్రామ సభలు నిర్వహిస్తుంటే, మరోవైపు కార్యకర్తలకే పథకాలు ఇస్తామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు. 'ప్రశ్నించే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయించి.. అరెస్టులు చేసి నోళ్లు మూయించాలని చూస్తున్నారు. ఇప్పుడు యావత్ తెలంగాణ ఏకమై మీ దుర్మార్గ పాలనను నిలదీస్తోంది.. అడుగడుగునా ప్రశ్నిస్తోంది. ఇప్పుడు వారిపై ఎన్నికేసులు పెడతారు. ఎంతమందిని అరెస్టులు చేస్తారు' అని ప్రశ్నించారు. అందరికీ సంక్షేమ పథకాలిస్తామని ఇప్పుడు భారీగా కోతలు విధిస్తే ప్రజలు తిరగబడకుండా ఏం చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ రాక్షస పాలనలో విసిగి, వేశారి పోయిన ప్రజలు ఉప్పెనగా ఉద్యమించక ముందే కళ్లు తెరవాలని సూచించారు.

సీఎం, మంత్రి చెప్పింది అబద్ధం

కృష్ణాజలాల వాటాకు సంబంధించి గత ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ సహా ఆ పార్టీ నేతలు చెప్పింది.. పచ్చి అబద్ధమని తెలంగాణ నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెల్లడించిన సమాచారంతో తేటతెల్లమైందని హరీశ్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఒప్పుకున్న 34-66 శాతం ఒకే సంవత్సరానికి అని, పరివాహక ప్రాంతం ప్రకారం తెలంగాణకు 71 శాతం నీటి కేటాయింపులు జరగాలని కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా ట్రైబ్యునల్‌ను కోరిందని స్పష్టం చేయడం విమర్శలు చేస్తున్న వారి నోళ్ళు మూయించే సమాధానమన్నారు. నీటివాటాలు తేల్చే వరకు 50-50 శాతం కేటాయించాలని 2015లో తెలంగాణ ప్రభుత్వం కోరినట్లు కృష్ణాబోర్డు ముందు తేల్చడం వంటివి దాచేస్తే దాగని సత్యాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లో సెక్షన్ 89 పెట్టి, రాష్ట్రాల బదులు.. ప్రాజెక్టుల ఆధారంగా నీటి పంపిణీ జరిగేలా చేసింది.. కృష్ణా, గోదావరి బోర్డును ఏర్పాటు చేసి తెలంగాణకు అన్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీనే అని ధ్వజమెత్తారు.

జూరాల.. నీళ్లు ఎలా?



జూరాల ప్రాజెక్టు క్రస్టు గేట్ల వద్ద నీళ్ల లీకేజీ

» ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు

» 4 టీఎంసీల మేర పేరుకుపోయిన పూడిక

» మిగిలిన సామర్థ్యం మేరకైనా నీటిని నిల్వ చేసుకోలేని పరిస్థితి

మహబూబ్‌నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పంటల సాగుకు అత్యంత కీలకమైన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు లక్ష్యం నెరవేరడం లేదు. కృష్ణానది తెలుగు రాష్ట్రాల్లోకి ప్రవేశించిన తర్వాత ఉన్న తొలి ప్రాజెక్టు ఇదే అయినప్పటికీ దీని కింది ఆయకట్టుకు నీరివ్వలేని పరిస్థితి నెలకొంది. ప్రాజెక్టుకు ప్రతీఏట వందలాది టీఎంసీల వరద వచ్చినా రెండు పంటలకు నీరివ్వలేక క్రాప్ హాలిడేలు, వారబందీలను అమలు చేస్తున్నారు. ప్రాజెక్టులో దాదాపు 4టీఎంసీల సామర్థ్యం మేర పూడిక పేరుకుపోవడం, బురద నీళ్లు పోగా సాగు, తాగునీటి అవసరాలకు వాడుకోగలిగిన నీటి నిల్వ సామర్థ్యాన్ని అధికారులు సరిగా అంచనా వేయకపోవడంతో వరద అంతా సముద్రం పాలవుతోంది. ఈ ఏడాది జూరాల ప్రాజెక్టుకు 1,122 టీఎంసీల వరద వచ్చింది. ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి ఆయకట్టు 1.04 లక్షల ఎకరాలు. ప్రతీ ఏటా వరద ప్రారంభమైన వెంటనే జూరాల ప్రాజెక్టు నిండు కుండలా మారుతోంది. అయితే ప్రాజెక్టు ఎగువన మొత్తం నల్లరేగడి నేలలు కావడంతో బురద మట్టి కొట్టుకువచ్చి ప్రాజెక్టులో భారీగా పేరుకుపోతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 6.96 టీఎంసీల నీరు ఉండగా ఇందులో వాడుకోగలిగిన నీళ్ల(లైవ్ స్టోరేజీ) 3.262 టీఎంసీలు మాత్రమే. ఈ నేపథ్యంలో ఈ ఏడాది యాసంగిలో వారబందీ ప్రకారం మొత్తం ఆయకట్టుకు కాకుండా కేవలం 35 వేల ఎకరాలకు నీరివ్వాలని నీరుపారుదల సలహా బోర్డు(ఐఏబీ) నిర్ణయించింది. ఆ మేరకు నీరివ్వాలన్నా కనీసం 3.5 టీఎంసీల లైవ్ స్టోరేజీ ఉండాలి. లైవ్ స్టోరేజీలో మిషన్ భగీరథకు కూడా నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది.

కర్ణాటక నుంచి సీపేజీ అంతంతే

సాధారణంగా వరద వచ్చే రోజుల్లో సాధ్యమైనన్ని నీళ్లను రిజర్వాయర్‌లో నిల్వ చేయాలి. వరద ఆగిపోయిన తర్వాత ఎగువ నుంచి వచ్చే సీపేజీ వాటర్‌పై ఆధారపడతారు. కానీ ఎగువన ఉన్న కర్ణాటకలో కొన్నేళ్లుగా సీపేజీ వాటర్ అనుకున్న స్థాయిలో రావడం లేదు. కర్ణాటక రోడ్ కం బ్యారేజీలు నిర్మించుకోవడమే ఇందుకు ప్రధాన కారణం. అలాగే ఎగువన ఉన్న నారాయణపూర్ రిజర్వాయర్ పరిధిలో కూడా వారబందీ అమలు చేస్తుండటం వల్ల దిగువకు ఇన్‌ఫ్లో ఆశించిన స్థాయిలో లేదు. ప్రస్తుతం సగటున 700 క్యూసెక్కులకు మించి ఇన్‌ఫ్లో రావడంలేదు. ఇటీవల ఉమ్మడి జిల్లా సమీక్ష సందర్భంగా మక్తల్, గద్వాల ఎమ్మెల్యేలు ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహను.. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నందున నారాయణపూర్ నుంచి 5 టీఎంసీల నీటిని విడుదల చేసేలా ఒప్పించాలని అభ్యర్థించారు. గత ఏడాది కూడా ఇలాగే జూరాల పరిధిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తగా 1.90 టీఎంసీలను నారాయణపూర్ నుంచి విడుదల చేయించారు.

ఎత్తిపోతలకు ఇబ్బందే

జూరాల ప్రాజెక్టు ప్రధాన ఆయకట్టుతో పాటు రాజీవ్ భీమా 1, 2, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలు కూడా దీని ఆధారంగా నడుస్తున్నాయి. అలాగే మిషన్ భగీరథ పథకాలకు కూడా ఇక్కడి నుంచే నీటిని తీసుకోవాలి. ఎగువ నుంచి సీపేజీ నీళ్లు రాకపోవడంతో ప్రధాన ఆయకట్టుకే ఇబ్బందిగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో భవిష్యత్తులో ఎత్తిపోతల పథకాలు ప్రశ్నార్థకం కానున్నాయి.

రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర సహకారం

» రైతులకు 30 వేల కోట్ల సబ్సిడీ

» ఎరువుల కొరత లేకుండా చేశాం

» పార్టీలకు అతీతంగా కలిసి పనిచేస్తాం

» కేంద్ర మంత్రి బండి సంజయ్



బెజ్జంకి/హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. మంగళవారం ఆయన సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో వ్యవసాయ సహకార సంఘ కార్యాలయం, ఏసీ ఫంక్షన్ హాల్, వాణిజ్య భవన సముదాయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని రైతులకు ఎరువులపై రూ.30 వేల కోట్ల రాయితీ అందించిదని తెలిపారు. రాష్ట్రంలోని 30 లక్షల మంది రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రతి ఏటా వారి ఖాతాల్లో రూ.6 వేల చొప్పున జమ చేస్తోందని చెప్పారు. రైతులు యూరియా బస్తాల కోసం చెప్పులు లైన్‌లో పెట్టి ఎదురుచూసే పనిలేకుండా కేంద్ర ప్రభుత్వం రామగుండంలో ఎరువుల పరిశ్రమ ఏర్పాటు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు వివిధ పథకాల కింద నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఏ పార్టీ అయినా ఓట్లు వేసింది ప్రజలేనని, ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి ఎలాంటి భేషజాలు లేకుండా పనిచేస్తామని చెప్పారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో పార్టీలకు అతీతంగా అందరం కలిసే ఉంటామని, కొట్లాడుకునే జమానా పోయిందన్నారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు రాక మాజీ సర్పంచులు ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం బిల్లులను విడుదల చేసి వారిని ఆదుకోవాలని ఆయన కోరారు.

24న కరీంనగర్‌కు కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్

కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ఈ నెల 24న కరీంనగర్‌లో పర్యటించనున్నారు. దేశంలోనే తొలిసారిగా 4 వేల ఇళ్లకు నిరంతరం తాగునీరు అందించే పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టనున్న ఈ పథకం కరీంనగర్ హౌసింగ్ బోర్డు ప్రాంతవాసులకు అందుబాటులోకి రానుంది. ఇంత పెద్దసంఖ్యలో నివాసాలకు 24 గంటలపాటు నిరంతరం తాగునీరు అందించే సౌకర్యం దేశంలో ఎక్కడా లేదు.

ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు స్వల్ప గుండెపోటు

డెహ్రాడూన్ పర్యటనలో ఉండగా అస్వస్థత

అక్కడి ఆస్పత్రిలో స్టెంట్ వేసిన వైద్యులు



బౌద్ధనగర్/ సికింద్రాబాద్, జనవరి21(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పనుల మీద డెహ్రాడూన్ వెళ్లిన సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ గుండెపోటుకు గురయ్యారు. హైదరాబాద్ నుంచి శనివారం మధ్యాహ్నం డెహ్రాడూన్ వెళ్లిన పద్మారావు గౌడ్‌కు ఆదివారం ఉదయం ఎడమ ఛాతీలో నొప్పితో బాధపడ్డారు. దీంతో వెంట ఉన్నవారు ఆయన్ను వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పద్మారావుగౌడ్ స్వల్ప గుండెపోటుకు గురయ్యారని గుర్తించి వెంటనే ఓ స్టెంట్ వేశారు. పద్మారావు గౌడ్ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉంది. కాగా, పద్మారావుగౌడ్ అస్వస్థత విషయం తెలిసిన వెంటనే ఆయన కుమారులు తీగుళ్ల కిషోర్‌గౌడ్, తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్, పలువురు బీఆర్ఎస్ నేతలు డెహ్రాడూన్ వెళ్లారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన పద్మారావుగౌడ్ సికింద్రాబాద్‌లోని తన నివాసానికి మంగళవారం రాత్రి చేరుకున్నారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పద్మారావుగౌడ్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

సంక్షేమ పథకాలలో తెలంగాణ ఆదర్శం

» స్పీకర్ ప్రసాద్‌కుమార్



హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పన, వాటిని చట్టాలుగా ఆమోదించడంలో తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఆదర్శం(మోడల్)గా ఉందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. భారత రాజ్యాంగ విలువలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేస్తోందన్నారు. పట్నాలో మంగళవారం ప్రారంభమైన అఖిల భారత ప్రిసైడింగ్ అధికారుల సదస్సులో తెలంగాణ నుంచి స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బండ ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణలో మెజారిటీ ప్రజలకు సంబంధించిన వ్యవసాయం, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు, సామాజిక పథకాలు, మౌలిక వసతుల కల్పన వంటి కీలక అంశాలకు తెలంగాణ శాసనసభ ప్రాముఖ్యతనిచ్చిందన్నారు. రైతుల భూ వివరాలకు ఉపయోగపడే భూ భారతి చట్టం, యువతకు సంబంధించిన 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' వంటి చట్టాల రూపకల్పన ద్వారా తెలంగాణ శాసనసభ మెజారిటీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తోందన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు

» గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోండి: భట్టి



హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. గతంలో ఈ పథకాలకు దరఖాస్తు చేసుకోనివారు ఇప్పుడు గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మంగళవారం ప్రారంభమైన గ్రామసభలపై సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం, తుమ్మల, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి, సీతక్క, సీఎస్ శాంతికుమారి కూడా సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు దాదాపు రూ.40 వేల కోట్లు ఖర్చవుతాయని తెలిపారు. రాష్ట్రంలో పదేళ్ల తర్వాత రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నందున వీటి కోసం అత్యధికంగా దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని చెప్పారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధి: పొన్నం

రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల్లో లబ్ధి చేకూరుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా ఇచ్చారు. మంగళవారం నుంచి ప్రారంభమైన గ్రామ, వార్డు సభల్లో అధికారుల వద్దకు వెళ్లి రేషన్ కార్డులు రాని వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

కేటీఆర్‌తో ఒక్క నేత కార్మికుడి జీవితమూ మారలేదు: ఆది శ్రీనివాస్

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్వయం సహాయక గ్రూపుల మహిళలకు రెండు చొప్పున చీరలు ఇవ్వనున్న ప్రభుత్వం.. వాటి తయారీ ఆర్డర్‌ను సిరిసిల్ల పవర్ లూమ్‌కు అప్పగించిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చెప్పారు. సీఎల్పీ మీడియా హాల్లో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నేతన్నలకు అండగా ఉంటామన్న హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకున్నారన్నారు. ఈ ఆర్డర్ ఫలితంగా 8 నెలల పాటు పవర్‌లూమ్ కార్మికులకు పని దొరకనుందన్నారు. గత ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తిపడి బతుకమ్మ చీరలను కిలోల లెక్కన సూరత్ నుంచి తెచ్చుకుందన్నారు. పదేళ్లు మంత్రిగా ఉన్న కేటీఆర్.. సిరిసిల్ల ప్రాంతానికి ఒక్క నూలు డిపో కూడా తేలేకపోయాడన్నారు. ఆయన వల్ల సిరిసిల్లలో ఒక్క నేత కార్మికుడి జీవితమూ మారలేదన్నారు. 90 శాతం సబ్సిడీతో కార్మికులకు నూలు సరఫరా చేస్తున్న ప్రభుత్వానికి కేటీఆర్ ధన్యవాదాలు చెప్పాలన్నారు.

ఈటల పార్టీ మారగానే పునీతుడయ్యాడా?

» మత్స్య కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భూ కబ్జాలకు పాల్పడి బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన ఈటల రాజేందర్.. పార్టీ మారగానే పునీతుడైపోయాడా అంటూ మత్స్య కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ విమర్శించారు. గాంధీభవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈటల ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు.. సచివాలయాన్ని కమీషన్లకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చేశాడని ఆరోపించారు. సాయంత్రం కాగానే సచివాలయంలో కమీషన్ల దుకాణం మొదలు పెట్టేవాడని, కమీషన్లు ఇవ్వకపోతే బిల్లులు ఆపేసేవాడన్నారు.

అటవీ భూముల్లో 50వేల సౌర విద్యుత్ పంపుసెట్లు

» ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అటవీ హక్కుల రక్షణ చట్టం (ఆర్‌వోఎఫ్ఆర్) ద్వారా పట్టాలు పొందిన భూముల్లో తొలి విడతలో 50 వేల సౌర విద్యుత్ పంపుసెట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామని ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా తెలిపారు. సచివాలయంలో దక్షిణ డిస్కమ్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, గిరిజన సంక్షేమ కమిషనర్ శరత్, అదనపు పీసీసీఎఫ్ సునీతా భగవత్, తెలంగాణ రెడ్‌కో వీసీ ఎండీ వి.అనిలతో కలిసి మంగళవారం సమీక్ష జరిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌వోఎఫ్ఆర్ కింద వ్యవసాయ భూముల్లో 2.5 లక్షల సౌర విద్యుత్ పంపుసెట్లు అవసరం అవుతాయని సుల్తానియా తెలిపారు. కేంద్ర పునరుద్ధరణీయ ఇంధన మంత్రిత్వశాఖ శాఖ పీఎం కుసుమ్ పథకం కింద లక్ష సౌర విద్యుత్ పంపుసెట్లను రాష్ట్రానికి మంజూరు చేసిందని, ఆ పథకాన్ని వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పంపులు ఏర్పాటు చేయడానికి ఏమేరకు నిధులు అవసరమో సమగ్ర సర్వే చేయాలని ఆదేశించారు. సచివాలయంలో పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, సెర్ప్ సీఈవో దివ్య, దక్షిణ డిస్కమ్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీతో పాటు స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) జీఎంలతో ఆయన మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. s

రెండు రోజుల్లో వర్క్ ఆర్డర్లు

మహిళా సంఘాల ద్వారా సౌరవిద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు రెండు రోజుల్లో వర్క్‌ఆర్డర్లు ఇవ్వాలని ప్రభుత్వ విభాగాలు నిర్ణయించాయి. ఈమేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ ఆర్థికశాఖ అధికారులతో కలిసి మంగళవారం సచివాలయంలో బ్యాంకర్లతో చర్చలు జరిపారు.

వర్గీకరణను అడ్డుకుంటోంది కొందరు మాల నేతలే: కృష్ణమాదిగ

పంజాగుట్ట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో సాధారణంగా రెడ్ల ఆధిపత్యం ఉంటుందని, అలాంటిదిప్పుడు ఆ పార్టీలో మాల సామాజిక వర్గానిదే ఆధిపత్యం అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. తెలంగాణలో వెంకటస్వామి కుటుంబంలో ముగ్గురు పదవులు అనుభవిస్తున్నారని, ఆర్థికంగా, రాజకీయంగా, శక్తిమంతులైన వారు వర్గీకరణకు అడ్డుపడుతున్నారని ఆయన ఆరోపించారు. రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో మంగళవారం ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా రెడ్ల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ, కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా, పార్టీలు, వర్గీకరణపై వేసిన కమిషన్లు వర్గీకరణను కోరుకుంటుంటే, మాల సామాజిక వర్గంలోని కొందరు నేతలు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. అగ్రకులాలలో పాటు అన్ని కులాల్లోని పేదల కోసం తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని, వారికి తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తనకు ఎన్నో పార్టీలు రాజకీయంగా అవకాశాలు ఇచ్చినా తాను ఎలాంటి పదవులను స్వీకరించలేదని చెప్పారు. ఫిబ్రవరి 7న నిర్వహించనున్న లక్ష డప్పులు, వెయ్యి గొంతుల సభకు పెద్ద సంఖ్యలో మాదిగలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

కిడ్నీ రాకెట్ గుట్టు రట్టు!

» ఇతర రాష్ట్రాల రోగులకు కిడ్నీ మార్పిడి
» సరూర్‌నగర్‌లోని అలకనంద ఆస్పత్రిలో సర్జరీలు
» ఆస్పత్రిని సీజ్ చేసిన వైద్యాధికారులు

హైదరాబాద్/దిల్‌సుఖ్‌నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సాధారణ శస్త్రచికిత్సలకు అనుమతులు తీసుకొని, గుట్టుచప్పుడు కాకుండా కిడ్నీ మార్పిడి చేస్తున్న ఆస్పత్రి గుట్టురట్టయింది. ఆరు నెలల క్రితం ఆస్పత్రిని ప్రారంభించిన వైద్యులు ఇతర రాష్ట్రాల రోగులను, కిడ్నీ దాతలను నగరానికి రప్పించి నిబంధనలకు విరుద్ధంగా కిడ్నీ మార్పిడి చేస్తున్న వైనం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డాక్టర్స్ కాలనీలో ఉన్న అలకనంద మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో ఈ దందా జరుగుతోంది. అలకనంద ఆస్పత్రిలో జనరల్ ఫిజీషియన్, సాధారణ శస్త్రచికిత్సల నిర్వహణకు సుమంత్ గట్టుపల్లి.. రంగారెడ్డి జిల్లా వైద్యశాఖ నుంచి అనుమతి తీసుకున్నారు. జూలై 2024లో 9 పడకలతో హాస్పిటల్‌ను ప్రారంభించారు. కానీ, ఆస్పత్రి నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు చేస్తూ డబ్బు దండుకుంటున్నారు. అలకనంద ఆస్పత్రిలో కిడ్నీల దందా కొనసాగుతోందని మంగళవారం రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు అందింది. వెంటనే ఆయన వైద్యాధికారులు, పోలీసులతో కలిసి ఆస్పత్రికి చేరుకున్నారు.



రోగులను గాంధీ ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు, వైద్యసిబ్బంది

పోలీసులను చూసిన వైద్యులు పరారయ్యారు. తమిళనాడుకు చెందిన నస్రీనా బాను, ఫిర్దోజ్ బేగం నుంచి కిడ్నీలు తీసుకొని కర్ణాటకకు చెందిన బీఎస్ రాజశేఖర్, కృపాలతకు ఈ నెల 17న అమర్చినట్లు తేలింది. ఆ నలుగుర్ని మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి నిర్వాహకుడు సుమంత్‌ను అరెస్ట్ చేశారు. కిడ్నీ మార్పిడి చేసి, పరారైన వైద్యుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన ఆస్పత్రిని సీజ్ చేసినట్లు డీఎంహెచ్‌వో చెప్పారు.

కిడ్నీ రాకెట్‌పై మంత్రి దామోదర ఆరా

కిడ్నీ మార్పిడి రాకెట్‌పై మంత్రి దామోదర రాజనర్సింహ ఆరా తీశారు. ఇందులో ప్రమేయం ఉన్న వైద్యులు, ఆస్పత్రి యాజమాన్యాన్ని ఉపేక్షించొద్దని, కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

యూనీలీవర్‌తో బోణీ

(మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్ వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలు, నైపుణ్యమున్న మానవ వనరులు, ప్రభుత్వ ప్రోత్సాహాలను తెలిపారు. దక్షిణ భారత దేశంలోని అన్ని రాష్ట్రాలకూ తెలంగాణ వారధిగా ఉంటుందని, అనుకూల వాతావరణంతోపాటు తూర్పు, పడమరన ఉన్న మిగతా రాష్ట్రాలకు ముఖ ద్వారంగా ఉంటుందని అన్నారు. తెలంగాణలో వినియోగ వస్తువులకు భారీ మార్కెట్ ఉందని, సులభతర వ్యాపార విధానాలు అదనపు బలమని చెప్పారు. తెలంగాణ రైజింగ్ 2050 విజన్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న భవిష్యత్తు ప్రణాళిక ప్రపంచంలో అత్యుత్తమంగా అందరినీ ఆకర్షిస్తోందన్నారు. దాంతో, తెలంగాణలో వ్యాపారాల విస్తరణకు, కొత్త యూనిట్ ఏర్పాటుకు యూనీ లీవర్ ముందుకొచ్చింది. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎంవో ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, పెట్టుబడుల ప్రోత్సాహ విభాగం ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.



యూనీలీవర్ సీఈవో హెయిన్ షుమాకర్‌ను సన్మానిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, చిత్రంలో శ్రీధర్‌బాబు

స్కైరూట్ రూ.500 కోట్ల పెట్టుబడులు

తెలంగాణలో ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని ప్రైవేటు రంగంలో తొలి అంతరిక్ష ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించిన స్కైరూట్ కంపెనీ ప్రకటించింది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఈ కంపెనీ వ్యవస్థాపకుడు పవన్ కుమార్ చందన దావోస్‌లో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నారు. ఒప్పందం ప్రకారం.. తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ మరియు టెస్టింగ్ యూనిట్‌ను స్కైరూట్ ఏర్పాటు చేస్తుంది. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు రూ.500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ ఒప్పందంపై సీఎం రేవంత్ ఆనందం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు చెందిన సంస్థ అత్యాధునిక సాంకేతిక రంగంలో విజయం సాధించటం గర్వంగా ఉందన్నారు. స్కైరూట్‌తో ప్రభుత్వ భాగస్వామ్యం అంతరిక్ష రంగంపై తమ వ్యూహాత్మక దృష్టిని చాటిచెబుతుందన్నారు. త్వరలోనే హైదరాబాద్‌ను ప్రైవేట్ రంగ అంతరిక్ష కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా అభివృద్ధి చేస్తామన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం తమకు సంతోషంగా ఉందని స్కైరూట్ సహ వ్యవస్థాపకుడు పవన్ కుమార్ చందన అన్నారు. తెలంగాణ రైజింగ్, హైదరాబాద్ రైజింగ్ లక్ష్య సాధనలో భాగం పంచుకుంటామన్నారు.

పారిశ్రామికవేత్తలతో చర్చలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సదస్సులో వివిధ కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో సమావేశమైంది. కృత్రిమ మేధ (ఏఐ)తో కూడిన ఉత్పత్తుల్లో ప్రపంచ ఖ్యాతిగాంచిన కాలిఫోర్నియా కేంద్రంగా ఉన్న సాంబానోవా కంపెనీ చీఫ్ గ్రోత్ ఆఫీసర్ సూలేతో చర్చలు జరిపారు. ప్రధానంగా తెలంగాణలో సెమీ కండక్టర్ పరిశ్రమలకు సంబంధించిన పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. కంపెనీతో చర్చలు సానుకూలంగా ముగిశాయని, త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని అధికారవర్గాలు తెలిపాయి.

దేశానికి మార్గదర్శకంగా తెలంగాణ: మంత్రి శ్రీధర్‌బాబు

ప్రపంచ ఆర్థిక సదస్సు సమావేశాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. టెక్నాలజీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్ ప్రపంచస్థాయిలో ఖ్యాతి గడించిందని, ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న టీకాల్లో దాదాపు 70 శాతం హైదరాబాద్‌లోనే తయారవుతున్నాయని వెల్లడించారు. దేశంలోనే తలసరి ఆదాయంలో నంబర్-1గా ఉందన్నారు. ప్రభుత్వ పథకాల్లో అత్యాధునిక టెక్నాలజీ వినియోగం, సంక్షేమ పథకాల్లో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. ప్రత్యామ్నాయ ఇంధన తయారీ పరిశ్రమలు, ఆహారశుద్ధి రంగాల్లో పెట్టుబడులతోపాటు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా నైపుణ్య శిక్షణపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. అంతకుముందు సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర ఆహారశుద్ధి శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ ప్రారంభించారు.

మెఘా రూ.15 వేల కోట్ల పెట్టుబడులు

తెలంగాణ ప్రభుత్వంతో మెఘా ఇంజనీరింగ్ కంపెనీ 3 కీలక ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్రంలో 2,160 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ఇంధన ఉత్పత్తి ప్రాజెక్ట్ ఏర్పాటుకు పరస్పర అవగాహన ఒప్పందం (ఎంవోయూ)పై సంతకాలు చేసింది. దావోస్ సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో మెఘా కంపెనీ ఎండీ పీవీ కృష్ణారెడ్డి ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ప్రాజెక్టుపై దాదాపు రూ.11 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. నిర్మాణ దశలో దాదాపు వెయ్యి మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత మరో 250 మందికి అదనంగా ఉద్యోగాలు లభిస్తాయి. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025 లక్ష్య సాధనలో పాలుపంచుకునేందుకు ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు మెఘా కంపెనీ అధినేత ప్రకటించారు. అలాగే, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ ప్రాజెక్టు ఏర్పాటుకు మెఘా మరో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా తెలంగాణ అంతటా అత్యాధునిక బ్యాటరీ ఎనర్జీ సిస్టమ్ ప్రాజెక్టును స్థాపించనుంది. ఎంపిక చేసిన ప్రదేశాల్లో 100 ఎంవీహెచ్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తుంది. ఇందుకు రూ.3000 కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చింది. దీంతో, రెండేండ్లలో 1000 మందికి ప్రత్యక్షంగా, 3000 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. ఇక, పర్యాటక రంగంలోనూ పెట్టుబడులకు మెఘా ముందుకొచ్చింది. అనంతగిరిలో ప్రపంచస్థాయి లగ్జరీ వెల్నెస్ రిసార్ట్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన మౌలిక సదుపాయాల సంస్థ భాగస్వామ్యంతో రూ.1000 కోట్ల పెట్టుబడి పెడుతుంది. నిర్మాణ దశలోనే దాదాపు రెండు వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తుంది.

ఆగ్రోస్ భూములను పరిరక్షిస్తాం

» అన్యాక్రాంతం అయ్యాయన్నది అవాస్తవ ప్రచారం: చైర్మన్ బాలరాజు
» సంస్థ భూములపై సర్వే: ఎండీ రాములు

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆగ్రోస్ సంస్థకు చెందిన భూములను పరిరక్షిస్తామని, అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించామని సంస్థ చైర్మన్ కాసుల బాలరాజు తెలిపారు. ఆగ్రోస్ భూములు అన్యాక్రాంతం అయ్యాయని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. మంగళవారం ఆగ్రోస్ ఎండీ రాములుతో కలిసి హైదరాబాద్ పరిధిలో ఉన్న ఆగ్రోస్ భూములను ఆయన పరిశీలించారు. అనంతరం బాలరాజు మీడియాతో మాట్లాడుతూ.. ఆగ్రోస్ సంస్థకు రాష్ట్రవ్యాప్తంగా 590 ఎకరాల భూమి ఉందని, బెల్లంపల్లిలో 543 ఎకరాలు, మౌలాలిలో 23 ఎకరాలు, చింతల్‌లో 10 ఎకరాల భూమి ఉందని, మిగిలిన భూమి మరికొన్నిచోట్ల ఉందని తెలిపారు. వీటిలో మౌలాలిలో ఉన్న భూమిలో 3 ఎకరాలు కబ్జాకు గురైందని, అదీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలోనే జరిగిందని చెప్పారు. దానిపైనే ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేశామని వెల్లడించారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న పలు భూములను లీజుకు ఇవ్వగా, వాటిని కొంతమంది వినియోగించడం లేదని, మరికొంతమంది లీజు అద్దె చెల్లించడంలేదన్నారు. వారందరికీ నోటీసులు జారీ చేశామని, త్వరలోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఎండీ రాములు మాట్లాడుతూ.. సంస్థ పరిధిలోని భూములను సర్వే చేయిస్తున్నామని, ఆ తరువాత భూములను అభివృద్ధి చేసి వివిధ అవసరాలకు వినియోగించుకునేందుకు వీలుగా కసరత్తు చేపట్టినట్టు తెలిపారు. ఆగ్రోస్ పరిధిలోని భూములన్నీ భద్రంగానే ఉన్నాయని, అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు.

నన్ను క్షమించండి

» మహిళా కమిషన్‌ను లిఖిత పూర్వకంగా కోరిన వేణుస్వామి

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మహిళా కమిషన్‌కు వివాదాస్పద జ్యోతిష్కుడు వేణుస్వామి క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో చైర్‌పర్సన్ నేరేళ్ల శారదకు లిఖితపూర్వకంగా క్షమాపణ లేఖను అందించారు. తన వ్యాఖ్యల వల్ల బాధపడినవారికి క్షమాపణ చెబుతున్నానని, మరోసారి ఇలాంటిది జరగదని వేణుస్వామి పేర్కొన్నారు. తెలుగు చిత్రపరిశ్రమకు చెందిన నటీనటుల వ్యక్తిగత జీవితాలపై గతంలో వేణుస్వామి పలు వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలపై పలువురు మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తమ ఎదుట హాజరవ్వాలంటూ కమిషన్ ఆయనకు నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులను వేణుస్వామి హైకోర్టులో సవాల్ చేశారు. కమిషన్ ఎదుట వేణుస్వామి బదులు అతని న్యాయవాదుల బృందం హాజరైంది. మరోవైపు, మహిళా కమిషన్ ఎదుట స్వయంగా హాజరై వివరణ ఇవ్వాల్సిందేనని హైకోర్టు వేణుస్వామిని ఇటీవల ఆదేశించింది. దీంతో ఆయన మహిళా కమిషన్ కార్యాలయానికి వెళ్లి చైర్‌పర్సన్‌కు లిఖిత పూర్వకంగా క్షమాపణలు చెప్పారు.

రియల్టర్ అనుచరుడిపై ఎంపీ ఈటల దాడి

(మొదటిపేజీ తరువాయి)

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోచారం మునిసిపల్ పరిధిలోని కొర్రెముల ఏకశిలానగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్లాట్ల బాధితుల తరఫున ఎంపీ ఈటల రాజేందర్ మంగళవారం స్థల పరిశీలనకు వెళ్లారు. ఆ సమయంలో వెంచర్‌లోనే ఉన్న సదరు రియల్ వ్యాపారి అనుచరులను గమనించిన బాధితులు.. తమను ఇబ్బందులకు గురి చేస్తున్నది వారేనంటూ ఎంపీకి చూపించారు. దీంతో ఈటల ఆవేశంతో వేగంగా వెళ్లి రియల్ వ్యాపారి అనుచరుడు రఫీక్ చెంప చెళ్లుమనిపించారు. వెంటనే ఈటల చుట్టూ ఉన్న ఆయన అనుచరులు కూడా ఆగ్రహంతో రఫీక్‌తోపాటు మరో వ్యక్తి గ్యార ఉపేందర్‌పైనా దాడి చేశారు. ఈ దాడిలో రఫీక్, ఉపేందర్‌లకు గాయాలయ్యాయి. రఫీక్‌కు తీవ్ర గాయాలు కావడంతో అతడు గాంధీ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. కాగా, తమపై దాడికి పాల్పడ్డ ఎంపీ ఈటల రాజేందర్, ఆయన అనుచరులపై రియల్ ఎస్టేట్ వ్యాపారి అనుచరుడు గ్యార ఉపేందర్.. పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈటలతోపాటు మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, కాలనీ వాసులు శివారెడ్డి, జుబేర్ అక్రమ్, మరో 20 మంది కలిసి తమపై విచక్షణా రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎంపీ ఈటల రాజేందర్‌పై ఫిర్యాదు అందిందని మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి ధ్రువీకరించారు.



దాడిలో గాయపడ్డ రఫీక్

ధర్మాన్ని కాపాడేందుకే: ఈటల రాజేందర్

ఏకశిలానగర్ ఘటనపై ఎంపీ ఈటల రాజేందర్ స్పందిస్తూ.. తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ ఎవరిపైనా చేయి చేసుకోలేదన్నారు. కానీ, ఈ వ్యవస్థను చూసి తట్టుకోలేక.. ప్రజల ఓట్లతో గెలిచిన బిడ్డగా పేదల పక్షాన నిలబడి ధర్మాన్ని కాపాడాటానికే ఈ విధంగా ప్రవర్తించాల్సి వచ్చిందని తెలిపారు. 'ఎంపీ వచ్చి ఏం పీకుతాడు?' అని వారు అన్నట్లు తనకు తెలిసిందని, వారికి ఇచ్చిన 'పనిష్మెంట్'ను తాను తప్పుగా భావించడం లేదని అన్నారు. అన్యాయానికి అండగా ఉన్న పోలీసులు, రెవెన్యూ అధికారులు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. ఏకశిలానగర్‌లో దౌర్జన్యాలపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. సమస్యను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి, నవీన్ మిత్తల్‌కు, కలెక్టర్‌కు, సీపీకి లేఖ రాస్తానన్నారు. వారు స్పందించి ప్రజల ఆస్తులను కాపాడాలని డిమాండ్ చేశారు.

కాళేశ్వరం రుణాలను సర్కారే చెల్లిస్తుంది

» ఆ మేరకు కార్పొరేషన్‌కు పూచీకత్తు ఇచ్చింది
» ఈ ఏడాది 6,519 కోట్ల వడ్డీ, 7,382 కోట్ల అసలు చెల్లించాం
» ఆదాయం పెరగడానికి కొంత సమయం పడుతుంది
» జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వివరణ



రామకృష్ణారావు

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కార్పొరేషన్ తీసుకున్న రుణాలకు ప్రభుత్వం పూచీకత్తు ఇచ్చిందని, అందువల్ల.. వడ్డీతో సహా ఆర్థిక శాఖ తిరిగి చెల్లింపులు చేస్తుందని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వడ్డీల రూపంలో రూ.6,519 కోట్లు, అసలు కింద రూ.7,382 కోట్లు చెల్లించామని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణ అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట మంగళవారం ఆయన హాజరయ్యారు. క్రాస్ ఎగ్జామినేషన్‌లో భాగంగా.. ఆదాయం లేకపోయినా కాళేశ్వరం కార్పొరేషన్‌కు ఏవిధంగా రుణాలు తీసుకున్నారు!? ఆదాయం లేకుండా రుణాలను తిరిగి చెల్లించడం ఎలా సాధ్యం? అన్న ప్రశ్నలకు ఆయన పైవిధంగా జవాబిచ్చారు. అవసరమైన నిధుల సమీకరణకే కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ (కేఐపీసీఎల్) ఏర్పాటైందని, బయటి రుణాలతోపాటు రాష్ట్ర బడ్జెట్ నిధులతో ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని వివరించారు. రుణాల సమీకరణ బాధ్యత కాళేశ్వరం కార్పొరేషన్‌దేనని, ఈ విషయమై ప్రభుత్వం, కేఐపీసీఎల్ మధ్య అవగాహన కుదిరిందని చెప్పారు. కాళేశ్వరం కార్పొరేషన్‌కు తగిన రీతిలో ఆదాయ వ్యవస్థ ఉండేలా చర్యలు తీసుకోవాలని 2016 అక్టోబరు 6న జీవో 145 జారీ చేశారా? అని కమిషన్ ప్రశ్నించగా.. ఔనని బదులిచ్చారు. మరి.. ఆదాయం ఎక్కడి నుంచి వస్తుందని ప్రశ్నించగా.. పారిశ్రామిక అవసరాలకు నీటి కేటాయింపులతో రూ.7 కోట్ల ఆదాయం వచ్చిందని, ఆదాయం పెరగడానికి కొంత సమయం పడుతుందని తెలిపారు. అన్ని సంవత్సరాలకు సంబంధించి కాళేశ్వరం కార్పొరేషన్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్‌లను తయారు చేసిందా? వాటిని మీరు పరిశీలించారా? అని ప్రశ్నించగా.. తనకు సమాచారం లేదని రామకృష్ణారావు బదులిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం 2021-22లో తీసుకున్న రూ.35,257 కోట్ల బడ్జెటేతర రుణాలను బడ్జెట్ ప్రతిపాదనల్లో చూపారని, కానీ, 2022-23లో రూ.9,596 కోట్లు, 2023-24లో రూ.2,545 కోట్ల బడ్జెటేతర రుణాలను ఎందుకు చూపలేదని కమిషన్ ప్రశ్నించింది. దాంతో.. ప్రభుత్వ గ్యారెంటీలతో తీసుకున్న బడ్జెటేతర రుణాలన్నింటినీ తెలపాలని అప్పట్లో కేంద్రం కోరిందని, ఆ రుణాలను బడ్జెట్ ప్రతిపాదనల్లో చూపితే రాష్ట్ర రుణ పరిమితికి కేంద్రం కోతలు విధించే అవకాశం ఉందని, అందుకే వాటిని చూపలేదని రామకృష్ణారావు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రుణాలను 9-10.5 శాతం వార్షిక వడ్డీలతో తీసుకున్నారని, ఆ భారాన్ని తగ్గించడానికి ఏమైనా చర్యలు తీసుకున్నారా? అని ప్రశ్నించగా.. గత ప్రభుత్వంలో అలాంటి ప్రయత్నం జరగలేదని, ఈ ప్రభుత్వం వచ్చాక చేస్తున్నామని తెలిపారు.

నేడు వి.ప్రకాష్ విచారణ

కాళేశ్వరం ప్రాజెక్టును సంపూర్ణంగా సమర్థిస్తూ అఫిడవిట్ దాఖలు చేసిన తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వి.ప్రకాష్‌ను బుధవారం కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేయనుంది.

బ్యారేజీల నిర్మాణ పనుల్లో తీవ్ర ఉల్లంఘనలు

బ్యారేజీల నిర్మాణం టర్న్‌కీ పద్ధతిలో కట్టాలని జీవో 145 పేర్కొంటుండగా, ప్రభుత్వం తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడిందని కమిషన్ తప్పుబట్టింది. దాంతో, జీవోలో అలా పేర్కొన్నప్పటికీ.. ప్రాజెక్టులో మాత్రం ఒక్కో పనిని ప్రత్యేకంగా (పీస్ రేటు విధానం)లో కట్టారని రామకృష్ణారావు తెలియజేశారు. 2015లో జారీ చేసిన ఓ జీవో ప్రకారం ఏర్పాటు చేసిన కోర్ కమిటీ తరచూ మీతో సమావేశమై ప్రాజెక్టు పురోగతిని వివరించిందా? అని కమిషన్ అడగగా, కమిటీలోని ఇంజనీర్లు తనను కలిసి, ప్రాజెక్టు నిర్మాణ పురోగతిని వివరించి బిల్లులకు నిధులను కోరేవారని బదులిచ్చారు. ఆ సమావేశాల మినిట్స్ ఏమయ్యాయని కమిషన్ మళ్లీ ప్రశ్నించగా, వాటికి రికార్డులు ఏమీ లేవని తెలిపారు. అలాగే, ఆర్థిక శాఖకు ఫైళ్లను పంపించకుండానే అనేక పనులు చేశారా? అని ప్రశ్నించగా.. ఆ విషయం తన దృష్టికి రాలేదని జవాబిచ్చారు.

లైంగికదాడి కేసుల్లో పరిహారం ఎంత వసూలు చేయాలి?

- 4లోగా జవాబివ్వాలని కేంద్రానికి హైకోర్టు ఆదేశం
- దోషి ఆస్తిలో సగం చెల్లించాలని కె.ఎ.పాల్ పిటిషన్

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): లైంగిక దాడి కేసుల్లో దోషులు నుంచి పరిహారం ఏ మేరకు వసూలు చేయాలో తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని హైకోర్టు మరోసారి ఆదేశించింది. ఆస్తిలో సగభాగం బాధిత మహిళలకు ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ. పాల్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై వివరణ ఇవ్వాలని సూచించింది. కౌంటర్ దాఖలు చేయాలని ఇప్పటికే ఆదేశించామని, చివరి అవకాశంగా ఫిబ్రవరి 4వరకు గడువు ఇస్తున్నామని స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ రాధారాణి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది.

మహిళా రైతుకు పోలీసు రక్షణ కల్పించాలి

రంగారెడ్డి జిల్లా మాడ్గులకు చెందిన మహిళా రైతు సునీతకుపోలీసు రక్షణ కల్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. సర్వే నంబర్ 392 సహా ఇతర నంబర్లలో ఉన్న 17.05 ఎకరాల భూమిపై తనకు అనుకూలంగా కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ వ్యవసాయం చేసే పరిస్థితి లేదని, ప్రాణభయం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించకపోవడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి పిటిషనర్‌కు రక్షణ కల్పించాలంటూ రాచకొండ పోలీస్ కమిషనర్‌కు ఆదేశాలు జారీచేశారు. తదుపరి విచారణ ఫిబ్రవరి 18కి వాయిదా పడింది.

లగచర్ల కేసులో మరో నలుగురికి బెయిల్

లగచర్లలో భూసేకరణ విచారణకు వెళ్లిన ప్రభుత్వాధికారులపై దాడికి సంబంధించిన కేసులో జైల్లో ఉన్న రైతులు రమేశ్, గోపాల్ నాయక్, మధారయ్య, మంగ్యానాయక్‌ను బెయిల్‌పై విడుదల చేయాలని హైకోర్టు ఆదేశించింది. రూ.25 వేల మొత్తానికి వ్యక్తిగత బాండ్ తీసుకుని ఆ నలుగుర్ని విడుదల చేయాలని జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

కొడంగల్ వైద్య కళాశాలకు 316 పోస్టులు

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లో కొత్తగా ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ వైద్య కళాశాలకు మొత్తం 363 పోస్టులను మంజూరు చేస్తూ ఆర్థికశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్య కళాశాల కోసం 117, బోధనాసుపత్రికి 199, నర్సింగ్ కళాశాలకు 31, ఫిజియోథెరపీ కళాశాలకు 16 పోస్టులను మంజూరు చేసింది. ఈ పోస్టులన్నీ వైద్యవిద్య సంచాలకుల పరిధిలోకి వస్తాయని జీవో పేర్కొంది. కాగా, ఈ పోస్టుల్లో అత్యధికంగా 115 నర్సింగ్ అధికారులవి ఉండగా, 17 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2, 16 నర్సింగ్ లెక్చరర్ పోస్టులున్నాయి. అలాగే వైద్య కళాశాలలో 48 అసిస్టెంట్ ప్రొఫెసర్, 22 అసోసియేట్, 20 ప్రొఫెసర్ పోస్టులున్నాయి. వాస్తవానికి కొడంగల్ వైద్య కళాశాలను 50 ఎంబీబీఎస్ సీట్లతో ఏర్పాటు చేస్తున్నప్పటికీ, భవిష్యత్తులో సీట్లను వందకు పెంచుకునేందుకు వీలుగా పోస్టుల సంఖ్యను మంజూరు చేస్తూ సర్కారు ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

డీఆర్‌డీవో స్క్రామ్‌జెట్ ఇంజన్ పరీక్ష విజయవంతం

- హైదరాబాద్‌లోని డీఆర్‌డీఎల్‌లో అభివృద్ధి, ప్రయోగం

అల్వాల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ధ్వని కంటే ఐదు రెట్లు వేగంతో దూసుకెళ్లే హైపర్ సానిక్ క్షిపణుల ప్రయోగంలో ఉపయోగించేందుకు అభివృద్ధి చేసిన స్క్రామ్ జెట్ ఇంజన్‌ను డీఆర్‌డీవో విజయవంతంగా పరీక్షించింది. డీఆర్‌డీవోకు చెందిన హైదరాబాద్‌లోని డీఆర్‌డీఎల్(డిఫెన్స్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబొరేటరీ) ఈ యంత్రాన్ని అభివృద్ధి చేశారు. దేశంలోనే తొలిసారిగా డీఆర్‌డీఎల్‌లోనే ఈ స్క్రామ్ జెట్ ఇంజన్‌ను పరీక్షించారు. 120 సెకండ్ల పాటు ఇంజన్‌ను పరీక్షించిన(గ్రౌండ్ టెస్ట్) శాస్త్రవేత్తలు అత్యాధునిక హైపర్ సానిక్ క్షిపణుల అభివృద్ధిలో కీలక విజయం సాధించినట్టు ప్రకటించారు. గంటకు 5400 కిమీల వేగంతో దూసుకెళ్లే హైపర్ సానిక్ క్షిపణులు రక్షణ వ్యవస్థలను దాటుకుని లక్ష్యాలను చేరుకుంటాయని శాస్త్రవేత్తలు తెలిపారు. భారత్‌తోపాటు అమెరికా, చైనా, రష్యా దేశాలు హైపర్ సానిక్ సాంకేతిక అభివృద్ధి విషయంలో పని చేస్తున్నాయని డీఆర్‌డీవో పేర్కొంది. స్క్రామ్ జెట్ ఇంజన్ పరీక్ష విజయవంతం కావడంతో డీఆర్‌డీఎల్, డీఆర్‌డీవో బృందాలను రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.

రాష్ట్రంలో కొనసాగుతోన్న చలి తీవ్రత

- కొమరంభీం జిల్లా గిన్నెధారిలో 6డిగ్రీలు నమోదు

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతోంది. పలు జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 6 నుంచి 7 డిగ్రీలకు పడిపోయాయి. రాష్ట్రంలోనే అత్యల్ప కనిష్ఠ ఉష్ణోగ్రత 6 డిగ్రీలు కొమరంభీం జిల్లా గిన్నెధారిలో నమోదైంది. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 7 డిగ్రీలు, రంగారెడ్డి జిల్లా రెడ్డిపల్లెలో 7.6, ఆదిలాబాద్ జిల్లా బేలలో 7.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్‌లో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వద్ద 8.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు పేర్కొంది. రాబోయే రెండు రోజులు కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది.

జీహెచ్‌ఎంసీ మేయర్‌పై బీఆర్‌ఎస్ అవిశ్వాసం!

గ్రేటర్‌పై పట్టు నిలుపుకొనేలా పార్టీ వ్యూహం
నగర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ భేటీ

- విజయలక్ష్మిపై అవిశ్వాసంపై సుదీర్ఘ చర్చ
- పార్టీ బలాబలాలను పరిగణనలోకి.. తీసుకొని ముందుకెళ్లాలని నిర్ణయం
- బీఆర్‌ఎస్ తరఫున కార్పొరేటర్‌గా గెలిచి మేయరైన గద్వాల విజయలక్ష్మి
- ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో చేరిక
- ఫిబ్రవరి 10తో నాలుగేళ్ల పదవీకాలం పూర్తి.. ఆ తర్వాతే అవిశ్వాసానికి చాన్స్

హైదరాబాద్ సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని బీఆర్‌ఎస్ యోచిస్తోంది. తమ పార్టీ తరఫున కార్పొరేటర్‌గా గెలిచి జీహెచ్‌ఎంసీ మేయర్ పదవిని చేపట్టిన విజయలక్ష్మి.. కాంగ్రెస్‌లోకి మారిన నేపథ్యంలో ఈ ఆలోచన చేస్తోంది. తద్వారా రాజకీయంగా గ్రేటర్ హైదరాబాద్‌పై పట్టు నిలుపుకొనే వ్యూహాలు రచిస్తోంది. ఇందుకు సంబంధించి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ నివాసంలో గ్రేటర్ పరిధిలోని ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మేయర్‌పై అవిశ్వాసం విషయంపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమావేశం అనంతరం తలసాని తెలిపారు. కాగా, పార్టీకి ప్రస్తుతం ఉన్న బలం ఎంత? ఇతర సభ్యుల మద్దతు కూడగట్టడం ఎలా? అన్న అంశాలపై భేటీలో చర్చ జరిగినట్టు తెలిసింది. గ్రేటర్‌పై పట్టు జారలేదన్న సంకేతాలిచ్చేలా అవిశ్వాసం ఉండాలని, ఒకవేళ తగినంత మంది సభ్యుల మద్దతులేక అవిశ్వాసం వీగిపోతే.. ప్రతికూల పరిణామాలు ఉంటాయన్న అభిప్రాయమూ వ్యక్తమైనట్టు సమాచారం. అవిశ్వాసం పెట్టాలా? వద్దా? అన్నదానిపై శని లేదా ఆదివారం తుది నిర్ణయం తీసుకుంటామని ఓ ఎమ్మెల్యే తెలిపారు.



131 మంది మద్దతు ఉంటేనే..

మేయర్‌పై అవిశ్వాసం పెట్టాలని బీఆర్‌ఎస్ యోచిస్తున్న నేపథ్యంలో.. జీహెచ్‌ఎంసీ చట్టం ప్రకారం అవిశ్వాసం ఎప్పుడు పెట్టాలి? ఎంత మంది సభ్యుల మద్దతు అవసరం? ఎందరి మద్దతు ఉంటే అవిశ్వాసం నెగ్గుతుంది? అన్న అంశాలపై చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో నూతన మునిసిపల్ చట్టాన్ని తీసుకువచ్చిన గత ప్రభుత్వం.. జీహెచ్‌ఎంసీ చట్టంలోనూ పలు సవరణలు చేసింది. అంతకుముందు రెండేళ్ల పదవీకాలం పూర్తయ్యాక మేయర్‌పై అవిశ్వాసం పెట్టే అవకాశముండగా.. దానిని నాలుగేళ్లకు పెంచారు. జీహెచ్‌ఎంసీ ప్రస్తుత పాలక మండలి ఏర్పాటై 2025 ఫిబ్రవరి 10వ తేదీకి నాలుగేళ్లు పూర్తి కానుంది. దీంతో బీఆర్‌ఎస్ అవిశ్వాసం పెట్టాలనుకుంటే ఫిబ్రవరి 10 తర్వాతే పెట్టాలి. చట్టం ప్రకారం 50 శాతం సభ్యుల మద్దతుతో ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించే జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం కోసం ముందుగా లేఖ ఇవ్వాలి. దానిని పరిశీలించిన అనంతరం ప్రత్యేక సమావేశం నిర్వహణకు కలెక్టర్ తేదీని ప్రకటిస్తారు. ఆ సమావేశంలో రెండింట మూడో వంతు మంది అవిశ్వాసానికి మద్దతు తెలపాలి. జీహెచ్‌ఎంసీలో మొత్తం 150 మందికి గాను ప్రస్తుతం 146 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వీరికి తోడు 50 మంది ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి కౌన్సిల్‌లో196 మంది సభ్యులున్నారు. వీరిలో 131 మంది మద్దతు తెలిపితే అవిశ్వాసం నెగ్గుతుంది. లేనిపక్షంలో అవిశ్వాసం వీగినట్టే. అదే జరిగితే. మరో ఏడాది వరకు అవిశ్వాసం పెట్టే అవకాశం లేదు. కానీ, అప్పటికే పాలకమండలి గడువు ముగుస్తుంది.

సభ్యుల మద్దతు ఎలా?

గ్రేటర్ కౌన్సిల్‌లో 198 మంది సభ్యులున్న దృష్ట్యా.. 98 మంది మద్దతుంటేనే ప్రిసైడింగ్ అధికారి అవిశ్వాసంకు అనుమతిస్తారు. 2020 జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్-56, బీజేపీ-48, ఎంఐఎం- 44, కాంగ్రెస్-2 స్థానాల్లో గెలిచాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పలువురు కార్పొరేటర్లు పార్టీలు మారారు. మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి హస్తం గూటికి చేరారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల సంఖ్య 40, బీజేపీ-41, ఎంఐఎం-41, కాంగ్రెస్-24గా ఉంది. గ్రేటర్‌లోని 24 నియోజకవర్గాల్లో ప్రస్తుతం 11 స్థానాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఏడు చోట్ల ఎంఐఎం, ఒక నియోజకవర్గంలో బీజేపీ, ఐదు చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నారు. గ్రేటర్ పరిధిలోని ఐదు ఎంపీ స్థానాలకుగాను నాలుగు బీజేపీ, ఒకటి ఎంఐఎంకు దక్కాయి. కౌన్సిల్‌లో బలాబలాల నేపథ్యంలో బీఆర్‌ఎస్ ఒంటరిగా అవిశ్వాసం పెట్టే అవకాశం లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు విప్ జారీ చేసినా.. ఆ పార్టీ సభ్యుల సంఖ్య 80కి మించదు. ఈ నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది తేలాల్సి ఉంది.



ముషీరాబాద్ ఆర్టీసీ ఖాళీస్థలంలో నిరుపయోగంగా పడిఉన్న వజ్ర బస్సులు

వజ్రాలకు తుప్పు!

- నిరుపయోగంగా 50 వజ్ర బస్సులు
- రూ.22 కోట్లు వెచ్చించి కొనుగోలు
- చార్జీలు ఖరీదు.. ఆక్యుపెన్సీ 50శాతంలోపే
- అందుకే పక్కన.. ఆ బస్సులు ఇక తుక్కుకే?

హైదరాబాద్ సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వజ్ర బస్సులు! ఏసీ, అద్భుతమైన సీటింగ్ సౌకర్యంతో విలాసవంతమైన ప్రయాణం! ప్రజలకు చక్కని ప్రయాణ అనుభూతిని ఇచ్చేందుకు ఏడేళ్ల క్రితం 100 బస్సులను టీజీఎస్ఆర్టీసీ కొనుగోలు చేసింది. ఈ బస్సుల కోసం రూ.22 కోట్లు వెచ్చించారు. వీటిలో ఓ యాభై బస్సులు ముషీరాబాద్ ఆర్టీసీకి చెందిన ఖాళీ స్థలంలో చాన్నాళ్ల నుంచి వృథాగా పడిఉన్నాయి. సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తుప్పుపడుతున్నాయి. 2017లో వజ్ర బస్సుల సేవలను ఆర్టీసీ ప్రారంభించింది. మెహిదీపట్నం, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్ నుంచి కరీంనగర్, వరంగల్, గోదావరఖని తదితర చోట్లకు తిప్పింది. అయితే రెండేళ్లు కూడా నడపకుండానే పక్కన పెట్టింది. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారానే టికెట్లు ఉండటం, చార్జీలూ భారీగా ఉండటం, 50శాతానికి మించి ఆక్యుపెన్సీ లేకపోవడంతో సర్వీసులను నిలిపివేశారు. కొంతకాలం ఈ బస్సులను శుభకార్యాలయాల కోసం అద్దెకిచ్చారు. ఆ తర్వాత ప్రయాణికుల నుంచి పెద్దగా అదరణ రావడం లేదంటూ డిపోలకే పరిమితం చేశారు. మిగతా యాభై బస్సుల్లో పదింటిని కార్గో సేవల కోసం వినియోగించుకుంటుండగా మిగిలిన 40 బస్సులు జిల్లాల డిపోల్లో ఉన్నాయి.

అప్పుడే అమ్మితే సగం డబ్బులైనా వచ్చేవి

వజ్ర బస్సులు కండిషన్‌లో ఉన్నప్పుడే అమ్మితే సగం డబ్బులైన ఆర్టీసీ ఖాతాలోకి వచ్చేవి కదా అంటూ కార్మిక సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. ఆ బస్సులను అమ్మకుండా మూలన పడేయడంతో ఇవాళ అవి ఎందుకూ పనికిరాకుండా పోయాయని అంటున్నారు.

శంషాబాద్ విమానాశ్రయం సరికొత్త రికార్డు

- ఒకే రోజు 94,630 మంది ప్రయాణికులు
- గత ఏడాది 2.78 కోట్ల మంది

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సరికొత్త రికార్డు నమోదు చేసింది. రోజుకు లక్ష మంది ప్రయాణికులకు చేరువైంది. ఈ నెల 18న శంషాబాద్ విమానాశ్రయం నుంచి 94,630 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఈ విమానాశ్రయం నుంచి ఇటీవల దేశీయ, అంతర్జాతీయ సర్వీసుల సంఖ్య పెరగడంతో ప్రయాణికుల రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. డిసెంబరు 22న రికార్డు స్థాయిలో 92 వేల మంది దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికులు రాకపోకలు సాగించారు. అప్పటి వరకు అదే రికార్డు. అయితే సంక్రాంతి, కుంభమేళా సందర్భంగా ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. సంక్రాంతి సెలవులు ముగియడంతో నగరానికి పెద్ద సంఖ్యలో ప్రయాణికులు తిరిగి వచ్చారు. దీంతో పాటు కుంభమేళాకు వెళ్లే వచ్చే వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఈ కారణంగా ఈ నెల 18న శంషాబాద్ విమానాశ్రయం నుంచి రికార్డుస్థాయిలో 94,630 మంది ప్రయాణికుల సంఖ్య నమోదైంది. ఆ రోజు 607 విమానాలు రాకపోకలు సాగించాయి. కాగా గత ఏడాది శంషాబాద్ విమానాశ్రయం నుంచి రికార్డుస్థాయిలో 2.78 కోట్ల మంది రాకపోకలు సాగించారు.

వినతుల వెల్లువ!

తొలిరోజు 3,410 గ్రామసభల నిర్వహణ

- జాబితాలో పేర్లు లేవని ప్రజల అసంతృప్తి
- మళ్లీ దరఖాస్తుకు అధికారుల సూచన
- కొత్తగా 47,413 దరఖాస్తుల స్వీకరణ
- పథకాలకు అనర్హులను ఎంపిక చేశారంటూ పలుచోట్ల నిరసనలు
- యాదాద్రి భువనగిరి జిల్లాలో దరఖాస్తులు వదిలేసిన సిబ్బంది
- ఇద్దరు మునిసిపల్ బిల్ కలెక్టర్ల సస్పెన్షన్

హైదరాబాద్, న్యూస్‌నెట్‌వర్క్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామసభల్లో ప్రజలు తమ సమస్యలను ఏకరువుపెట్టారు. పథకాలకు సంబంధించి లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి, నిరసన వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల ఇది తీవ్రస్థాయిలో ఉండటంతో అధికారులు అర్ధాంతరంగా గ్రామసభలను ముగించేశారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, కొత్త రేషన్‌కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకాలకు అర్హులను గుర్తించేందుకు రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం గ్రామసభలు ప్రారంభమయ్యాయి. మొత్తం 12,769 గ్రామ పంచాయతీలు ఉండగా తొలిరోజు 3,410 పంచాయతీల పరిధిలో గ్రామసభలు జరిగాయి. కులగణన సర్వే, ప్రభుత్వం వద్ద ఉన్న పేద కుటుంబాల సమాచారం ఆధారంగా లబ్ధిదారుల తాత్కాలిక జాబితాను అధికారులు గ్రామసభల్లో ప్రజల ముందుంచి అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలుసుకున్నారు. తమకు అర్హతలున్నా కూడా.. లబ్ధిదారుల జాబితాలో చేర్చలేదని పలుగ్రామాల్లో అధికారులను ప్రజలు ప్రశ్నించారు. అయితే పేర్లు రానివారు మరోసారి దరఖాస్తు చేసుకోవచ్చునని అధికారులు సూచించడంతో ప్రజలు అక్కడికక్కడే దరఖాస్తులిచ్చారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా తొలిరోజు 47,413 దరఖాస్తులొచ్చినట్లు అధికారులు వెల్లడించారు. మరో మూడు రోజులు గ్రామసభలు కొనసాగనున్నాయని చెప్పారు.

నిరసనలు.. ఆందోళనలు..

కొత్త రేషన్‌కార్డుల కోసం ఎన్నిసార్లు దరఖాస్తులివ్వాలి? అంటూ నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి, భీంగల్, ఎడపల్లిలో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు ప్రశ్నించారు. డొంకేశ్వర్ మండలం గాదెపల్లిలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం ఎంపిక చేసిన జాబితా సరిగా లేదని నిరసన వ్యక్తం చేశారు. గాదెపల్లిలో ఆత్మీయ భరోసా జాబితా సక్రమంగా లేదని గ్రామస్థులు గ్రామసభను బహిష్కరించారు. కామారెడ్డి జిల్లా గౌరారంలో.. కూలీలు ఎక్కువమంది ఉన్నా కేవలం 16మందినే ఆత్మీయ భరోసాకు ఎంపిక చేశారంటూ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌లో అనర్హులతో లబ్ధిదారుల జాబితా రూపొందించారంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేయడంతో పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. నిర్మల్ జిల్లా కడ్తాల్‌లో నిర్వహించిన గ్రామసభలో.. జాబితాను నిబంధనలకు విరుద్ధంగా రూపొందించినట్లు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో సభను అర్ధాంతరంగా ముగించారు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం కూనూరులో.. తమకు పెళ్లయి ఏళ్లు గడుస్తున్నా రేషన్ కార్డు రావడం లేదని, వేరే కాపురం ఉంటున్నా కొత్త కార్డు ఇవ్వడంలేదని పలువురు అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ గ్రామసభలో కొందరు రుణమాఫీ పైనా ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం గట్టుసింగారంలో పథకాలకు అనర్హులను ఎంపిక చేశారని గోడకు అతికించిన జాబితాను చింపేశారు. గద్వాల జిల్లా మన్నాపురంలో జాబితా అంతా ఒకే వర్గానికి చెందిన వారి పేర్లతో ఉందని ప్రజలు నిరసన తెలిపారు.



పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం పెంచికల్ పేటలో తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అధికారుల కాళ్లు మొక్కుతున్న మహిళ గొల్లెన లావణ్య

కాల్మొక్తా.. ఇల్లు ఇప్పియుండ్రి

"నీ బాంచెన్ నీ కాళ్ల మొక్కుతా.. మాకు ఇల్లు ఇప్పియుండ్రి" అంటూ పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేటలో నిర్వహించిన గ్రామసభలో గొల్లెన లావణ్య అధికారుల కాళ్లు మొక్కింది. నిరుడు ప్రజాపాలన గ్రామసభలో వివిధ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారి జాబితాలో తన పేరు లేకపోవడంతో లావణ్య కంగుతింది. "మా పేరు ఎందుకు లేదు సార్" అంటూ అధికారులను ప్రశ్నించింది. వానొస్తే.. ఆ వరదలో ఇల్లు మునుగుతోందని, అధికారులొచ్చి ఎన్టీపీసీ కమ్యూనిటీ హాలుకు తరలిస్తున్నారని, ఇప్పటికే ఇంటి గోడలు బీటలువారాయని ఆవేదన వ్యక్తం చేసింది. అయితే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని అధికారులు ఆమెకు చెప్పారు.

పైడి రాకేశ్ రెడ్డికి నిరసన సెగ

ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డికి మంగళవారం నిరసన సెగ తగిలింది. నందిపేట మండలం కుద్వాన్‌పూర్ గ్రామసభలో పాల్గొన్న ఎమ్మెల్యేను పలువురు గ్రామస్థులు నిలదీశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు ఏమైందని ప్రశ్నించారు. హామీలు అమలు చేస్తేనే తమ గ్రామానికి రావాలని స్పష్టం చేశారు. దీంతో రాకేశ్‌రెడ్డి వెనుదిరిగారు.

ఇల్లొచ్చిందని దివ్యాంగురాలి ఆనందం

తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని తెలియడంతో ఓ దివ్యాంగురాలు సంతోషంతో ఉక్కిరిబిక్కిరైంది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంటలో మంగళవారం జరిగిన గ్రామసభలో ఈ ఘటన జరిగింది. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎంపిక చేసిన జాబితాలో దివ్యాంగురాలు వలకట్ల భూమక్క పేరు చదివారు. దీంతో ఇన్నాళ్లు ఇల్లు లేక ఇబ్బందిపడ్డ భూమక్క కన్నీటిపర్యంతమైంది.

దరఖాస్తులు వదిలేసి వెళ్లారు

యాదాద్రి జిల్లా కేంద్రం భువనగిరి మునిసిపల్ పరిధిలోని 7వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను వదిలేసి వెళ్లడం చర్చనీయాశంమైంది. గ్రామసభ ముగిశాక ప్రత్యేక అధికారి వి.రాధిక, క్లస్టర్ లెవెల్ అధికారి ఐ.రాణితో పాటు హెల్ప్ డెస్క్ సిబ్బంది అయిన ఇన్‌చార్జి బిల్ కలెక్టర్లు కె.రాము, ఎండీ.షఫీ వెళ్లిపోయారు. అయితే దరఖాస్తులను సమావేశ స్థలంలోనే వదిలేశారు. గమనించిన కొందరు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టి సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ద్వారా అధికారులకు ఫిర్యాదు చేశారు. మునిసిపల్ కమిషనర్ పి రామాంజులరెడ్డి విచారణ జరిపి, దరఖాస్తులను మరిచిపోయిన వార్డు సభ హెల్ప్ డెస్క్ ఇన్‌చార్జిలైన మునిసిపల్ బిల్ కలెక్టర్లు కె.రాము, ఎండీ.షఫీని సస్పెండ్ చేశారు.

విశ్వవిద్యాలయాలు కేంద్రం గుప్పిట్లోకి!

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయించింది. యూజీసీ ప్రతిపాదించిన ముసాయిదా అమల్లోకి వస్తే.. వర్సిటీల్లో చాలా మార్పులు వస్తాయి. ముఖ్యంగా ఉపకులపతు(వీసీ)ల నియామకాల్లో రాష్ట్రాలకు ఎలాంటి అధికారం ఉండదు. ప్రస్తుత విధానం ప్రకారం.. వీసీల నియామకాలకు తొలుత ప్రభుత్వం నుంచి ఒకరు, యూనివర్సిటీ నుంచి ఒకరు, యూజీసీ నుంచి మరొకరు సభ్యులుగా సెర్చ్ కమిటీలు ఏర్పాటు చేస్తారు. సెర్చ్ కమిటీ వీసీ పోస్టుల కోసం ఐదుగురి పేర్లతో జాబితాను ప్రభుత్వానికి పంపిస్తుంది. వాటిని పరిశీలించిన తర్వాత ప్రభుత్వం గవర్నర్ ఆమోదానికి పంపిస్తుంది. గవర్నర్ ఆమోదం తర్వాత వీసీని నియమిస్తూ నోటిఫికేషన్ జారీ చేస్తారు. కానీ, తాజా ముసాయిదా ప్రకారం.. వీసీల నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి పాత్ర ఉండదు. సెర్చ్ కమిటీల్లో యూజీసీ నుంచి ఒకరు, వర్సిటీ నుంచి ఒకరు, గవర్నర్ సూచించే మరో వ్యక్తి ఉంటారు. కమిటీ తన ప్రతిపాదనలను నేరుగా గవర్నర్‌కు పంపిస్తే, గవర్నర్ వీసీని ఎంపిక చేస్తారు. ఇక వీసీలుగా ఎవరిని నియమించాలనే విషయంలోనూ యూజీసీ మార్పులు చేయాలని నిర్ణయించింది. ఇప్పుడున్న పద్ధతి ప్రకారం.. వీసీ పోస్టుకు అర్హత సాధించాలంటే కనీసం 10 ఏళ్ల పాటు ప్రొఫెసర్‌గా పనిచేసిన అనుభవం ఉండాలి. కానీ, ముసాయిదాలో దీన్ని తొలగించారు. వీసీ పోస్టు కోసం పారిశ్రామికవేత్తలతో పాటు మేధావులు, పరిశోధనా ప్రతినిధులు, పాలనా అనుభవం ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. అంటే వర్సిటీల్లో పనిచేయనివారు, ప్రొఫెసర్లు కానివారు ఎవరైనా వీసీలుగా ఎంపికయ్యే అవకాశం ఉంటుంది.

ప్రొఫెసర్ల నియామకాల్లోనూ..

ముసాయిదాలో మరో ప్రధాన అంశం.. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ల నియామకాల్లో మార్పులు. ప్రస్తుతం ఈ పోస్టులకు అర్హత సాధించాలంటే ఒకే సబ్జెక్టులో పీజీ, పీహెచ్‌డీ చేసి ఉండాలి. తాజా ముసాయిదా ప్రకారం.. గ్రాడ్యుయేషన్, పీజీల్లో ఏ సబ్జెక్టు చదివినా, పీహెచ్‌డీ చేసిన సబ్జెక్టుతో ప్రొఫెసర్ పోస్టులకు అర్హత సాధించే అవకాశం ఉంది. అలాగే కాంట్రాక్టు పద్ధతిలో బోధన సిబ్బందిని గరిష్ఠంగా ఆరు నెలల కంటే ఎక్కువ కాలం నియమించకూడదని పేర్కొన్నారు. యూజీసీ ముసాయిదాను విద్యావేత్తలు వ్యతిరేకిస్తున్నారు. వర్సిటీలను తమ అధీనంలోకి తీసుకొనే దిశగా కేంద్రం అడుగులు వేస్తోందని ఆరోపిస్తున్నారు.

రాష్ట్రాల హక్కులను హరించడమే..

రాష్ట్రాల హక్కులను హరించడానికే యూజీసీ ఈ ముసాయిదాను రూపొందించింది. దీన్ని తీవ్రంగా వ్యతిరేకించాలి. ఈ ముసాయిదాపై అధ్యయనం చేస్తున్నాం. దీనిపై ప్రత్యేక నివేదికను ముఖ్యమంత్రికి అందజేస్తాం. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

- బాలకిష్టారెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్

ఇది రాజ్యాంగ విరుద్ధం

యూజీసీ చేయాలనుకుంటున్న మార్పులు రాజ్యాంగ విరుద్ధమైనవి. వర్సిటీలను పూర్తి స్థాయిలో తమ చేతుల్లోకి తీసుకోవడానికి కేంద్రం చేస్తున్న ప్రయత్నంగా నిర్ణయం ఉంది. వర్సిటీలపై రాష్ట్రాలకే నియంత్రణ ఉండాలి. కేంద్రం, యూజీసీ తమ అభిప్రాయాలను రుద్దాలని చూస్తున్నాయి. దీన్ని వ్యతిరేకించాలి

- ప్రొఫెసర్ లింబాద్రి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.